సోమవారం
7•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 193
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD





## దేశమంతా కేసీఆర్ ఫార్ములా

రైతుబంధు తరహా పథకం అమలుచేయండి

దేశంలో వ్యవసాయ సంక్షోభ నివారణకు ఇది ఉత్తమ మార్గం

కేంద్ర ప్రభుత్వానికి సూచించిన నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ రమేశ్‌చంద్

2

# తెలంగాణ టీఆర్‌ఎస్‌దే

## లోక్‌సభ ఎన్నికల్లో 16 సీట్లు ఖాయం.. కొనసాగనున్న సీఎం కేసీఆర్ హవా



- కేంద్రంలో మెజార్టీకి 15 సీట్ల దూరంలో నిలువనున్న ఎన్డీఏ
- ప్రభుత్వం ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలదే కీలకపాత్ర
- తేల్చిన ఇండియా టీవీ-సీఎన్‌ఎక్స్ సర్వే

**న్యూఢిల్లీ, జనవరి 6:** త్వరలో జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ తెలంగాణ ప్రజలు టీఆర్‌ఎస్‌కే పట్టం కడుతారని ఇండియా టీవీ-సీఎన్‌ఎక్స్ సర్వే తేల్చి చెప్పింది. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో టీఆర్‌ఎస్ పార్టీ 16 సీట్లు గెలుచుకుంటుందని స్పష్టంచేసింది. డిసెంబర్ 15-25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే వివరాలను తాజాగా విడుదలచేసింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ ప్రజలు మరోసారి సీఎం కేసీఆర్ వెన్నంటే ఉంటారని తేలింది. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ 19 స్థానాల్లో విజయం సాధిస్తుందని, టీడీపీ నాలుగు స్థానాలకే పరిమితం అవుతుందని సర్వే వెల్లడించింది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ.. మెజార్టీకి 15 స్థానాల దూరంలో నిలిచిపోతుందని పేర్కొన్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమికి మ్యాజిక్ ఫిగర్‌లో సగం సీట్లు మాత్రమే వస్తాయని, కాంగ్రెస్‌కు ఈసారి కూడా అధికారం అందని ద్రాక్షేనని స్పష్టంచేసింది. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటులో ఈసారి ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారుతాయని తేల్చింది. దేశవ్యాప్తంగా 543 పార్లమెంటరీ నియోజకవర్గాలు ఉన్నాయి. 272 సీట్లు గెలుచుకున్న పార్టీ లేదా కూటమి కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది.

**అప్పుడూ.. ఇప్పుడూ టీఆర్‌ఎస్సే**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇండియాటీవీ-సీఎన్‌ఎక్స్ చేసిన సర్వేలో ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా ఉంటాయని తేలింది. టీఆర్‌ఎస్ స్పష్టమైన మెజార్టీ సాధిస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తేల్చిచెప్పింది. నాలుగున్నరేండ్ల టీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన వినూత్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, మళ్లీ కేసీఆర్‌కే పట్టం కడుతారని పేర్కొన్నది. ఈ అంచనాలు నిజమయ్యాయి. టీఆర్‌ఎస్ పార్టీ 88 సీట్లు

మిగతా 2వ పేజీలో

# అయ్యో.. ఎంత ఘోరం!

తమిళనాడులో రోడ్డుప్రమాదం.. అయ్యప్ప భక్తుల వ్యాన్‌ను ఢీకొట్టిన కంటైనర్

శబరిమలకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన

## 11 మంది దుర్మరణం

మరో ఐదుగురికి తీవ్రగాయాలు

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి

**మెదక్ ప్రతినిధి/నర్సాపూర్, నమస్తే తెలంగాణ:** తమిళనాడులో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం పుదుకొట్టై జిల్లా తిరుమయం వద్ద అయ్యప్ప భక్తులతో వెళ్తున్న వ్యాన్‌ను కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన 11 మంది దుర్మరణంచెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఖాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాల్లో విషాదం అలుముకున్నది. ఈ నెల 2న ఖాజీపేటకు చెందిన నాగరాజుగౌడ్ (38), మస్కూరి రాజు, జుర్రు మహేశ్ (30),

మిగతా 4వ పేజీలో



తమిళనాడు పుదుకొట్టై జిల్లా తిరుమయం వద్ద కంటైనర్ లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన అయ్యప్ప భక్తుల వ్యాన్

## గ్రామ స్వరాజ్యం

తొలి విడుతకు నేటినుంచి

# నామినేషన్లు

197 మండలాలు,
4,480 గ్రామపంచాయతీల్లో నోటిఫికేషన్

వార్డులవారీగా ఓటర్ల జాబితా..
నామినేషన్లకు మార్గదర్శకాలు

9

- 10న నామినేషన్ల పరిశీలన
- 11న అభ్యంతరాల స్వీకరణ
- 12న తుది జాబితా ప్రకటన
- 13 నుంచి 20 వరకు ఎన్నికల ప్రచారం
- 21న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన

## యువ రియల్టర్ల హవా!

పట్నం నుంచి పల్లెకు మారిన మకాం..

ఇంటింటికీ కిలో చికెన్, ఫుల్ బాటిల్ పంపిన ఓ నేత

మానుకోట యువకుడిపై

# అమెరికాలో కాల్పులు

ప్రాణాపాయస్థితిలో సాయికృష్ణ పూస



సాయికృష్ణ పూస (ఫైల్ ఫొటో)

- రాత్రి ఉద్యోగం నుంచి వస్తుండగా కారు దారిమళ్లింపు
- డబ్బు, బట్టలు తీసుకుని నోటిలో కాల్చిన దుండగులు
- చలిలో రోడ్డుపై పడేసి పలాయనం.. పరిస్థితి విషమం
- క్రౌడ్‌ఫండింగ్‌తో అండగా నిలుస్తున్న మిత్రబృందం

4



# వెన్నుపోటు బాబు!

- ఎన్టీఆర్‌నే మోసంచేసిన వ్యక్తి ఏపీని మోసం చేయలేడా?
- అధికారం కోల్పోతామనే భయంతోనే అసహనం
- ఏపీ సీఎం చంద్రబాబుపై ప్రధాని మోదీ వ్యాఖ్యలు

2





## కేటీఆర్‌కు మరో అరుదైన గుర్తింపు

- హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సుకు ఆహ్వానం
- ప్రత్యేక వక్తగా ప్రసంగించాలని కోరిన నిర్వాహకులు

3



## స్టేషన్‌కు 20 నిమిషాలు ముందే రావాలి

- రైల్వేలోనూ ఎయిర్‌పోర్ట్ తరహా భద్రతా వ్యవస్థ!
- అలహాబాద్, హుబ్లీ స్టేషన్లలో ఇప్పటికే ప్రారంభం
- మరో 202 స్టేషన్లలో అమలుకు రైల్వే శాఖ సన్నాహాలు

5



## డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆధార్ లింకు తప్పనిసరి!

- త్వరలోనే కేంద్రం నిర్ణయం
- కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడి

5



## కాంగ్రెస్ నుంచి సర్వే సస్పెన్షన్

సమీక్ష సమావేశం రచ్చ రచ్చ

కుంతియా, ఉత్తమ్‌లపై సర్వే ఫైర్

సీట్లు అమ్ముకున్నారంటూ బండ బూతులు

అడ్డుకున్నవారిపై వాటర్ బాటిళ్లతో దాడి

వారిద్దరి బండారం బయటపెడుతానని హెచ్చరిక

2



## మార్కెట్‌లో కేసీఆర్ పతంగులు

సంక్రాంతి పండుగ వచ్చిందంటే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పతంగులకు మార్కెట్‌లో భలే గిరాకీ ఉంటుంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రాలతో కూడిన పతంగులను ఈ సారి తయారీదారులు పెద్దసంఖ్యలో రూపొందించారు. వాటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు అమిత ఆసక్తి కనబరుస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని దూల్‌పేట మార్కెట్‌లో కేసీఆర్ పతంగులను వినియోగదారులు కొనుగోలుచేశారు.

## నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

- తొలిసారి జరిగే అసెంబ్లీ సమావేశాలపై చర్చ

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** తెలంగాణలో రెండోసారి రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరిన తరువాత తొలి మంత్రివర్గ సమావేశం సోమవారం ఉదయం 11.30 గంటలకు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగనున్నది. ముఖ్యమంత్రితోపాటు మరో మంత్రితో ఉన్న ఈ క్యాబినెట్ సమావేశంలో తొలిసారి జరిగే అసెంబ్లీ సమావేశాలపై చర్చ జరుగుతుంది. క్యాబినెట్ భేటీ తర్వాత అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం శాసనసభ సచివాలయాన్ని కోరనున్నది.

## నా పేరుతో సంఘాలు వద్దు

- ఇప్పటికే ఏర్పాటుచేసిన వాటిని రద్దుచేయండి
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తన పేరుతో ఎలాంటి సంఘాలను ఏర్పాటు చేయొద్దని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. తన పేరుతో ఏర్పాటుచేస్తున్న వివిధ సంఘాలు, యువసేనలు, అభిమాన సంఘాలకు తనవైపు నుంచి ఎలాంటి మద్దతులేదని స్పష్టంచేశారు. కేటీఆర్ యువసేన, కేటీఆర్ సేవాదళ్, కేటీఆర్ అభిమాన సంఘం వంటి పేర్లతో పలువురు సంఘాలను ఏర్పాటుచేసినట్టు, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ ఈ సంఘాల పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి వాటిని తాను ఏమాత్రం ఆమోదించబోనని, తనపై, పార్టీపై అభిమానంతో ఇప్పటికే పలు జిల్లాల్లో ఏర్పాటుచేసిన సంఘాలను వెంటనే రద్దు చేసుకోవాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీపై, తనపై అభిమానం ఉంటే కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్‌తోగానీ, పార్టీ అనుబంధ సంఘాలతో గానీ కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. కేటీఆర్ యువసేన పేరుతో పలువురు కార్యకర్తలు ఆయనను కలువగా.. సంఘాన్ని రద్దుచేసుకోవాలని, టీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.



## నేటినుంచి తహసీల్దార్లకు భూరికార్డుల వెబ్‌కరెక్షన్ ఆప్షన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



ఆన్‌లైన్‌లో భూరికార్డుల నమోదులో జరిగిన పొరపాట్లను సరిచేయడానికి సీసీఎల్‌ఏ.. తహసీల్దార్లకు సోమవారం నుంచి వెబ్‌కరెక్షన్ ఆప్షన్లు అందుబాటులోకి తెచ్చింది. దీంతో మండల కార్యాలయాల్లో తహసీల్దార్లు మిస్సింగ్ సర్వే నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. చాలాచోట్ల వ్యవసాయ భూమిని రికార్డుల్లో ప్లాట్లుగా నమోదుచేశారు. వీటిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్లు తప్పుడు ఎంట్రీలు జరిగిన వాటిని సరిదిద్దుతారు. వాస్తవానికి భూరికార్డుల ప్రక్షాళనలో పార్ట్(ఏ) కింద 1.42 కోట్ల ఎకరాల భూమి రికార్డులను ప్రక్షాళన చేశారు. వీటిని ధరణిలో నమోదుచేసే సందర్భంగా అనేక సమస్యలు తలెత్తాయి. ఏ చిన్న పొరపాటు జరిగినా తిరిగి మార్చడానికి తహసీల్దార్లకు ఆప్షన్ లేకపోవడంతోచాలా సమస్యలు వచ్చాయి. కొందరు రైతుల సర్వేనంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు, కొందరు రైతులకు ఒక సర్వే నంబర్‌కు బదులు మరొకటి నమోదయింది. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరించడానికి వీలుగా సీసీఎల్‌ఏ తహసీల్దార్లకు వెబ్‌కరెక్షన్ ఆప్షన్ ఇచ్చింది. దీంతో నేటి నుంచి తహసీల్దార్లు ఆన్‌లైన్‌లో కరెక్షన్లు చేసి, పట్టాదార్ పాస్‌పుస్తకాలు ముద్రించి అందించే ఏర్పాట్లు చేయనున్నారు. మొదటి ప్రాధాన్య అంశంగా రెవెన్యూ అధికారులు వెబ్‌కరెక్షన్‌ను తీసుకుంటున్నారు.



### ముహూర్తం



సూర్యోదయం: 6.52 గంటలకు



సూర్యాస్తమయం: 5.53 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం పాడ్యమి ఉదయం 9.21 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తరాషాఢ రాత్రి 8.37 వరకు, తదుపరి శ్రవణం, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.27 నుంచి 3.03 వరకు, రాహుకాలం ఉదయం 8.14 నుంచి 9.37 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.00 నుంచి 12.44 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.57 నుంచి 3.41 వరకు, వర్జ్యం: లేదు.

### లోకం పోకడ



గ్యాస్ ధర తగ్గితే మాత్రం చలిమంట ఇలాగేనా వేసుకునేది?

# కొత్త పథకాల అమలుకు కసరత్తు

**పక్కా ప్రణాళికలను సిద్ధంచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. వరుస ఎన్నికలతో మే వరకు ఎన్నికల కోడ్**

- కేంద్రబడ్జెట్ తర్వాతే రాష్ట్ర ఆదాయంపై స్పష్టత
- పూర్తిస్థాయి బడ్జెట్‌లో స్కీంలకు నిధుల కేటాయింపు
- అప్పటినుంచే పథకాలు అమలులోకి వచ్చే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాల అమలుకు పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుపై దృష్టి కేంద్రీకరించిన అధికారులు.. ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ విడుదలచేశారు. ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఇది ఒక్క గ్రామ పంచాయతీ ఎన్నికలతోనే ఆగిపోయేలా లేదు. ఈ ఎన్నికలు పూర్తికాగానే ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ముగ్గురు ఎమ్మెల్సీలతోపాటు మరో ఎమ్మెల్సీ కూడా రాజీనామా చేయడంతో ప్రస్తుతం నాలుగు ఖాళీలున్నాయి. మార్చి 29వ తేదీనాటికి మరో 11 మంది ఎమ్మెల్సీల పదవీకాలం ముగుస్తుంది. దీంతో 15 స్థానాలకు ఫిబ్రవరిలో లేదా మార్చి మొదటివారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇవి ముగియగానే పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. ఇలా వరుసగా ఎన్నికలు రానుండటంతో టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన పథకాలను వెంటనే అమల్లోకి తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంలోనే.. అప్పటికే అమలులో ఉన్న పథకమైన బతుకమ్మ చీరెల పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఎన్నికల అనంతరం బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాతే కొత్త పథకాల అమలుకు వీలవుతుందని అధికారులు చెప్తున్నారు.

### ముందుగా ప్రయత్నించినా అభ్యంతరాలు తప్పవు

సీఎం కేసీఆర్ ప్రకటించిన ఆసరా పెన్షన్లు నెలకు రూ.1000 నుంచి రూ.2016కు పెంపు, పెన్షన్ అర్హత వయసు 60 నుంచి 57 ఏండ్లకు కుదింపు, వికలాంగుల పెన్షన్లు రూ.1500 నుంచి రూ.3016కు పెంపుతోపాటు నిరుద్యోగ భృతి రూ.3016 అమలు, రైతుబంధు పథకం రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంపు తదితర పథకాలను పక్కాగా అమలుచేయడానికి సర్కారు ప్రణాళికలను సిద్ధంచేస్తున్నది. అమలులో అవకతవకలకు ఆస్కారం లేకుండా అధికారులు విధివిధానాలు రూపొందించనున్నారు. ఇదే సమయంలో ఎంతవేగంగా ప్రయత్నించినా ఎన్నికల కోడ్ మొత్తం ముగిశాకే పథకాలను అమలులోకి తీసుకురావడం సాధ్యమవుతుందని అంటున్నారు. ఏమాత్రం ముందుగా ప్రయత్నించినా ఎన్నికల సంఘం అభ్యంతరాలు చెప్పే ప్రమాదం ఉందని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. పథకాలపై అమలుకు పక్కాగా ప్రణాళికలు రూపొందించడానికి కనీసం ఐదు నెలల వెసులుబాటు ఉంటుందని, ఖర్చు, ఆదాయం వివరాలను కూడా పొందుపరచనున్నామని వెల్లడించారు. అప్పుడే కొత్త పథకాలు అమలులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

### కేంద్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాకే..

కేంద్రంలో పూర్తిస్థాయి బడ్జెట్ లేకుండా ఏ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టలేవు. కేంద్రం నుంచి ఎంత రాబడి వస్తుందనే అంచనా లేకుండా ముందుకెళ్తే రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాతే రాష్ట్రం కూడా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. ఒకవేళ పూర్తిస్థాయి బడ్జెట్‌పెట్టినా ఆ తర్వాత రివైజ్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. కేంద్రం నుంచి వచ్చే ఆదాయాన్ని అంచనా వేసుకోవడంతోపాటు ఏ పథకానికి ఎక్కడి నుంచి ఆదాయాన్ని సమకూర్చుకోవాలనే పక్కాలెక్కలు రూపొందించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రారంభించిన ఏ ఒక్క పథకం కూడా మధ్యలో ఆగిపోయే ఆస్కారం లేకుండాఒక్కో పథకానికి వచ్చే ఆదాయంపై కూడా స్పష్టత వస్తుందని, ఆ దిశగా తాము ప్రయత్నిస్తున్నామని మరో సీనియర్ అధికారి తెలిపారు.

## వెన్నుపోటు బాబు

- ఎన్టీఆర్‌ను మోసంచేసిన వ్యక్తి ఏపీని మోసం చేయలేడా?
- అధికారం కోల్పోతామనే భయంతోనే అసహనం
- ఏపీ సీఎం చంద్రబాబుపై ప్రధాని మోదీ వ్యాఖ్యలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన కాంగ్రెస్ పార్టీని టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు ఎప్పటికీ క్షమించలేదని, అలాంటి కాంగ్రెస్‌తో జత కలిసి ఏపీ సీఎం చంద్రబాబు.. ఎన్టీఆర్‌కు రెండోసారి వెన్నుపోటు పొడిచారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌నే మోసం చేసిన చంద్రబాబు ఏపీ ప్రజలను మోసం చేయడం తప్ప ఇంకేమి చేస్తారు? అని ప్రశ్నించారు. ఆదివారం ఏపీలోని బూత్‌స్థాయి కార్యకర్తలతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చంద్రబాబు తన కుమారుడికే అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలోని ఎందరో యువతీ, యువకుల జీవితాలను పణంగా పెడుతున్నారని పేర్కొన్నారు. కుమారుడికి పదవులు ఇచ్చి అతడి ఎదుగుదలకే ఉపయోగపడ్డారు తప్ప.. రాష్ట్ర అభివృద్ధి పట్టడం లేదని ఆరోపించారు. టీడీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని.. ఏపీలో కుల రాజకీయాలు, అవినీతిని అంతమొందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిగా విఫలమైన చంద్రబాబు దేశానికి ప్రధాని కావాలని కలలు కంటున్నారని ఎద్దేవాచేశారు. ఏపీలో శాంతిభద్రతలు సరిగా లేవని, కాకినాడలో బీజేపీ మహిళా కార్యకర్తపై సీఎం చంద్రబాబు దురుసుగా ప్రవర్తించారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రధాని దృష్టికి తీసుకెళ్లగా.. నాయకులు ఎప్పుడైతే సహనం కోల్పోయి ఎదుటివారిపై దాడులకు దిగుతారో.. వారికి ఓటమి భయం పట్టుకున్నట్టేనని వ్యాఖ్యానించారు. దాడులకు పార్టీశ్రేణులు భయపడాల్సిన పనిలేదని, దేశం కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలు బీజేపీ సొంతమని తెలిపారు.



ఆదివారం పౌరసరఫరాలభవన్‌లో సంస్థ జిల్లా మేనేజర్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ అకున్ సబర్వాల్

## అంచనాలకు మించి ధాన్యం కొనుగోళ్లు

- 7.25 లక్షల మంది రైతులకు రూ.6,291 కోట్ల చెల్లింపులు
- పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ఈ ఏడాది వానకాలంలో అంచనాలకు మించి 7.25 లక్షల మంది రైతుల నుంచి 37 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేశామని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. ధాన్యానికి సంబంధించి రూ.6,291 కోట్లను రైతుల ఖాతాలో నేరుగా జమచేశామని చెప్పారు. రాష్ట్రంలో భారీఎత్తున ధాన్యం దిగుబడి అవుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, కనీస మద్దతు ధర చెల్లింపుల్లో రైతులకు సమస్యలు ఎదురుకాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలుచేపట్టాలని అధికారులకు సూచించారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్)ను త్వరితగతిన తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం పౌరసరఫరాలభవన్‌లో ఆ సంస్థ జిల్లా మేనేజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిల్లర్లకు చెల్లించే బకాయిలు, మిల్లింగ్ చార్జీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులందరూ మరింత బాధ్యతగా పనిచేయాలని, గోదాముల్లో నిరుపయోగంగా ఉన్న సరుకులను తక్షణమే టెండర్ ద్వారా విక్రయించాలని, బియ్యం నిల్వల కోసం గోదాముల లీజు ధరల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని చెప్పారు.

# తెలంగాణ టీఆర్ఎస్‌దే

మొదటిపేజీ తరువాయి...

గెలుచుకొని రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కు 16 సీట్లు ఖాయమని ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ సర్వే చెప్తున్నది. మరోవైపు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయని సర్వేలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ హవా కొనసాగుతుందని, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### అసెంబ్లీ ఎన్నికల తర్వాత మారిన సీన్

ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ కలిసి ఇటీవలి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత దేశం మొత్తం సర్వే నిర్వహించింది. ఎన్నికలకు ముందు గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన ఎన్డీయేకు 281 సీట్లు వస్తాయని, సంపూర్ణ మెజార్టీ సాధిస్తుందని అంచనావేసింది. యూపీఏకు 124 సీట్లు వస్తాయని తెలిపింది. కానీ.. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిర్వహించిన సర్వేలో ఎన్డీయే బలం తగ్గిపోయిందని నివేదిక వెల్లడించింది. తాజాగా డిసెంబర్ 15-25 మధ్య సర్వే నిర్వహిచింది. దేశవ్యాప్తంగా 543 పార్లమెంటరీ స్థానాల్లో 18-60 ఏండ్ల మధ్య వయసున్న 54,300 మందిని సర్వే చేశారు. ఇందులో వివిధ వర్గాలకు చెందిన 27,832 మంది పురుషులు, 26,408 మంది స్త్రీలు ఉన్నారు. తాజా నివేదిక ప్రకారం తెలంగాణలో 17 సీట్లకుగానూ 16 సీట్లు టీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుంది. ఎన్డీఏ కూటమికి 257 సీట్లు వస్తాయని, ఇందులో బీజేపీ 223 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ 146 సీట్లకే పరిమితం అవుతుందని, కాంగ్రెస్ 85 స్థానాల్లో గెలుస్తుందని పేర్కొన్నది. మిగతా పార్టీలు 140 సీట్లు గెలుచుకుంటాయని తెలిపింది. రెండు ప్రధాన కూటములు మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోలేవని, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ఈసారి ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయని సర్వే వెల్లడించింది.

### సర్వే ప్రకారం రాష్ట్రాలవారీగా ఫలితాలు

| | |
|---|---|
| తెలంగాణ: | టీఆర్ఎస్-16, ఎంఐఎం-1 |
| ఆంధ్రప్రదేశ్: | వైసీపీ-19, టీడీపీ-4, కాంగ్రెస్-2 |
| ఉత్తరప్రదేశ్: | బీజేపీ-40, ఎస్పీ-20, బీఎస్పీ-15, కాంగ్రెస్-2, ఆర్ఎల్‌డీ-2, అప్నాదళ్-1 |
| ఉత్తరాఖండ్: | బీజేపీ-4, కాంగ్రెస్-1 |
| రాజస్థాన్: | బీజేపీ-15, కాంగ్రెస్-10 |
| పశ్చిమబెంగాల్: | టీఎంసీ-26, బీజేపీ-10, కాంగ్రెస్-2, లెఫ్ట్‌కూటమి-4 |
| గుజరాత్: | బీజేపీ-24, కాంగ్రెస్-2 |
| ఢిల్లీ: | బీజేపీ-5, ఆప్-1, కాంగ్రెస్-1 |
| ఒడిశా: | బీజేడీ-13, బీజేపీ-8 |
| మధ్యప్రదేశ్: | బీజేపీ-18, కాంగ్రెస్-11 |
| ఛత్తీస్‌గఢ్: | బీజేపీ-5, కాంగ్రెస్-6 |
| పంజాబ్: | కాంగ్రెస్-7, అకాళీదళ్-5, ఆప్-1 |
| హర్యానా: | బీజేపీ-8, కాంగ్రెస్-2 |
| బీహార్: | బీజేపీ-13, ఆర్జేడీ-10, జేడీయూ-11, కాంగ్రెస్-2, ఎల్‌జేపీ-3, ఆర్ఎల్ఎస్‌పీ-1, |
| జార్ఖండ్: | బీజేపీ-7, జేఎంఎం-4, కాంగ్రెస్-2, జేవీఎం(పీ)-1 |
| మహారాష్ట్ర: | బీజేపీ-22, శివసేన-8, కాంగ్రెస్-9, ఎన్‌సీపీ-9 |
| తమిళనాడు: | డీఎంకే-21, ఏఐఏడీఎంకే-10, ఏఎంఎంకే-4, కాంగ్రెస్-3, పీఎంకే-1 |
| కర్ణాటక: | బీజేపీ-15, కాంగ్రెస్-9, జేడీ(ఎస్)-4 |
| కేరళ: | కాంగ్రెస్-8, లెఫ్ట్ ఫ్రంట్-5, ఐయూఎంఎల్-2, బీజేపీ-1, కేసీ(ఎం)-1, ఆర్ఎస్‌పీ-1, స్వతంత్ర-1 |
| జమ్ముకశ్మీర్: | బీజేపీ-2, ఎన్‌సీ-2, కాంగ్రెస్-1, పీడీపీ-1 |
| అస్సాం: | బీజేపీ-12, ఏఐయూడీఎఫ్-2 |
| హిమాచల్‌ప్రదేశ్: | బీజేపీ-4 |
| అరుణాచల్ ప్రదేశ్: | బీజేపీ-2 |
| మిజోరం: | ఎంఎన్ఎఫ్-1 |
| మణిపూర్: | బీజేపీ-2 |
| మేఘాలయ: | కాంగ్రెస్-1, ఎన్‌పీపీ-1 |
| త్రిపుర: | బీజేపీ-1, సీపీఐ(ఎం)-1 |
| నాగాలాండ్: | ఎన్‌డీపీపీ-1, ఎన్‌పీఎఫ్-1 |
| సిక్కిం: | ఎస్‌డీఎఫ్-1 |
| ఛత్తీస్‌గఢ్: | బీజేపీ-1 |
| గోవా: | బీజేపీ-1, కాంగ్రెస్-1 |
| అండమాన్, నికోబార్: | బీజేపీ-1 |
| దాద్రానగర్ హవేలీ: | బీజేపీ-1 |
| డామన్, డయ్యు: | బీజేపీ-1 |
| లక్షద్వీప్: | కాంగ్రెస్-1 |
| పుదుచ్చేరి: | ఐఎన్ఆర్‌సీ-1 |



ఆదివారం గాంధీభవన్‌లో కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణతో వాదిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బొల్లి కిషన్

# కాంగ్రెస్ నుంచి సర్వే సస్పెన్షన్

**రసాభాసగా మారిన మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ సమీక్ష ■ కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై సర్వే సత్యనారాయణ ఫైర్**

**సీట్లు అమ్ముకున్నారంటూ బూతులు ■ అడ్డుకున్న వారిపై వాటర్ బాటిళ్లతో దాడి**

**వెంటనే సస్పెండ్ చేసిన పార్టీ క్రమశిక్షణ కమిటీ ■ సోమవారం వారిద్దరి బండారం బయటపెడుతానన్న సర్వే**

**హైదరాబాద్/కంటోన్మెంట్/రసూల్‌పురా, నమస్తే తెలంగాణ:** కాంగ్రెస్ నుంచి కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణను సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ క్రమశిక్షణ కమిటీ ప్రకటించింది. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన పీసీసీ మాజీ కార్యదర్శి శ్రీగణేశ్‌పై సైతం సస్పెన్షన్ వేటువేసింది. రాష్ట్రంలో కీలక నేతగా ఉన్న సర్వేపై వేటుతో కాంగ్రెస్ పార్టీలో అలజడి రేగింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయానికి విశ్లేషించుకునేందుకు గాంధీభవన్ వేదికగా మూడు రోజులుగా పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారెడ్డిపై పరుషమైన పదజాలం ఉపయోగించారు. సీట్లు డబ్బులకు అమ్ముకున్నారని, కేంద్ర పార్టీ నుంచి వచ్చిన నిధులను ఎవ్వరికీ ఇవ్వకుండా జేబులో వేసుకున్నారని ఆరోపించారు. చేసిందంతా చేసి సుద్దపూసల లెక్క ఇప్పుడు సమీక్షలు చేస్తరా? అంటూ తిట్టిపోశారు. సర్వే సత్యనారాయణ తిట్లపురాణం అందుకోవడంతో నేతలంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లి కిషన్ అడ్డుకోవడానికి ప్రయత్నించగా.. సర్వే ఆయనపైకి వాటర్ బాటిల్ విసిరారు. దీంతో మాటా మాటా పెరిగి యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఇరువర్గాలు తిట్ల దండకాన్ని అందుకున్నాయి. ఒకరికొకరు వాటర్ బాటిళ్లు విసురుకున్నారు. కుర్చీలు ఎత్తుకున్నారు. కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తిడుతూనే సర్వే సత్యనారాయణ అర్ధంతరంగా సమావేశం నుంచి బయటికివచ్చారు. మరోవైపు వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సైతం పార్టీ పెద్దలపై, నాయకుల వ్యవహారశైలిని విమర్శించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర పార్టీ నాయకులు పెద్దగా సహకరించలేదని, కనీసం పార్టీ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయామని, దీంతో చాలాచోట్ల ఓడిపోయామని వాపోయారు.

### వెంటనే సస్పెన్షన్ వేటు

సర్వే సత్యనారాయణపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి కుంతియా సస్పెన్షన్ వేటువేశారు. సమీక్షా సమావేశంలో జరిగిన గొడవ, సర్వే సత్యనారాయణ వ్యవహరించిన తీరుతెన్నులపై ఆయన సమావేశం నుంచే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లాట్‌తో మాట్లాడారు. అనంతరం సస్పెన్షన్ వేటు వేశారు. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని ప్రకటించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ.. సర్వే సత్యనారాయణ వీధి రౌడీలా ప్రవర్తించారని, పార్టీ నేతలను తీవ్ర పదజాలంతో దూషించారని ఆరోపించారు.

### ఓటమికి కారకులే సమీక్షలు నిర్వహిస్తారా?

తెలంగాణ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడానికి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి కుంతియానే కారణమని, ఇప్పుడు మళ్లీ వారే సమీక్షలు నిర్వహిస్తున్నారని సర్వే సత్యనారాయణ ఆరోపించారు. గాంధీభవన్ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలు చెప్తుంటే మహేశ్‌గౌడ్, బొల్లి కిషన్‌తో తనపై దాడి చేయించారని ఆరోపించారు. అర్హత లేని ఉత్తమ్‌కు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు ఇచ్చారని, త్వరలోనే రాహుల్‌గాంధీ, సోనియాగాంధీని కలిసి వారిద్దరిపై నివేదిక ఇస్తానని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశం పెట్టి ఇద్దరు నేతల అవినీతి బాగోతాన్ని బయటపెడుతానని చెప్పారు.

### సమావేశంలో నేతలంతా షాక్

**అసెంబ్లీ** ఎన్నికల్లో ఓటమిపై విశ్లేషించుకొని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా గెలువాలనే అంశంపై ప్రణాళికలు తయారుచేసుకునేందుకు ఏర్పాటుచేసిన సమీక్షలో అనూహ్యంగా గొడవ జరుగడంతో నేతలంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వీధి కొట్లాటను తలపించడంతో నేతలు అంజన్‌కుమార్‌యాదవ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బయటికి వచ్చేశారు. ఆ తర్వాత మిగతా నాయకులు తలోవైపు వెళ్లిపోయారు.

# వ్యవసాయాధికారులే కీలకం

- రైతుబంధు, రైతుబీమా అమలులో వారిదే ప్రధానపాత్ర
- కేంద్రం నిర్లక్ష్య ధోరణి వల్లే ఫెడరల్ ఫ్రంట్ ఆలోచన
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు
- తెలంగాణ వ్యవసాయాధికారుల డైరీ ఆవిష్కరణ



అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లో ఆదివారం వ్యవసాయ అధికారుల అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచనలకు ప్రతిరూపమైన రైతుబంధు, రైతుబీమా పథకాల అమలులో వ్యవసాయశాఖ అధికారులదే కీలకపాత్ర అని, వారి పనితీరు దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు కొనియాడారు. రాష్ట్ర రైతాంగం బాగుకోసం తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో పనిచేశారని ప్రశంసించారు. ఆదివారం హైదరాబాద్ అబిడ్స్‌లోని రాజాబహుదూర్ వెంకట్రామిరెడ్డి బాలుర వసతిగృహం ఆడిటోరియంలో తెలంగాణ వ్యవసాయాధికారుల సంఘం -2019 డైరీ, క్యాలెండర్లను వ్యవసాయశాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. వ్యవసాయాధికారుల పనితీరుతో గ్రామాల్లో వ్యవసాయంపై భరోసా కలిగిందని చెప్పారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సం క్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాకే రైతాంగంలో గుణాత్మకమైన మార్పు చోటుచేసుకున్నదన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రైతుల సమస్యలపై ఆందోళనలు జరుగుతున్నాయని, నాలుగున్నరేండ్ల టీఆర్‌ఎస్ పాలనతో ఒక్క ఆందోళన కూడా జరుగలేదని తెలిపారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ప్రకటించిన కాంగ్రెస్.. తెలంగాణకు మాత్రం అన్యాయం చేసిందని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకే నిధులు ఇస్తూ ప్రధాని మోదీ ఇతర రాష్ట్రాల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. అందుకే సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ఆలోచన చేశారని చెప్పారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలనూ టీఆర్‌ఎస్ గెలిస్తే కేంద్రం లో కీలకపాత్ర వహిస్తామని, రాష్ట్రానికి అవసరమైన నిధులను కొట్లాడి తెచ్చుకోవచ్చని అన్నారు. ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం యోచిస్తున్నదని చెప్పారు. వ్యవసాయంలో భారీమార్పులు తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని అన్నారు. మాజీమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయశాఖకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని చెప్పారు. అనంతరం తెలంగాణ వ్యవసాయధికారుల సంఘం -2019 టేబుల్ క్యాలెండర్‌ను వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ రాహుల్ బొజ్జా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయాధికారుల సంఘం చైర్మన్ కృపాకర్ రెడ్డి, అధ్యక్షురాలు అనురాధ, ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి, ప్రతినిధులు శైలజా, రవీంద్రనాథ్‌రెడ్డి, రాజాబహుదూర్ వెంకట్రామిరెడ్డి హాస్టల్ ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు మరో అరుదైన గుర్తింపు

- హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సుకు ఆహ్వానం
- ప్రత్యేక వక్తగా రావాలన్న నిర్వాహకులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు మరో అరుదైన గుర్తింపు దక్కింది. ఫిబ్రవరిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సుకు హాజరుకావాలని హార్వర్డ్ యూనివర్సిటీ ఆహ్వానం పంపింది. సదస్సులో ప్రత్యేకవక్తగా ప్రసంగించాలని నిర్వాహకులు కోరారు. ఫిబ్రవరి 16, 17 తేదీల్లో అమెరికాలోని మసాచుసెట్స్‌లో జరుగనున్న ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు, విద్యావేత్తలు, విద్యార్థులు, యువ వృత్తినిపుణులు మొత్తం వెయ్యిమంది పాల్గొననున్నారు. సమకాలీన భారతదేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, వివిధ అభివృద్ధి అంశాలపై రెండురోజులపాటు ఇక్కడ చర్చించనున్నారు. 'ఇండియా ఎట్ ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్' అనే థీమ్ ఆధారంగా జరుగనున్న ఈ సదస్సుకు ప్రత్యేక వక్తగా హాజరై ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌ను సదస్సు నిర్వాహకులు కోరారు.

# ఇక సత్వరన్యాయం

- నూతన ఒరవడిలో రాష్ట్ర న్యాయవ్యవస్థ
- ప్రత్యేక హైకోర్టుతో తెలంగాణ విభజన సంపూర్ణం
- రాష్ట్రంలో కమర్షియల్ కోర్టుల ఏర్పాటుకు లైన్‌క్లియర్
- హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంచుకునే అవకాశం
- కొత్తజిల్లాల్లో న్యాయవ్యవస్థల ఏర్పాటు
- సత్వర న్యాయంతో మారనున్న సామాన్యుల జీవితాలు
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎంపీ వినోద్‌కుమార్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుకావడంతో రాష్ట్ర విభజన సంపూర్ణమైందనే భావన కలుగుతున్నదని ప్రముఖ న్యాయవాది, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్ చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన 2014లో శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు విభజితమైనా, న్యాయవ్యవస్థ విభజన పూర్తికాకపోవడంతో ఆ లోటు కనిపించేదని అన్నారు. ఈ ఏడాది జనవరి ఒకటిన ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుతో రాష్ట్ర విభజన పూర్తిస్థాయిలో జరిగిందని తెలిపారు. రాష్ట్ర విభజన ఉద్యమంతోపాటు, హైకోర్టు ఏర్పాటు అంశంలో కీలకంగా వ్యవహరించిన ఎంపీల్లో ఒకరైన వినోద్‌కుమార్ 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే..

### సుదీర్ఘ పోరాటం

కేంద్రన్యాయశాఖ మంత్రిగా సదానందగౌడ ఉన్నప్పుడు హైకోర్టు విభజన గురించి అనేక సార్లు పార్లమెంట్‌ను స్తంభింపజేశాం. ప్రధాన మంత్రిని 15 సార్లు, న్యాయశాఖ మంత్రిని 25 సార్లు కలిశాం. రెండుసార్లు ప్రైవేటు మెంబర్ బిల్లులు పెట్టాం. ఉమ్మడి హైకోర్టు జడ్జిమెంట్‌పై సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వంతో రివ్యూ పిటిషన్ వేయించాం. అనంతరం జనవరి 1లోగా వేర్వేరు హైకోర్టులు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తీర్పుఇచ్చింది. సాక్షాత్తూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోపాటు, కేంద్ర న్యాయ శాఖ మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి ఒక కొలిక్కి వచ్చింది. ఇక రాష్ట్ర విభజన సంపూర్ణమైనట్టే.

### న్యాయమూర్తుల సంఖ్య పెంచుకుంటాం

తెలంగాణ హైకోర్టులో ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్య 24. ప్రస్తుతం 13 మంది ఉన్నారు. త్వరలోనే మిగతా జడ్జీలు కూడా వస్తారు. ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుచేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతూనే.. న్యాయమూర్తుల సంఖ్యను పెంచే అవకాశం ఉన్నదా? అని ఈనెల రెండున నేను లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించా. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో 1.87 లక్షల కేసులు, ఏపీ హైకోర్టులో 1.70 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలహాబాద్‌లో వంద మంది, బాంబే, అహ్మదాబాద్ తదితర హైకోర్టుల్లో కూడా 70-100 మంది న్యాయమూర్తులున్నారు. మనం కూడా సంఖ్యను పెంచుకుంటే బాగుంటుంది. మా అభిప్రాయాన్ని సీఎం కేసీఆర్, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

### హైకోర్టు ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తాం

ఉమ్మడి హైకోర్టు విభజనలో కొందరు తెలంగాణ ఉద్యోగులను ఏపీకి కేటాయించారని తెలిసింది. సీనియార్టీని ప్రాతిపదికగా తీసుకోవడంతో అన్యాయానికి గురైన తెలంగాణకు చెందిన హైకోర్టు ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తాం. దీనిపై అవసరమైతే ముఖ్యమంత్రి కేసీఆర్‌తోను చర్చిస్తాం. హైకోర్టు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్‌ను కలిసి విజ్ఞప్తిచేస్తాం. న్యాయవాదుల శిక్షణ కోసం ప్రత్యేకంగా ట్రస్టును ఏర్పాటుచేసి నల్సార్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాలకు చెందిన జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ అంశాన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేలా చూస్తాం.

ప్రస్తుతం దిగువ కోర్టుల్లో జడ్జీల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది. న్యాయ నియామకాలతోపాటు జిల్లా న్యాయవ్యవస్థ ఏర్పాటు, ఇతర మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల చర్యలు చేపడుతున్నది. రాష్ట్రంలో న్యాయవ్యవస్థను నూతన ఒరవడిలో నడిపించే దిశగా సీఎం కేసీఆర్ దృష్టిసారిస్తున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ స్థానికులకు న్యాయవ్యవస్థలో అవకాశాలు లభించలేదు. ఇప్పటినుంచి చాలా అవకాశాలు, ఉద్యోగాలు దక్కుతాయి.

### సామాన్యులకు సత్వర న్యాయం

హైకోర్టు విభజన వల్ల సామాన్యులకు సత్వర న్యాయం లభిస్తుంది. ఆవేశంలో చిన్నచిన్న గొడవల్లో పాల్గొన్నవారి కేసుల విచారణ ఏండ్ల తరబడి జరుగుతున్నది. గొడవ పడినవారు మర్చిపోయినా కేసులు అలాగే ఉంటున్నాయి. ఇలాంటి వాటికి సత్వర పరిష్కారం దొరుకుతుంది. ఇది సామాజిక జీవితంపై ప్రభావం చూపుతుంది. అన్నిరంగాల్లో తెలంగాణ మిగతా రాష్ట్రాలకు ఏ విధంగా ఆదర్శంగా ఉన్నదో.. న్యాయం విషయంలో కూడా మొదటిస్థానంలో నిలిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ప్రతిభావంతులైన న్యాయవాదులకు ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించి, న్యాయవ్యస్థను బలోపేతం చేసేవిధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

### దర్యాప్తులో విప్లవాత్మక మార్పులు.. సీఆర్‌పీసీకి సవరణలు

రాష్ట్రంలో పోలీస్ ప్రాసిక్యూటర్ల వ్యవస్థను పటిష్ఠంచేయాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్లలోని స్టేషన్‌హౌస్ ఆఫీసర్లు కేసు విచారణ జరిపి చార్జిషీట్ దాఖలుచేస్తున్నారు. కేసు విచారణకు వచ్చేసరికి వారు బదిలీపై వెళ్లిపోతున్నారు. దీంతో పాతకేసులపై పోలీసు అధికారులకు ఆసక్తి ఉండటంలేదు. కాబట్టి మూడు లేదా నాలుగు పోలీస్‌స్టేషన్లకు కలిపి ఒకే దర్యాప్తు అధికారి ఉండాలి. ఈ స్టేషన్ల పరిధిలోని నేరాలపై దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు వంటి అంశాలను సదరు అధికారి చూస్తారు. దీనివల్ల శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీసులపై దర్యాప్తుచేసే భారం తగ్గుతుంది. శాంతిభద్రతలు, దర్యాప్తు అధికారులు వేర్వేరుగా ఉండాలి. దీనివల్ల చాలా తక్కువకాలంలో నేరనిర్ధారణ జరుగుతుంది. ఈ మేరకు సీఆర్‌పీసీకి సవరణలు తెచ్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతున్నది.

### పునర్విభజన చట్టంలో అస్పష్టత వల్లే జాప్యం

రాజ్యాంగంలోని 214 ఆర్టికల్ ప్రకారం ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పడేవరకు హైదరాబాద్ హైకోర్టు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టుగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం -2014లోని సెక్షన్లు 30, 31 చెప్తున్నాయి. అయితే హైకోర్టు విభజనకు స్పష్టమైన తేదీని పేర్కొనలేదు. తద్వారా పదేండ్ల వరకు జాప్యం చేసినా అడిగే పరిస్థితి లేదు. పంజాబ్-హర్యానా హైకోర్టు తరహాలో హైదరాబాద్ హైకోర్టును ఉమ్మడిగా ఉంచాలనే ఆలోచన కూడా చేశారు. ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి హైకోర్టు విభజనపై చిత్తశుద్ధిలేదు. మేం ఎన్నిసార్లు చెప్పినా.. హైకోర్టు విభజనకు నిర్దిష్టమైన సమయాన్ని పేర్కొనలేదు.

### రాష్ట్ర న్యాయవ్యవస్థలో విప్లవాత్మకమార్పులు

ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుతో రాష్ట్ర న్యాయవ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కోర్టులు, జిల్లా ప్రిన్సిపల్ జడ్జీలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీలు వస్తారు. ప్రతిజిల్లాకు న్యాయవ్యవస్థలు ఏర్పడుతాయి. కేసుల పరిష్కారం వేగవంతమవుతుంది. జిల్లా కోర్టుల ఏర్పాటుతో జిల్లాల విభజనలో కచ్చితత్వం వస్తుంది. విభజనకు సార్థకత ఏర్పడుతుంది. వ్యాపార, వాణిజ్య వివాదాల పరిష్కారానికి రాష్ట్రంలో కమర్షియల్ కోర్టులు ఏర్పాటవుతాయి. వ్యాపార వివాదాలను వేగంగా పరిష్కరించడంలో బాంబే హైకోర్టుకు మంచి గుర్తింపు ఉన్నది. తెలంగాణకు అదే తరహాలో మంచి పేరు వస్తుంది. అంతర్జాతీయస్థాయిలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోడీబీ) ర్యాంకుల్లో మొదట పరిగణనలోకి తీసుకునేది దేశంలోని న్యాయవ్యవస్థ ఎలా ఉన్నదనే అంశాన్నే. దురదృష్టవశాత్తూ ఈ విషయంలో భారత్ చాలా వెనుకబడి ఉన్నది. ముంబై, బెంగళూరు తదితర నగరాల్లో మల్టీనేషనల్ కంపెనీలు రావడానికి అక్కడి న్యాయవ్యవస్థలు కూడా కారణం. మన వద్ద ఉమ్మడి హైకోర్టు ఉండటం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రత్యేక హైకోర్టు ఏర్పాటుకావడం వల్ల సత్వరన్యాయం అందుతుంది. కమర్షియల్ కోర్టులతో వ్యాపార వివాదాలకు వెంటనే పరిష్కారం లభిస్తుంది. వ్యాపార, వాణిజ్యాలకు రాష్ట్రం స్వర్గధామంగా మారుతుంది. కొత్తజిల్లాల్లో ఏర్పడే కుటుంబ న్యాయస్థానాలతో వివాదాలకు సత్వర పరిష్కారం లభిస్తుంది. శిక్షలు విధించే శాతం పెరుగడం వల్ల నేరాలు చేయడానికి భయపడుతారు. తద్వారా నేరాల సంఖ్య కూడా భారీగా తగ్గుతుంది. ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు సుప్రీంకోర్టు ప్రత్యేకంగా కోర్టులు ఏర్పాటుచేయడంతో వివాదాల్లో తలదూర్చడానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒకటికి రెండుసార్లు ఆలోచించే పరిస్థితి వచ్చింది.



ఆదివారం ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాలభవన్‌లో సంస్థ జిల్లా మేనేజర్లతో సమీక్ష నిర్వహిస్తున్న పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

## అంచనాలకు మించి ధాన్యం కొనుగోళ్లు

- 7.25 లక్షల మంది రైతులకు రూ.6,291 కోట్ల చెల్లింపులు
- పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ఈ ఏడాది వానకాలంలో అంచనాలకు మించి 7.25 లక్షల మంది రైతుల నుంచి 37 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేశామని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. ధాన్యానికి సంబంధించి రూ.6,291 కోట్లను రైతుల ఖాతాలో నేరుగా జమచేశామని చెప్పారు. రాష్ట్రంలో భారీఎత్తున ధాన్యం దిగుబడి అవుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, కనీస మద్దతు ధర చెల్లింపుల్లో రైతులకు సమస్యలు ఎదురుకాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలుచేపట్టాలని అధికారులకు సూచించారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్)ను త్వరితగతిన తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం పౌరసరఫరాలభవన్‌లో ఆ సంస్థ జిల్లా మేనేజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిల్లర్లకు చెల్లించే బకాయిలు, మిల్లింగ్ చార్జీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులందరూ మరింత బాధ్యతగా పనిచేయాలని, గోదాముల్లో నిరుపయోగంగా ఉన్న సరుకులను తక్షణమే టెండర్ ద్వారా విక్రయించాలని, బియ్యం నిల్వల కోసం గోదాముల లీజు ధరల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని చెప్పారు.





ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన జడ్చర్ల నియోజకవర్గం నసరుల్లాబాద్‌కు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులకు పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తాం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- టీఆర్‌ఎస్‌లో చేరిన జడ్చర్ల కాంగ్రెస్, టీడీపీ నాయకులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రతి ఎకరానికి నీళ్లందించడం, ప్రతి ఇంటికీ నల్లా నీరు, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పనిచేస్తున్నారని మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే సీ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జడ్చర్ల నియోజకవర్గం నసరుల్లాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బాగుపడినప్పుడే బంగారు తెలంగాణ అవుతుందని సీఎం కేసీఆర్ భావిస్తున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాలుగున్నరేండ్లల్లో ఊహించని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రూపొందించారని గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవడానికి మంచి అవకాశమని, ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షలు ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి నిధులు ఇవ్వనున్నట్టుగా చెప్పారు. గ్రామ పంచాయతీలకు పెద్దఎత్తున నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంపై నమ్మకం, విశ్వాసంతో టీఆర్‌ఎస్ బ్రహ్మాండమైన విజయాన్ని అందించారని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ 16 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. టీఆర్‌ఎస్ కేంద్రంలోనూ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు.

# అండమాన్‌పై పబుక్ తుఫాన్ కేంద్రీకృతం

**ఆరెంజ్ హెచ్చరిక జారీచేసిన కేంద్రం**



**న్యూఢిల్లీ, జనవరి 6:** థాయ్‌లాండ్‌లో విధ్వంసం సృష్టించిన పబుక్ తుఫాన్ అండమాన్, నికోబార్ దీవుల దిశగా చురుగ్గా సాగుతున్నది. రాజధాని పోర్టుబ్లెయిర్‌కు 310 కిలోమీటర్ల దూరంలో అండమాన్ సముద్రంలోని తూర్పు-ఈశాన్య ప్రాంతంలో తుఫాన్ కేంద్రీకృతమై ఉన్నది. ఈ నేపథ్యంలో అండమాన్, నికోబార్ దీవులను అప్రమత్తం చేస్తూ కేంద్రం 'ఆరెంజ్' హెచ్చరికను జారీచేసింది. ప్రస్తుతం అండమాన్ సముద్రం, చుట్టుపక్కల ప్రాంతాల చుట్టూ తుఫాన్ ఆవరించి ఉన్నదని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రకటించింది. గత ఆరు గంటల్లో ఉత్తర-ఉత్తర వాయవ్య దిశగా గంటకు 20 కిలోమీటర్ల వేగంతో తుఫాన్ చురుగ్గా కదులుతున్నదని తెలిపింది. ఆదివారం రాత్రికి అండమాన్ నికోబార్ దీవులను తుఫాన్ దాటే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ సమయంలో గంటకు 70-80 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ వివరించింది. అనంతరం ఉత్తర వాయవ్య దిశగా మయన్మార్‌వైపు పయనిస్తూ జనవరి 7-8 తేదీల్లో బలహీన పడే అవకాశం ఉందని తెలిపింది. పబుక్ తుఫాన్ కారణంగా అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

## కౌరవులను టెస్ట్‌ట్యూబ్ బేబీలనడం

# వైజ్ఞానిక స్రష్టల సేవలను మసకబార్చడమే

**ఏయూ వీసీ వ్యాఖ్యలను ఖండించిన బ్రేక్‌త్రూ సైన్స్ సొసైటీ**


**జలంధర్, జనవరి 6:** మహాభారతంలోని కౌరవులంతా మూలకణం ఆధారంగా జన్మించారని, వారంతా టెస్ట్‌ట్యూబ్ బేబీలని జలంధర్‌లో జరుగుతున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ (ఐఎస్‌సీ)లో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను 'బ్రేక్‌త్రూ సైన్స్ సొసైటీ' అనే స్వచ్ఛంద సంస్థ ఖండించింది. సైన్స్‌ను, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేసేందుకు అంకితమైన ఈ సంస్థ.. పురాణాలను, విజ్ఞానశాస్త్రాన్ని మిళితం చేయడం సరికాదని స్పష్టం చేసింది. ప్రాచీన భారత దేశం పట్ల అతిభక్తిని చాటుకునేలా ఉన్న ఇటువంటి వ్యాఖ్యలను నవయువత ముందు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. విజ్ఞానశాస్త్రంలో మహామహుల సేవలను మసకబార్చేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని ఆ సంఘం ఓ ప్రకటనలో పేర్కొన్నది. నైతిక విలువలు, ఊహాశక్తితో నిండి ఉండే పురాణాలు, పౌరాణిక గాథలు, పద్యాలు ఆస్వాదించదగినవేనని, అయితే వీటికి శాస్త్రీయ ఆధారాలు లేవని తెలిపింది. మూలకణ పరిశోధన, కృత్రిమ ఫలదీకరణ, గైడెడ్ క్షిపణులకు సంబంధించిన విజ్ఞానం, సాపేక్ష సిద్ధాంతం, క్వాంటమ్ సిద్ధాంతం తదితరాలన్నీ శాస్త్ర ప్రక్రియ ద్వారానే రూపుదిద్దుకున్నాయని పేర్కొంది.

# రాజస్థాన్‌లో రుణమాఫీకి కసరత్తు



**జైపూర్, జనవరి 6:** రాజస్థాన్‌లో వ్యవసాయ రుణాల మాఫీకి కసరత్తు జరుగుతున్నది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను పరిశీలించేందుకు ఏర్పాటైన ప్రభుత్వ కమిటీ.. 2014-18 మధ్య కాలంలో ఆత్మహత్య చేసుకున్న రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు సిఫారసు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి శాంతి ధరీవాల్ నేతృత్వంలోని ఈ కమిటీ శనివారం జరిపిన తొలి సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నది. 2014-18 మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి వ్యవసాయ రుణాలతోపాటు ఇతర అన్నిరకాల రుణాలను మాఫీచేయాల్సిందిగా సీఎం గెహ్లాట్‌కు సిఫారసు చేస్తామని ధరీవాల్ తెలిపారు.

# సరిహద్దు గోడపై ట్రంప్ మొండిపట్టు




**వాషింగ్టన్, జనవరి 6:** మెక్సికో సరిహద్దు వెంట గోడ కట్టాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొండిపట్టు పట్టారు. అది సిమెంట్ గోడగానీ, స్టీల్ గోడగానీ ఏదో ఒకటి కట్టి తీరాల్సిందేనని తేల్చిచెప్పారు. గోడ నిర్మాణానికి ట్రంప్ 560 కోట్ల డాలర్లు కోరుతుండగా, ప్రతిపక్ష డెమోక్రాట్లు ససేమిరా అంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం స్తంభించిన విషయం తెలిసిందే. ఆదివారం ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ అమెరికాలోకి అక్రమ వలసలను నిరోధించాలన్నా, మత్తు పదార్థాలకు అడ్డుకట్ట పడాలన్నా గోడకట్టడమే పరిష్కారమని చెప్పారు. అనంతరం అధ్యక్షుడి రిసార్ట్ అయిన క్యాంప్ డేవిడ్‌కు ట్రంప్ వెళ్లారు. అక్కడ ఆయన అధికారులతో గోడ నిర్మాణంపై చర్చించే అవకాశం ఉంది.



## బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా రాజ్‌నాథ్

- ప్రచార కమిటీ చైర్మన్‌గా అరుణ్‌జైట్లీ





**న్యూఢిల్లీ, జనవరి 6:** త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ 17 కమిటీలను నియమించింది. సంకల్ప్ పత్ర (మ్యానిఫెస్టో) కమిటీ చైర్మన్‌గా కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నియమితులయ్యారు. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రచార కమిటీ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పార్టీ ఎన్నికల హామీలను క్రోడీకరించి తుది రూపం తేవడంలో మ్యానిఫెస్టో కమిటీ కీలకంగా వ్యవహరించనుంది. అలాగే క్షేత్రస్థాయిలో ప్రచార కమిటీ క్రియాశీలకంగా పనిచేయనుంది.

## కన్నడ సినీ ప్రముఖులపై ఐటీ దాడుల్లో

## రూ.11 కోట్ల అక్రమాస్తులు స్వాధీనం

**బెంగళూరు, జనవరి 6:** కన్నడ సినీ ప్రముఖుల నివాసాలు, కార్యాలయాలపై తాజాగా జరిపిన సోదాల్లో రూ.11 కోట్ల విలువైన అప్రకటిత ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఆదాయం పన్ను శాఖ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. అలాగే లెక్కలు చూపని ఆస్తులు రూ.109 కోట్లు ఉన్నట్లు నిందితులు అంగీకరించారని పేర్కొంది. ప్రముఖ సినీ నటులు శివరాజ్ కుమార్, పునీత్ రాజ్‌కుమార్, సుదీప్, యశ్, సినీ నిర్మాతలు సీఆర్ మనోహర్, రాక్‌లైన్ వెంకటేశ్, విజయ్ కిరిగందూర్ నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో ఐటీ అధికారులు సోదాలు జరిపిన విషయం తెలిసిందే.

## ఆఫ్ఘన్‌లో బంగారు గని కూలి 30 మంది మృతి

**కుందుజ్, జనవరి 6:** ఆఫ్ఘనిస్థాన్‌లో బంగారు గని కుప్పకూలడంతో 30 మంది మరణించారు. ఏడుగురు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం బదక్షాన్ రాష్ట్రంలోని కొహిస్థాన్ జిల్లాలో చోటుచేసుకుంది. నదీ పరివాహకం వెంట దాదాపు 200 అడుగుల లోతున్న గనిలో కార్మికులు బంగారం కోసం వెతుకుతుండగా అది కుప్పకూలిందని అధికారులు చెప్పారు. అయితే గని కుప్పకూలడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. మృతిచెందిన వారంతా వృత్తిపరమైన కార్మికులు కాదని తెలిపారు. గ్రామస్థులంతా చాలా కాలం నుంచి అక్రమంగా బంగారు గనుల తవ్వకాలకు పాల్పడుతున్నారని, దీనిపై ప్రభుత్వ నియంత్రణ లేదని చెప్పారు.

# నిరూపిస్తారా? రాజీనామా చేస్తారా?

- రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ సవాల్
- 'హాల్'కు రూ.లక్ష కోట్ల ఆర్డర్లు పచ్చి బూటకమని ధ్వజం
- సంబంధిత పత్రాల్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్
- హాల్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, అబద్ధాలు చెప్పారని ఆగ్రహం

**న్యూఢిల్లీ, జనవరి 6:** కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ మధ్య మరోసారి మాటల తూటాలు పేలాయి. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్-హాల్)పై సామాజిక మాధ్యమాల వేదికగా ఒకరిపై మరొకరు వాగ్బాణాలు సంధించుకున్నారు. హాల్‌కు కేంద్రం రూ. లక్ష కోట్ల ఆర్డర్లు ఇచ్చిందని రక్షణమంత్రి పార్లమెంటులో చెప్పడం పచ్చి బూటకమని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆదివారం విమర్శించారు. మంత్రి తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటారా? అని ప్రశ్నించారు. లక్ష కోట్ల ఆర్డర్లకు సంబంధించిన పత్రాలను పార్లమెంటులో సోమవారం ప్రవేశపెట్టాలని, లేదంటే తన పదవికి రక్షణమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'హాల్‌కు కేంద్రం రూ.లక్ష కోట్ల ఆర్డర్లు కాదుగదా.. కనీసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఇప్పటివరకూ ఒక్కటంటే ఒక్క ఆర్డర్ కూడా సంస్థకు ఇవ్వలేదు. హాల్ ఉన్నతాధికారులే ఈ విషయం స్వయంగా వెల్లడించారు' అని ధ్వజమెత్తారు. రక్షణమంత్రి సభలో చేసిన ప్రకటనకు సంబంధించిన పత్రాలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. యూపీఏ హయాంలో హాల్‌ను పూర్తిగా పక్కనపెట్టారని, సంస్థ పురోగతిని పట్టించుకోలేదంటూ రక్షణమంత్రి చేసిన విమర్శలపై రాహుల్ మండిపడ్డారు. 'మనం ఒక అబద్ధం చెబితే.. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు మరిన్ని అబద్ధాలు ఆడాల్సి ఉంటుంది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన అబద్ధాలను కప్పిపుచ్చే తొందరలో మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో అసత్యాలు వల్లెవేశారు' అని విమర్శలు గుప్పించారు. మోదీ తన 'సూట్-బూట్' స్నేహితుడి (అనిల్ అంబానీ)కి లబ్ధి చేకూర్చేందుకే రాఫెల్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని, ఇందుకోసం హాల్‌ను పణంగా పెట్టారని మండిపడ్డారు. దశాబ్దాల చరిత్రలో తొలిసారి ఉద్యోగుల జీతభత్యాల కోసం హాల్ రూ.1,000 కోట్ల రుణం తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ప్రధాని మోదీ, రక్షణ మంత్రి సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్‌లో తన వ్యాఖ్యలు పోస్టు చేస్తూ ఓ పత్రిక కథనాన్ని ట్యాగ్ చేశారు.



# ఏబీసీడీల నుంచి ప్రారంభించండి

- రాహుల్‌కు చురకలంటించిన రక్షణమంత్రి
- దేశ ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజం
- పార్లమెంటులో క్షమాపణలు చెప్పి.. పదవి నుంచి వైదొలగాలని డిమాండ్

**న్యూఢిల్లీ, జనవరి 6:** రాహుల్ విమర్శలపై రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందించారు. హాల్ విషయంలో దేశ ప్రజలను రాహుల్‌గాంధీ తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడు సిగ్గుపడాల్సిన విషయం ఇది. 2014-18 మధ్య కాలంలో హాల్‌కు సంబంధించి రూ.26,570 కోట్ల కాంట్రాక్టులపై సంతకాలు జరిగాయి. మరో 73వేల కోట్లకు సంబంధించిన ఆర్డర్లు చర్చల దశలో ఉన్నాయి. బీజేపీ హయాంలో హాల్‌కు కనీసం ఒక్క రూపాయి కూడా ఆర్డర్లు ఇవ్వలేదంటూ రాహుల్ చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యం. నాపై ఆరోపణలు చేసే ముందు సదరు పత్రికలో వచ్చిన వ్యాసాన్ని రాహుల్ పూర్తిగా చదివి ఉండాల్సింది. ఆర్డర్లపై సంతకాలు జరిగినట్లు నేనెక్కడా చెప్పలేదు. వాటికి సంబంధించిన పనులు జరుగుతున్నాయని మాత్రమే చెప్పాను. అవసరమైతే లోక్‌సభ రికార్డులను సైతం తనిఖీ చేసుకోవచ్చు. నాపై తప్పుడు ఆరోపణలు చేసిన రాహుల్ పార్లమెంటు వేదికగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. తన పదవికి ఆయన రాజీనామా చేయాలి' అని ట్విట్టర్‌లో నిర్మలా సీతారామన్ డిమాండ్ చేశారు. రాహుల్ పరిజ్ఞానం చూస్తుంటే ఆయన ఇక ఏబీసీడీల నుంచి ప్రారంభించాల్సి ఉందని అవగతమవుతున్నదని ఎద్దేవా చేశారు.

**ఆర్డర్లు లేవు.. అడ్వాన్సులూ లేవు: హాల్ ఉద్యోగుల ఆవేదన**

హాల్‌కు లక్ష కోట్ల ఆర్డర్ల మాట దేవుడెరుగు..! కనీసం అడ్వాన్సులు కూడా లేవని సంస్థ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేశారు. అసలు లక్ష కోట్ల ఆర్డర్లు వస్తాయా? వస్తే ఎప్పుడు వస్తాయో కూడా తమకు తెలియదని వారు వాపోయారు. ఉద్యోగుల జీతభత్యాల కోసం సంస్థ తొలిసారిగా రూ.962 కోట్ల ఓవర్ డ్రాఫ్ట్ తీసుకుందని చెప్పారు. 83 యుద్ధ విమానాలు, 15 హెలీకాప్టర్లకోసం ఆర్డర్లు తుది దశలో ఉన్నాయని, ఇవి కార్యరూపం దాల్చిన అనంతరం డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదముద్ర పడిన తర్వాతే తమకు ఆర్డర్లు అందుతాయని సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హాల్‌కు ప్రధాన వినియోగదారైన భారత వాయుసేన పాత బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయని ఒక అధికారి పేర్కొన్నారు.

# అయ్యో.. ఎంత ఘోరం!

మొదటిపేజీ తరువాయి...

బోయిని కుమార్‌యాదవ్ (28), నరేశ్‌గౌడ్, దొంతి భూమయ్యగౌడ్, రెడ్డిపల్లికి చెందిన నక్క ఆంజనేయులు (38), అంబర్‌పేట కృష్ణగౌడ్ (35), మంతూర్‌కు చెందిన చీరాల శివప్రసాద్ (28), అయ్యన్నగారి శ్యాంగౌడ్ (22), శ్రీశైలం, చిన్న చింతకుంటకు చెందిన ప్రవీణ్‌గౌడ్ (30), జన్ముల సురేశ్ (34), సాయి (22), హత్నూర మండలం మంగాపూర్‌కు చెందిన వెంకటేశ్‌గౌడ్‌లు హైదరాబాద్‌లోని ఓ ట్రావెల్ వ్యాన్‌లో బోయినిపల్లికి చెందిన డ్రైవర్ సురేశ్ (25) సహా 16 మంది శబరిమల యాత్రకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో రామేశ్వరం వెళ్లివస్తుండగా, పుదుకొట్టై జిల్లా తిరుమయం వద్ద వీరు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న నాగరాజుగౌడ్, జుర్రు మహేశ్, బోయిన కుమార్‌యాదవ్, అంబర్‌పేట కృష్ణగౌడ్, నక్క ఆంజనేయులు, ప్రవీణ్‌గౌడ్, జన్ముల సురేశ్, అయ్యన్నగారి శ్యాంగౌడ్, చీరాల శివప్రసాద్, సాయి, డ్రైవర్ సురేశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నరేశ్‌గౌడ్, దొంతి భూమయ్యగౌడ్, మస్కూరి రాజు, శ్రీశైలం, వెంకటేశ్‌గౌడ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని తిరుమయం దవాఖానకు తరలించారు. కంటైనర్ రాంగ్‌రూట్‌లో ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఆ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విజయభాస్కర్ తిరుమయం దవాఖానలో క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

**తమిళనాడుకు సీఐ, తహసీల్దార్**


రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి తమిళనాడులోని పుదుకొట్టై జిల్లా కలెక్టర్ గణేశ్‌తో మాట్లాడారు. జేసీ నాగేశ్.. హుటాహుటిన నర్సాపూర్‌కు చేరుకొని తహసీల్దార్ భిక్షపతి, సీఐ సైదులును విమానంలో తమిళనాడుకు పంపించారు. వీరివెంట టీఆర్‌ఎస్ నేత మురళీయాదవ్ కూడా వెళ్లారు. విషయం తెలుసుకున్న వెంటనే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుదుకొట్టై జిల్లా కలెక్టర్ గణేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.




ప్రమాదం జరుగడానికి ముందు అయ్యప్పస్వాములు దిగిన చివరిఫొటో

**నర్సాపూర్ మండలంలో విషాదఛాయలు**

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట, ఖాజీపేట, మంతూర్ గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాముల మృతితో నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ వద్దకు బాధితులు, బంధువులు, గ్రామస్థులు పెద్దఎత్తున చేరుకొని రోదించడం చూపరులను కంటతడిపెట్టించింది. నాలుగు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నర్సాపూర్ పీఎస్‌కు చేరుకొని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.





అయ్యప్పస్వాముల ప్రమాదవార్త విని రోదిస్తున్న వారి కుటుంబసభ్యులు, బంధువులు

**రోడ్డుప్రమాదంపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తమిళనాడులో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. రోడ్డు ప్రమాదంలో 11 మంది తెలంగాణ బిడ్డలు చనిపోవడం పట్ల తీవ్ర బాధను వ్యక్తంచేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్యసదుపాయాలను అందించాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు.

**టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం**

తమిళనాడు ప్రమాదంలో మృతిచెందిన అయ్యప్ప భక్తుల కుటుంబాలకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి అన్ని చర్యలు చేపట్టాల్సిందిగా సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని అధికారులను కోరారు.

**పుదుకొట్టై కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడిన హరీశ్‌రావు**

తమిళనాడులో అయ్యప్ప భక్తుల రోడ్డుప్రమాద ఘటనపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాదం దురదృష్టకరమని, తీవ్ర సంతాపం ప్రకటించారు. గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని పుదుకొట్టై జిల్లా కలెక్టర్ గణేశ్‌తో వెంటనే ఫోన్‌లో మాట్లాడారు. అలాగే మృతదేహాలు స్వస్థలానికి తరలించేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రయాణ సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు.

## శబరిమలకు వెళ్లివస్తూ కీసరవాసి మృతి

**కీసర:** శబరిమలకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కీసరవాసి మృతిచెందిన మృత్యువాతపడ్డాడు. కీసరకు చెందిన మిట్టపల్లి సత్తయ్యగౌడ్ (55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయిదు రోజుల కిందట నల్లగొండ జిల్లా బీబీనగర్ మండలం నుంచి అయిదుగురు అయ్యప్పస్వాములు, ముగ్గురు సాధారణ భక్తులతో కలిసి సత్తయ్యగౌడ్ ఓ వాహనంలో శబరిమల యాత్రకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ఆదివారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో నల్లగొండకు ఐదు కిలోమీటర్ల దూరం వీరు ప్రయాణిస్తున్న వాహనం డివైడర్‌ను ఢీకొట్టి మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో మిట్టపల్లి సత్తయ్యగౌడ్ రెండు చేతులు విరిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలినవారికి గాయాలయ్యాయి.

## తెలంగాణ తరహా పంచాయతీరాజ్ చట్టం తెండి

- అన్ని రాష్ట్రాలకు కేంద్రమంత్రి జోయల్ ఓరమ్ సూచన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రం తరహాలో అన్నిరాష్ట్రాలు నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించుకోవాలని కేంద్ర గిరిజనాభివృద్ధిశాఖ మంత్రి జోయల్ ఓరమ్ అన్నారు. కొత్త చట్టంతో తెలంగాణలో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేయడం అభినందనీయమని చెప్పారు. ఆదివారం జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆడిటోరియంలో నిర్వహించిన పంచాయతీరాజ్ వర్క్‌షాప్ ముగింపుసభలో ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు సంపూర్ణ హక్కులు కల్పించడంలో భాగంగా తెలంగాణలో ప్రత్యేక పంచాయతీలను ఏర్పాటుచేయడం మంచి నిర్ణయమని ప్రశంసించారు. గిరిజనులకు అటవీహక్కులు కల్పించిన ఘనత తెలంగాణకే దక్కిందని పేర్కొన్నారు. గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధిపై అన్నిరాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వశాఖలు సంయుక్తంగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదని, శాఖలమధ్య సమన్వయం కోసమే ప్రత్యేక చట్టాన్ని రూపొందిస్తున్నామని ఓరమ్ వెల్లడించారు.

## ఏమరపాటుతోనే ప్రమాదాలు

- అయ్యప్ప భక్తుల యాత్రల్లో అక్కడక్కడా అపశ్రుతులు
- చిన్నచిన్న కారణాలతో పెను ప్రమాదాలు
- రోజుల తరబడి ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరంటున్న నిపుణులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అయ్యప్పమాలధారణ దీక్షలో ఎంతో నిష్ఠగా ఉంటూ చివరకు అయ్యప్ప దర్శనానికి వెళ్తూ, లేదా దర్శనం చేసుకొని తిరిగి వస్తూ భక్తులు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. రోజుల తరబడి దీక్షల అనంతరం స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరడం పరిపాటే. వీళ్లలో ఎక్కువగా ఒక ఊరు.. ఒకే సామాజికవర్గం.. దగ్గరి బంధువులు, స్నేహితులు ఇలా అంతా దాదాపు ఒకే ప్రాంతానికి చెందిన వారే పదుల సంఖ్యలో కలిసి యాత్రకు వెళ్తుంటారు. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ ప్రభావం కూడా ఆ ప్రాంతంలో పెను విషాదానికి కారణమవుతున్నది. ప్రమాదంలో దగ్గరివారిని కోల్పోవడంతో ఆ గ్రామాల్లో.. కుటుంబాల్లో విషాదఛాయలు అలముకుంటున్నాయి. చాలా ఘటనల్లో చిన్నపాటి ఏమరపాటే పెను ప్రమాదానికి కారణమవుతున్నది. ఆదివారం తమిళనాడు రాష్ట్రంలోని పుదుకొట్టైలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వ్యాన్‌ను కంటైనర్ ఢీకొట్టడంతో మెదక్ జిల్లాకు చెందిన 11 మంది భక్తులు మృత్యువాతపడ్డారు. ఘటన జరిగిన తీరు, అధికారుల ప్రాథమిక సమాచారం ప్రకారం డ్రైవర్ల ఏమరపాటుతోనే ఇది జరిగి ఉంటుందని పేర్కొంటున్నారు. గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. చాలావరకు ఘటనల్లో మావన తప్పిదాలే భారీ ప్రాణనష్టానికి కారణమవుతున్నాయని రోడ్డు భద్రతా నిపుణులు చెప్తున్నారు.

**నిపుణులు చెప్తున్న ప్రధాన కారణాలు..**

- అయ్యప్ప భక్తులు శబరిమలయాత్రలో భాగంగా దారిలో కలిసివచ్చేలా మరికొన్ని పుణ్యక్షేత్రాలకు వెళ్లి వస్తుంటారు. ఎక్కువ మంది కలిసి వెళ్తే ఖర్చులు కాస్త తగ్గుతాయన్న ఉద్దేశంతో జతకలిసే వారంతా వారి సంఖ్యకు తగిన విధంగా ప్రైవేటు వాహనాలు అద్దెకు తీసుకొని వెళ్తున్నారు. రోజుల తరబడి ప్రయాణం చేయాల్సి రావడంతో డ్రైవర్లకు నిద్రలేమి ప్రధాన సమస్య అవుతున్నది. ఏమాత్రం కంటిరెప్ప వాల్చినా వాహనాలు క్షణాల్లో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ప్రైవేటు వాహనాలు అద్దెకు తీసుకువెళ్తున్న భక్తులు చాలా వరకు ఆ వాహన డ్రైవర్‌కు అక్కడి రోడ్లపై అవగాహన ఉన్నదా? లేదా? అన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడంలేదు. కొత్త రాష్ట్రం, కొత్త ప్రాంతం కావడంతో కొన్ని ప్రమాదకర మలుపులు, ప్రాంతాలను డ్రైవర్ పసిగట్టేలోపే కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో యాక్సిడెంట్ జోన్ అంటూ స్థానిక అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం మరో కారణం. ప్రమాదకర మలుపులు ఇతర ప్రాంతాల్లో డ్రైవర్లు అప్రమత్తం కాలేకపోవడం.

# బీజేపీ నిజ స్వరూపం బయటపడింది

- సీబీఐ దర్యాప్తునకు సిద్ధమే
- యూపీ మాజీ సీఎం అఖిలేశ్ వ్యాఖ్యలు

**లక్నో, జనవరి 6:** అక్రమ ఇసుక తవ్వకాల కేసులో ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ సీబీఐ దర్యాప్తును ఎదుర్కోనున్నారంటూ వస్తున్న వార్తలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. దీనిపై ఆదివారం లక్నోలో స్పందించిన అఖిలేశ్ బీజేపీపై విరుచుకుపడ్డారు. ఆ పార్టీ నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. గతంలో తమ రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ సీబీఐని ప్రయోగించేదని, ఇప్పుడు బీజేపీ కూడా అలాంటి పనే చేస్తున్నదని ఆరోపించారు. ఇసుక తవ్వకాల కేసు పాతదని, అయినా సీబీఐ దర్యాప్తును ఎదుర్కోవడానికి తాను సిద్ధమేనని తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో మెజారిటీ సీట్లు గెలువాలని భావిస్తున్నాం. కానీ కొంతమంది సీబీఐని మాపై ప్రయోగించి నిలువరించడానికి ప్రయత్నిస్తున్నారు. సీబీఐ నన్ను ప్రశ్నిస్తే సమాధానం చెబుతా. ఒకవేళ ఎస్పీ, బీఎస్పీ పొత్తులో భాగంగా ఎన్ని సీట్లు పంచుకున్నామో కూడా సీబీఐకి చెప్పాల్సి వస్తుందేమో. గతంలో సీబీఐని కలిసే అవకాశం కాంగ్రెస్ ఇచ్చింది. ఇప్పుడు బీజేపీ ఇస్తున్నది. ఇందుకు నేను సంతోషంగానే ఉన్నా. ఏదీ ఏమైనప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు' అని అఖిలేశ్ పేర్కొన్నారు. బీజేపీ నిజ స్వరూపం బయటపడినందుకు తనకు సంతోషంగా ఉన్నదని, బీజేపీ కూడా తర్వాత ఇలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2012-16 మధ్య హమీర్‌పూర్ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై సీబీఐ కేసు నమోదు చేసింది. మొత్తం 11 మందిపై కేసు నమోదు కాగా.. ఇందులో ఎస్పీ నాయకులు, ఐఏఎస్ అధికారి చంద్రకళ పేర్లు ఉన్నాయి. కేసులో భాగంగా సీబీఐ శనివారం చంద్రకళ, పలువురు ఇండ్లు కార్యాలయాల్లో సోదాలు జరిపింది. తర్వాత అఖిలేశ్ యాదవ్‌ను కూడా విచారించే అవకాశముందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

## ఇండోనేషియాలో భూకంపం

**లండన్, జనవరి 6:** ఇండోనేషియాలో మరోసారి భూకంపం సంభవించింది. ఆదివారం టెర్నెట్ నగరానికి ఉత్తర వాయవ్య దిశగా 174 కి.మీ దూరంలో ఈ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.6గా నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. తొలుత భూకంప తీవ్రతను 7గా ప్రకటించగా, అనంతరం దానిని 6.6గా సవరించారు. కాగా, ఆస్తి, ప్రాణనష్టంపై ఎలాంటి వివరాలు తెలియరాలేదు. ప్రస్తుత సమాచారం ప్రకారం.. సునామీ వచ్చే ప్రమాదమేమీ లేదని పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం ప్రకటించింది.

## వైష్ణోదేవి ఆలయం వద్ద ఈ ఏడాది తొలిసారి మంచు

■ గుండెపోటుతో భక్తుడి మృతి

**జమ్ము, జనవరి 6:** జమ్ముకశ్మీర్‌లోని రైసీ జిల్లా త్రికుట కొండల్లో కొలువైన వైష్ణోదేవి ఆలయం వద్ద ఈ ఏడాది తొలిసారిగా మంచు కురిసింది. ఆదివారం చల్లటి మంచులో కూడా భక్తులు వైష్ణోదేవిని దర్శించుకున్నారు. ఐదు అంగుళాల వరకు మంచు పేరుకుపోవడంతో ఆ ప్రాంతమంతా చల్లటి వాతావరణం నెలకొంది. మంచు వల్ల కొద్దిసేపు హెలికాప్టర్, కేబుల్ కారు సేవలకు అంతరాయం ఏర్పడింది. మాజీ క్రికెటర్, పంజాబ్ మంత్రి నవ్‌జోత్ సింగ్ సిద్ధూ వైష్ణోదేవిని సందర్శించుకున్నారు. మరోవైపు వైష్ణోదేవిని దర్శించుకోవడానికి వెళ్లిన మహారాష్ట్ర వాసి భగవాన్ గోపాల్ భండారీ(71) మరణించారు. కొండ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్న ఆయనకు గుండెపోటు రావడంతో అక్కడ ఉన్న సిబ్బంది వెంటనే దవాఖానకు తరలించగా మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

### తొలి మంచు కురిసింది..



## ఎంపిక చేసుకున్న చానెళ్లకే చెల్లింపు

### ఫిబ్రవరి 1 నుంచి నూతన విధానం అమలు



**న్యూఢిల్లీ, జనవరి 6:** టీవీ ప్రసారాలు, కేబుల్ సర్వీసులపై రూపొందించిన నూతన విధివిధానాలను అమలుచేసేందుకు శాటిలైట్, కేబుల్ టీవీ ఆపరేటర్లకు జనవరి 31 వరకు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) గడువిచ్చింది. ఫిబ్రవరి 1 నుంచి నూతన విధానం అమల్లోకి వస్తుంది. ఈ విధానం ద్వారా వినియోగదారులు తమకు నచ్చిన చానెళ్లను ఎంపిక చేసుకుని, వాటికి మాత్రమే చెల్లింపు చేసేందుకు అవకాశం లభిస్తుంది. చానెళ్లకు ప్యాకేజీ లెక్కన చెల్లించే భారం తగ్గుతుంది. చానెళ్లను ప్యాకేజీగా ఎంపిక చేసుకునే అవకాశం నూతన విధానంలోనూ ఉన్నప్పటికీ వాటిని తప్పనిసరిగా ఒక ప్యాకేజీగానే కొనాలనే నిబంధన ఏమీ లేదు. వాస్తవానికి విడివిడిగా చానెళ్లను ఎంపిక చేసుకునే అవకాశం ఇప్పుడు కూడా ఉన్నప్పటికీ, సర్వీస్ ప్రొవైడర్లు వాటిని ప్యాకేజీగానే అందిస్తున్నారు. పాత విధానంలో విడివిడిగా చానెళ్లను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలంటే ప్రముఖ చానళ్లకు నెలకు సుమారు రూ.60 చెల్లించాల్సి వచ్చేది. నూతన విధానంలో చానల్ గరిష్ఠ ధరపై ట్రాయ్ పరిమితి విధించింది. చానెల్ గరిష్ఠ ధర రూ.19గా నిర్ణయించింది.

## స్టేషన్‌కు 20 నిమిషాలు ముందే రావాలి

■ రైల్వేలోనూ ఎయిర్‌పోర్ట్ తరహా భద్రతా వ్యవస్థ!
■ అలహాబాద్, హుబ్లీ స్టేషన్లలో ఇప్పటికే ప్రారంభం
■ మరో 202 స్టేషన్లలో అమలుకు రైల్వే సన్నాహాలు



**న్యూఢిల్లీ, జనవరి 6:** రైల్వే స్టేషన్లలోనూ విమానాశ్రయ తరహా భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా తనిఖీ ప్రక్రియ కోసం ప్రయాణికులు రైలు బయలుదేరే సమయం కంటే 15-20 నిమిషాలు ముందుగానే స్టేషన్‌కు రావాల్సి ఉంటుంది. విమానాశ్రయాల మాదిరిగానే ప్రధాన రైల్వేస్టేషన్లలోనూ ఇతరులు ప్రవేశించకుండా ఈ చర్యలు చేపడుతున్నారు. ఈ నెలలో ఉత్తరప్రదేశ్‌లో కుంభమేళా జరుగనున్న నేపథ్యంలో అలహాబాద్ రైల్వే స్టేషన్‌లోనూ, అలాగే కర్ణాటకలోని హుబ్లీ స్టేషన్‌లోనూ ఈ తరహా భద్రతా వ్యవస్థను ఇప్పటికే ప్రారంభించినట్లు రైల్వే భద్రతా దళ డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్ వెల్లడించారు. మరో 202 రైల్వే స్టేషన్లలోనూ అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్‌లలో నిఘాను పెంచేందుకు సమీకృత భద్రత వ్యవస్థ అమలు చేయాలని 2016లో నిర్ణయించిన మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా సీసీటీవీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్, వ్యక్తిగత, లగేజీ తనిఖీ వ్యవస్థ, బాంబు గుర్తింపు, నిర్వీర్య వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రూ.385.06 కోట్లతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్‌లోకి ప్రవేశించిన దగ్గర నుంచి వివిధ స్థాయిల్లో తనిఖీలు ఉంటాయని తెలిపారు. విమానాశ్రయాల్లో మాదిరిగా ప్రయాణికులు కొన్ని గంటల ముందే రావాల్సిన అవసరం లేదని, రైలు బయలుదేరే సమయానికి 20 నిమిషాలు ముందు వస్తే సరిపోతుందని అరుణ్‌కుమార్ తెలిపారు.





# పార్టీలన్నీ బలాదూర్
# కారుదే జోర్

■ ఏ పార్టీకీ రాని ఫలితాలు తెలంగాణ రాష్ట్ర సమితికే సాధ్యం
■ ఏ విధంగా చూసిన టీఆర్ఎస్‌దే ఆధిపత్యం
■ ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఆవిష్కృతమైన గణాంకాలు ఇవీ

### గెలిచిన పార్టీకి, రెండో స్థానంలో నిలిచిన పార్టీకి మధ్య ఓట్లలో తేడా

| రాష్ట్రం | తేడా |
|---|---|
| తెలంగాణ | 14.10% |
| ఛత్తీస్‌గఢ్ | 10.00% |
| మిజోరం | 7.40% |
| రాజస్థాన్ | 0.50% |
| మధ్యప్రదేశ్ | - 0.10% |



### తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో విజేతల మెజార్టీలో తేడా

| | | | |
|---|---|---|---|
| లక్ష ఓట్లకుపైగా మెజార్టీతో గెలిచినవారు | - తెలంగాణ | - టీఆర్ఎస్ | - 1 |
| 75 వేల నుంచి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - తెలంగాణ | - టీఆర్ఎస్ | - 3 |
| 50 వేల నుంచి 75 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | ఛత్తీస్‌గఢ్ | - కాంగ్రెస్ | - 6 |
| | - తెలంగాణ | - టీఆర్ఎస్ | - 11 |
| 30 వేల నుంచి 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్ | - కాంగ్రెస్ | - 16 |
| | - తెలంగాణ | - టీఆర్ఎస్ | - 30 |
| 15 వేల నుంచి 30 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్ | - కాంగ్రెస్ | - 27 |
| | - తెలంగాణ | - టీఆర్ఎస్ | - 22 |
| 5 వేల నుంచి 15 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్ | - కాంగ్రెస్ | - 12 |
| | - తెలంగాణ | - టీఆర్ఎస్ | - 12 |
| 5 వేలలోపు ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్ | - కాంగ్రెస్ | - 7 |
| | - తెలంగాణ | - టీఆర్ఎస్ | - 9 |

### విజేతలకు లభించిన ఓట్ల వాటా

| పార్టీ | శాతం | తెలంగాణ | ఛత్తీస్‌గఢ్ | మధ్యప్రదేశ్ | రాజస్థాన్ |
|---|---|---|---|---|---|
| టీఆర్ఎస్ | 70% కంటే ఎక్కువ | 2 | — | — | — |
| | 60 నుంచి 70% లోపు | 7 | — | — | — |
| | 50 నుంచి 60% లోపు | 41 | — | — | — |
| | 40 నుంచి 50% లోపు | 33 | — | — | — |
| | 30 నుంచి 40% లోపు | 5 | — | — | — |
| కాంగ్రెస్ | 60 నుంచి 70% లోపు | — | 1 | 4 | 4 |
| | 50 నుంచి 60% లోపు | 4 | 29 | 34 | 34 |
| | 40 నుంచి 50% లోపు | 14 | 25 | 58 | 40 |
| | 30 నుంచి 40% లోపు | 1 | 13 | 16 | 21 |
| | 30% కంటే తక్కువ | — | — | 2 | — |
| బీజేపీ | 60 నుంచి 70% లోపు | — | — | 4 | — |
| | 50 నుంచి 60% లోపు | — | 2 | 28 | 21 |
| | 40 నుంచి 50% లోపు | 1 | 4 | 52 | 40 |
| | 30 నుంచి 40% లోపు | — | 9 | 22 | 11 |
| | 30% కంటే తక్కువ | — | — | 3 | 1 |

**తెలంగాణ** సహా ఐదు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కొన్ని ఆసక్తికరమైన గణాంకాలను ఆవిష్కరించాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీలకు, ద్వితీయ స్థానంలో నిలిచిన పార్టీలకు మధ్య ఓట్ల తేడా పరంగా తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్ కూటమికి వచ్చిన ఓట్ల కంటే అధికార టీఆర్ఎస్ పార్టీకి 14.1 శాతం ఎక్కువ ఓట్లు పోలవడం విశేషం. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ కంటే కాంగ్రెస్ 10 శాతానికిపైగా ఎక్కువ ఓట్లను సాధించింది.

**అభ్యర్థుల మెజార్టీలోనూ తెలంగాణ టాప్**



మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో విజయం సాధించిన అభ్యర్థుల మెజార్టీ కంటే తెలంగాణలో టీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక మెజార్టీ సాధించడం తెలంగాణ రాష్ట్ర సమితి ఘనవిజయ స్వభావాన్ని చాటిచెప్తున్నది. మిగిలిన రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో టీఆర్ఎస్ అభ్యర్థి ఒకరు లక్ష ఓట్ల పైచిలుకు భారీ మెజార్టీతో విజయభేరి మోగించగా.. మరో ఐదుగురు అభ్యర్థులు 75 వేల నుంచి లక్ష ఓట్ల మధ్య మెజార్టీతో విజయం సాధించారు. వీరంతా కూడా తెలంగాణకు చెందినవారే కావడం గమనార్హం. ఈ ఐదుగురిలో ముగ్గురు టీఆర్ఎస్ అభ్యర్థులు, ఇద్దరు ఎంఐఎం అభ్యర్థులు ఉన్నారు. తెలంగాణలో మరో 12 మంది అభ్యర్థులు 50 వేల నుంచి 75 వేల మధ్య మెజార్టీతో విజయం సాధించారు. ఇటువంటి మెజార్టీతో మరే రాష్ట్రంలోనూ ఇంత మంది అభ్యర్థులు గెలుపొందలేదు. వాస్తవానికి 30వేల కంటే ఎక్కువ మెజార్టీతో గెలుపొందిన అభ్యర్థుల్లో తెలంగాణ అభ్యర్థులు, ప్రత్యేకించి టీఆర్ఎస్ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు.

**ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో టీఆర్ఎస్‌దే ఘనవిజయం**

ఈ ఐదు రాష్ట్రాల్లో ఘనవిజయాల పరంగా చూస్తే కేవలం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లోని విజయాలు మాత్రమే పోల్చదగినవి. అయితే ఇక్కడ కూడా టీఆర్ఎస్‌దే పైచేయి. తెలంగాణలో టీఆర్ఎస్ కంటే ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధిక శాతం సీట్లను గెలుచుకున్నప్పటికీ విజేతలైన అభ్యర్థుల మెజార్టీ విషయంలో టీఆర్ఎస్ ఎంతో ముందంజలో నిలిచింది. ఈ రెండు రాష్ట్రాల్లో మొత్తం 21 మంది అభ్యర్థులు 50 వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించగా.. వారిలో టీఆర్ఎస్ అభ్యర్థులే 15 మంది ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కేవలం ఆరుగురు కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రమే 50 వేలకుపైగా ఓట్ల తేడాతో గెలిచారు. అంతే కాకుండా 30 వేల నుంచి 50 వేల మెజార్టీతో టీఆర్ఎస్ మరో 30 సీట్లను కైవసం చేసుకోగా.. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ఇంత మెజార్టీతో కేవలం 16 సీట్లను మాత్రమే గెలుచుకున్నది.

**మెజార్టీ సగటులోనూ టీఆర్ఎస్‌దే పైచేయి**

మరోవైపు ఈ ఐదు రాష్ట్రాల్లో ఏ పార్టీకి సాధ్యంకాని రీతిలో టీఆర్ఎస్ 32 వేల పైచిలుకు సగటు మెజార్టీతో విజయం సాధించింది. టీఆర్ఎస్ అభ్యర్థుల సగటు మెజార్టీ తెలంగాణలో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థుల సగటు మెజార్టీ కంటే దాదాపు మూడు రెట్లు అధికంగా ఉండటం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లో ఘనవిజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు సగటున 24 వేలకుపైగా మెజార్టీతో గెలువగా.. ఆ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచిన బీజేపీ సగటు మెజార్టీ కేవలం 11 వేలు మాత్రమే.

**అభ్యర్థుల ఓట్ షేర్‌లోనూ టీఆర్ఎస్‌దే అగ్రస్థానం**

ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీల నుంచి దేశవ్యాప్తంగా కేవలం ఇద్దరు అభ్యర్థులు మాత్రమే 70 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. వీరిద్దరూ టీఆర్ఎస్ అభ్యర్థులే కావడం విశేషం. వాస్తవానికి ఈసారి టీఆర్ఎస్ తరఫున విజయం సాధించిన మొత్తం 88 మంది అభ్యర్థుల్లో 50 మంది (దాదాపు 57 శాతం మంది) 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లో గెలిచిన మొత్తం 68 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో కేవలం 30 మందికి (44 శాతం మందికి) మాత్రమే 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు లభించాయి.

**- నేషనల్ డెస్క్**

### అభ్యర్థుల మెజార్టీలో తేడా

| | | |
|---|---|---|
| లక్ష ఓట్లకుపై మెజార్టీతో గెలిచినవారు | - తెలంగాణలో | - 1 |
| 75 వేల నుంచి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - తెలంగాణలో | - 5 |
| 50 వేల నుంచి 75 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్‌లో | - 6 |
| | - మధ్యప్రదేశ్‌లో | - 5 |
| | - రాజస్థాన్‌లో | - 4 |
| | - తెలంగాణలో | - 12 |
| 30 వేల నుంచి 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్‌లో | - 17 |
| | - మధ్యప్రదేశ్‌లో | - 30 |
| | - రాజస్థాన్‌లో | - 25 |
| | - తెలంగాణలో | - 33 |
| 15 వేల నుంచి 30 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్‌లో | - 34 |
| | - మధ్యప్రదేశ్‌లో | - 72 |
| | - రాజస్థాన్‌లో | - 61 |
| | - తెలంగాణలో | - 32 |
| 5 వేల నుంచి 15 వేల ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్‌లో | - 18 |
| | - మధ్యప్రదేశ్‌లో | - 78 |
| | - రాజస్థాన్‌లో | - 70 |
| | - తెలంగాణలో | - 20 |
| 5 వేలలోపు ఓట్ల మెజార్టీతో గెలిచినవారు | - ఛత్తీస్‌గఢ్‌లో | - 15 |
| | - మధ్యప్రదేశ్‌లో | - 45 |
| | - మిజోరంలో | - 40 |
| | - రాజస్థాన్‌లో | - 39 |
| | - తెలంగాణలో | - 16 |

### పార్టీలవారీగా అభ్యర్థులు సాధించిన సగటు మెజార్టీ

| పార్టీ | తెలంగాణ | ఛత్తీస్‌గఢ్ | మధ్యప్రదేశ్ | రాజస్థాన్ |
|---|---|---|---|---|
| టీఆర్ఎస్ | 32,662 | ——— | ——— | ——— |
| బీజేపీ | 17,734 | 11,293 | 15,709 | 15,435 |
| కాంగ్రెస్ | 11,728 | 24,340 | 17,180 | 18,795 |
| బీఎస్పీ | ——— | 12,374 | 19,051 | 9,838 |

## కేరళలో కొనసాగుతున్న హింసాకాండ

■ పలు ఇండ్లు, దుకాణాలపై దాడులు
■ కన్నూర్ జిల్లాలో నిషేధాజ్ఞలు

**తలస్సేరి / శబరిమల:** శబరిమల వివాదంతో అట్టుడుకుతున్న కేరళలో అధికార సీపీఎం కార్యకర్తలకు, బీజేపీ-ఆరెస్సెస్ కార్యకర్తలకు మధ్య హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి రాజకీయంగా ఎంతో సమస్యాత్మకంగా మారిన కన్నూర్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు అనేక ఇండ్లు, దుకాణాలపై దాడులు జరిగాయి. కన్నూర్ జిల్లా తలస్సేరిలో ఆదివారం తెల్లవారుజామున ఎన్జీవో (నాన్ గెజిటెడ్ అధికారుల) సంఘం నాయకుని ఇంటిపై బాంబులతో దాడి జరిగినట్టు పోలీసులు తెలిపారు. అదే ఏరియాలో కొంతమంది బీజేపీ కార్యకర్తల ఇండ్లపై కూడా దాడులు జరుగడంతో అధికారులు నిషేధాజ్ఞలను విధించాల్సివచ్చింది. ఆ ప్రాంతంలో నిరసన ప్రదర్శనలను నిర్వహించబోమని బీజేపీ, సీపీఎం నేతలు శనివారం జిల్లా అధికారయంత్రాంగం నిర్వహించిన శాంతి సమావేశంలో అంగీకరించారు. శబరిమల అయ్యప్ప ఆలయంలో ఇద్దరు మహిళలు ప్రవేశించడాన్ని నిరసిస్తూ ఈ నెల 3వ తేదీన హర్తాళ్‌కు పిలుపు ఇచ్చిన నాటినుంచి శనివారం రాత్రి వరకు జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి 1,286 కేసులను నమోదుచేసి 3,282 మందిని అరెస్టుచేసినట్టు కేరళ డీజీపీ లోక్‌నాథ్ బెహరా వెల్లడించారు. కన్నూర్ జిల్లాలో 169 కేసులు నమోదుచేసి 230 మందిని, పాలక్కడ్ జిల్లాలో 166 కేసులు నమోదుచేసి 298 మందిని అరెస్టుచేసినట్టు ఆయన వివరించారు. 50 ఏండ్లలోపున్న ఇద్దరు మహిళలకు పోలీసు భద్రతతో ఈ నెల 2న శబరిమల ఆలయ ప్రవేశాన్ని కల్పించిన నాటినుంచి హింసాత్మక ఘటనలతో కేరళ అట్టుడుకుతున్న విషయం తెలిసిందే.



ఢిల్లీలోని కేరళ భవన్‌వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

**కేరళలో శాంతిభద్రతలు అధ్వానం: బీజేపీ**


ఇదిలావుంటే, కేరళలో శాంతిభద్రతలు క్షీణించాయని బీజేపీ ఆరోపించింది. అయ్యప్ప ఆలయంలో మహిళలకు ప్రవేశాన్ని కల్పించడంపై నిరసనల్లో పాల్గొన్న తమ పార్టీ రాజ్యసభ సభ్యుడు వీ మురళీధరన్ ఇంటిపై నాటుబాంబు దాడి జరుగడంతో ఆ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వంపై బీజేపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. కేరళలో అరాచకం రాజ్యమేలుతున్నదని, ఆ రాష్ట్రంలో సామాన్య ప్రజలకే కాకుండా పార్లమెంట్ సభ్యులకు సైతం రక్షణ లేకుండాపోయిందని బీజేపీ నేత, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆదివారం ఢిల్లీలో విమర్శించారు.

**హేతువాదాన్ని రుద్దుతున్నారు: ఎన్ఎస్సెస్**

కాగా, శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశం కల్పించిన కేరళ ప్రభుత్వంపై ఎన్ఎస్సెస్ (నాయర్ సర్వీస్ సొసైటీ) నిప్పులు చెరిగింది. రాష్ట్ర ప్రజలపై హేతువాదాన్ని రుద్దేందుకు పినరాయి విజయన్ సర్కారు ప్రయత్నిస్తున్నదని ఆరోపించింది. మత విశ్వాసాలను కాపాడుకునేందుకు అన్ని మత సంస్థలు శాంతియుతంగా ప్రయత్నించాలని ఎన్ఎస్సెస్ పిలుపునిచ్చింది.

## ఇక డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆధార్ అనుసంధానం

■ త్వరలోనే కేంద్రం నిర్ణయం
■ కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడి




**ఫగ్వారా, జనవరి 6:** డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆధార్ అనుసంధానించడాన్ని తప్పనిసరి చేయనున్నట్లు కేంద్ర న్యాయ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. పంజాబ్ రాష్ట్రం ఫగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరుగుతున్న 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సదస్సులో ఆదివారం ఆయన ప్రసంగించారు. డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేసేలా త్వరలోనే కేంద్ర ప్రభుత్వం చట్టం తేనుందని ఆయన వెల్లడించారు. 'ప్రస్తుతం ఏం జరుగుతున్నదంటే... ప్రమాదానికి కారణమైన నిందితుడు పారిపోయి నకిలీ లైసెన్స్ పొందుతున్నాడు. దీని ద్వారా అతడు తప్పించుకునేందుకు వీలవుతున్నది. అయితే ఆధార్ లింక్ చేయడం వల్ల.. ఒకవేళ పేరు మార్చుకోవచ్చునేమో గానీ, ఐరిస్, ఫింగర్‌ప్రింట్స్ మార్చేందుకు సాధ్యపడదు. దీని ద్వారా నకిలీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం అతడు వెళ్లినప్పుడు.. కంప్యూటర్ ఇట్టే పసిగట్టేస్తుంది. అతడికి ఇదివరకే డ్రైవింగ్ లైసెన్స్ ఉందని, కొత్తది ఇచ్చేందుకు కుదరదని చెప్పేస్తుంది' అని ఆయన వివరించారు. డిజిటల్ ఇండియా పథకం పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాలను చెరిపేసిందని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. దేశ డిజిటల్ ప్రొఫైల్‌పై ప్రజెంటేషన్ ఇస్తూ... దేశంలో 123 కోట్ల ఆధార్ కార్డులు, 121 కోట్ల మొబైల్ ఫోన్లు, 44.6 కోట్ల స్మార్ట్‌ఫోన్లు, 56 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారని, ఈ-కామర్స్ రంగం 51 శాతం వృద్ధి సాధించిందని వివరించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆన్‌లైన్ లావాదేవీలు రూ.2,072 కోట్లకు పైగా చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎల్పీయూ వీసీ అశోక్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

**ఆధార్‌తో రూ.90 వేల కోట్లు ఆదా: కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ**

ఆధార్ అమలుతో పొందిన ప్రయోజనంతో ఆయుష్మాన్ భారత్ వంటి మూడు పథకాలకు నిధులను సమకూర్చవచ్చని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. నకిలీ లబ్ధిదారుల ఏరివేత తదితర చర్యల ద్వారా రూ.90వేల కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. 'ఆధార్ లాభాలు' పేరుతో ఆదివారం ఫేస్‌బుక్‌లో చేసిన పోస్ట్‌లో ఆధార్ అమలు విజయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయాత్మక నాయకత్వానికి ప్రతీకగా అభివర్ణించారు.

## విద్యార్థి అరెస్టుకు మహారాష్ట్ర మంత్రి ఆదేశాలు

### వీడియో రికార్డ్ చేయడంపై ఆగ్రహం



**ముంబై, జనవరి 6:** మహారాష్ట్ర విద్యా శాఖ మంత్రి వినోద్ తావ్డే వివాదంలో చిక్కుకున్నారు. ఓ విద్యార్థిని అరెస్ట్ చేయాలంటూ ఆయన పోలీసులను ఆదేశించడం విమర్శలకు దారితీసింది. అమరావతిలోని ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి దగ్గరకు కొందరు విద్యార్థులు వచ్చి.. ఉన్నత విద్య భారీ ఖర్చుతో కూడుకున్నదని, పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత విద్య అందించగలదా? అని ప్రశ్నించారు. ఇందుకు మంత్రి.. చదువుకునే స్థోమత లేకపోతే పనిచేసుకోవాలంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ సంభాషణను ఓ విద్యార్థి ఫోన్‌లో రికార్డ్ చేస్తుండగా, మంత్రి తీవ్రంగా మండిపడ్డారు. ఆ విద్యార్థిని అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్‌లోని వీడియోలను తొలిగించారు.

## 5వేల కిలోల మహాకిచిడీ



కిచిడీ తయారీలో పాల్గొన్న కేంద్రమంత్రులు హర్షవర్ధన్, తావర్‌చంద్ గెహ్లాట్

■ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో తయారీ
■ ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు బీజేపీ సమాయత్తం

**న్యూఢిల్లీ, జనవరి 6:** దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం కిచిడీ ఘుమఘుమలతో అలరారింది. ప్రజలతో కిటకిటలాడింది. దళితులు, వెనుకబడిన వర్గాలకు మరింత చేరువయ్యేందుకు బీజేపీ 'భీమ్ మహాసంగమ్' పేరుతో ఆదివారం ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా 5వేల కిలోల కిచిడీని తయారుచేసింది. తద్వారా ప్రపంచ రికార్డు సృష్టించేందుకు సమాయత్తమవుతున్నది. ఢిల్లీలోని సుమారు మూడు లక్షల మంది దళితుల ఇండ్ల నుంచి సేకరించిన ఆహార పదార్థాలతోనే కిచిడీని తయారుచేయడం గమనార్హం. ఈ భారీ కిచిడీకి 'సంరస్త కిచిడీ' అని నామకరణం చేశారు. మహా కిచిడీ తయారీకి 400 కిలోల బియ్యం, 350 కిలోల కూరగాయలు, 100 కిలోల పప్పు ధాన్యాలు, 100 కిలోల నెయ్యి, 100 లీటర్ల నూనె, 2,500 లీటర్ల నీళ్లు, 250 కిలోల మసాలా సామగ్రిని వినియోగించారు. ఒకే భారీ పాత్రలో ఈ కిచిడీని వండారు. నాగ్‌పూర్‌కు చెందిన చెఫ్ విష్ణు మనోహర్ దీన్ని తయారుచేశాడు. గతంలో నాగ్‌పూర్‌లో 3వేల కిలోల కిచిడీని తయారుచేసి వరల్డ్ రికార్డును ఆయన నెలకొల్పారు. సమాజంలో వ్యక్తుల మధ్య అంతరాల్ని తొలిగించి, తామంతా ఒక్కటే అనే భావనను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఢిల్లీ బీజేపీ చీఫ్ మనోజ్ తివారీ చెప్పారు. 25వేలకు మందికిపైగా కిచిడీని ఆరగించినట్లు ఆయన తెలిపారు.

## ఇన్‌ఫార్మర్ నెపంతో వాచ్‌మన్ హత్య

### ఒడిశాలో మావోయిస్టుల ఘాతుకం

**పుల్బనీ(ఒడిశా)/దుమ్ముగూడెం, జనవరి 6:** ఒడిశాలో మావోయిస్టులు దారుణానికి పాల్పడ్డారు. పోలీస్ ఇన్‌ఫార్మర్ అనే నెపంతో ఓ వాచ్‌మన్‌ను కాల్చి చంపారు. కంధమాల్ జిల్లాలోని పుల్బనీ సర్దార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఓకాంట్రాక్టర్ క్యాంపుపై మావోయిస్టులు దాడి చేశారని కంధమాల్ ఎస్పీ తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం ఉంచిన మూడు ట్రాక్టర్లు, రోడ్డు రోలర్, ఓ ట్రక్కుకు వారు నిప్పంటించారని చెప్పారు. అనంతరం వాచ్‌మన్‌ను అడవుల్లోకి తీసుకెళ్లి కాల్చివేశారని తెలిపారు.

**జవాన్ల బ్యాగుల అపహరణ**

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో కోబ్రా బలగాల బ్యాగులను మావోయిస్టులు ఆదివారం ఎత్తుకెళ్లారు. కిష్టారం గ్రామంలో నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రిని కొనుగోలు చేసిన సభ్యులు, వాటిని ఓ ట్రాక్టర్‌లో పంపించగా, మావోయిస్టులు ట్రాక్టర్‌ను నిలిపివేసి వాటిని ఎత్తుకెళ్లారు.



సౌందర్యాన్ని సృష్టించేది మన ఇంద్రియాలను
ఉద్రేకపరచడానికి కాదు,
మన ఆత్మను సుస్థిరత్వాన్ని ఇవ్వడానికి.

**గాబ్రీలా మిస్త్రల్**

## పాగల్ చందమామ



ఈ పాగల్ చందమామ
నా మాటను పట్టించుకోదు
ఎంత చెప్పినా
చీకటి పడ్డాకే
బయటకు బయలుదేరుతుంది
అందంగా వుంటుంది
హుందాగా బతుకుతుంది
మసక పడ్డాక మంచిదికాదు
సాయంకాలం రావద్దంటే
భయం లేకుండా వస్తుంది

వీధుల్లో కుక్కలుంటాయి
మూల మలుపు దగ్గర
అల్లరి మూకలుంటాయి
కుక్కలు మీదపడి కరిచినా
అల్లరి మూకలు వెంటపడి చెరిచినా
ఎవ్వరూ అడ్డం రారు
ఎక్కడ చెప్పుకున్నా
ఈ అడవిలో
ఏమీ లాభముండదు

నా సంగతి వేరు
అర్ధరాత్రి తిరిగి తిరిగి
గాయాలు ఏరుకొంటాను
ఆగమైన వాళ్లకు
తెల్లారేదాకా తోడుగా నడుస్తాను

ఇంకా ఎన్నిరోజులుంటుందో
ఈ అమాయకత్వం
పోయి పోయి దొంగలు పడే వేళ్లకు
దోచుకొమ్మన్నట్టుగా
చిమ్మ చీకట్లోనే
మిల మిల మెరిసే
చిరునవ్వులు ధరించి వస్తుంది

ఈ నిర్మానుష్యపు
ఎడారి దారిలో
బందిపోట్లలా
గొడ్డుమబ్బులు అడ్డంగా వుంటాయి
ఎదురుగా కొండచిలువ విషంలా
రాహువు బుసలు వినిపిస్తాయి

అందుకే చెపుతున్నా!...

ఓ చందమామా
చుక్కల మెలి ముసుగులో
వెన్నెల గుర్రం మీద
అల్లి రాణిలా
ఈ రాత్రిపూటనే రాకు!

వస్తే
రావడం తప్పదంటే..
గాండ్రించే
తెల్లని పులిలారా!
ప్రళయం లాంటి చీకట్లో
వెల్తురు నింపడానికి
దీపం పట్టుకొనిరా!
నేను కలగన్న
అపురూపమైన
రూపంతో రా!

**– ఆశా రాజు, 93923 02245**


**(ముద్దుగా కొందర్ని, కొన్నిసార్లు పాగల్ అని పిలుచుకుంటాం 'పాగల్' అంటే పిచ్చితనం)**



## ప్రపంచ కవిత

### బెర్టోల్ట్ బ్రెక్ట్

(1898, ఫిబ్రవరి 10-1956, ఆగస్ట్ 14)



20వ శతాబ్దపు ప్రపంచాన్ని మేధోప రంగా ప్రభావితం చేసిన నాటక కర్త, కవి, మార్క్సిస్ట్ మేధావి యూజీన్ బెర్టోల్ట్ ఫ్రిడ్రిక్ బ్రెక్ట్! జర్మనీలోని బవేరియా ప్రాంతం ఆగ్స్‌బర్గ్ పట్టణంలో జన్మించిన బ్రెక్ట్, తన తల్లి ద్వారా చిన్ననాడే బైబిల్‌ను ఆసాంతం చదివాడు. అది ఆయనలో ఎన్నెన్నో ప్రశ్నలను లేవనెత్తి దాని ప్రభావం ఆయనలో సరికొత్త భావజాలం ఎదుగటానికి తోడ్పడింది.

బ్రెక్ట్‌కు 16వ ఏట మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమైనప్పుడు, తోటి విద్యార్థులంతా సైన్యంలో చేరగా తానుమాత్రం అందుకు నిరాకరించడంతో పాఠశాల నుంచి బహిష్కృతుడైనాడు. ఆ తర్వాత ఎలాగో మ్యూనిక్ యూనివర్సిటీలో వైద్య విద్యలో చేరినప్పటికీ అక్కడ నాటకాల వైపు ఆకర్షితుడై 1918లో Baal నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించి ఒక్కసారిగా ప్రజల దృష్టిలో పడ్డారు. ఆ తర్వాత ఎన్నో నాటకాలు రాసి, వేసి నాటకరంగంలో ఆధునిక ప్రయోగాలెన్నింటినో చేసి, Epic Theatreకు ఆద్యుడిగా నిలిచాడు. బతికినంత కాలం మార్క్సిస్ట్‌గా బతికి ప్రపంచాన్ని, జీవితాన్ని గతితార్కిక భౌతికవాద కోణం లోంచే అర్థం చేసుకునే ప్రయత్నం చేసిన బ్రెక్ట్, రెండో ప్రపంచ యుద్ధకాలంలో హిట్లర్‌కు వ్యతిరేకంగా పనిచేసినందుకు గాను, 1933లో జర్మనీని వదిలి ప్రవాసాన్ని గడుపాల్సి వచ్చింది. ఆ కాలంలో డెన్మార్క్, స్వీడన్, ఫిన్లాండ్ దేశాల్లో తలదాచుకున్నాడు. అనంతరం అమెరికాకు వెళ్లిన బ్రెక్ట్ అక్కడ ఎన్నో నాటకాలను సృష్టించడమే కాక, The Hangman Also Die! సినిమాకు స్క్రీన్ ప్లే కూడా రాశాడు. కవిగా బ్రెక్ట్ తన యవ్వన ప్రాయంలోనే, అంటే 1914లోనే జానపద కథల ప్రభావంతో తొలి కవితను రాసి, ఆ తర్వాత నాటకాల్లో భాగంగానూ, విడిగానూ వందలాది కవితలు రాశాడు. సమస్త రకాల అణిచివేతలపై ప్రజల్లో తిరుగుబాటుకు చోదకశక్తిగా కళ ఉండాలని నమ్మి, ఆచరించి, నిరూపించిన బ్రెక్ట్ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ ఎంతో మంది నాటకకర్తలకు, కవులకు, నిత్య స్ఫూర్తిగా వెలుగుతున్నాడు!

## అసలేం జరిగింది?

ఒకానొక పారిశ్రామికవేత్త
తన విమానానికి మరమ్మతులు చేయిస్తున్నాడు
ఒక ఆధ్యాత్మికవేత్త
ఎనిమిది వారాల క్రితం నాటి తన ప్రవచనంలో
ఏం చెప్పానోనని ఆశ్చర్యపోతున్నాడు
సైనిక దళపతులంతా పౌరులుగానూ
బ్యాంక్ గుమాస్తాల్లాగానూ కనిపిస్తున్నారు
ప్రభుత్వ ఉద్యోగులంతా
మైత్రీ పూర్వకంగా మెలుగుతున్నారు
ఖద్దరు టోపీ పెట్టుకున్న ఒకానొక మనిషికి
రక్షకభటుడొకరు దారిని చూపిస్తున్నాడు
అద్దెకిచ్చిన తన భవనంలో
నీటి సరఫరా సాగుదల గురించి కనుక్కోవడానికి
యజమానే స్వయంగా వచ్చాడు
జర్నలిస్టులంతా తాటికాయంత అక్షరాల్లో
ప్రజలు అని పత్రికల్లో రాస్తున్నారు
గాయకులంతా గొంతెత్తి పాడుతున్నారు
ఓడల కెప్టెన్లు తమ సిబ్బంది బసలో
ఆహారం ఉందా అని ఆరా తీస్తున్నారు
కార్ల యాజమానులు తమ డ్రైవర్ల పక్కన కూర్చుంటున్నారు
వైద్యులంతా బీమా కంపెనీలపై దావాలు వేస్తున్నారు
మేధావులంతా తమ అలంకరణల్ని దాచుకుంటూ
ఆవిష్కరణలను మాత్రమే ప్రదర్శిస్తున్నారు
రైతులు తాము పండించిన బంగాళాదుంపల్ని
సైనిక శిబిరాలకు చేరవేస్తున్నారు
నిజానికి జరిగిందేంటో తెలుసా?
విప్లవం తన తొలి యుద్ధాన్ని గెలిచింది!!

**మూలం: బెర్టోల్ట్ బ్రెక్ట్**

**స్వేచ్ఛానువాదం: మామిడి హరికృష్ణ, 80080 05231**

# అరుదైన కవి 'అలిశెట్టి'

జీవితంలో తాను కోరుకొన్న శిఖరాలకు చేరుకోలేకున్నా, తన ఆలోచనలకు అనుగుణంగా జీవించలేకున్నా, తనలో తాను పడుతున్న మథనానికి అంతం లేదని తెలిసినా, మనిషి తన చుట్టూ ఉండే సమాజం పట్ల తన తపనను తనకు తెలిసిన మార్గంలో ఇతరులతో పంచుకొనే ప్రయత్నం చేస్తుంటాడు. సమాజంలో జీవించడం అంటే తన చుట్టూ జరిగే సంఘటనల పట్ల స్పందించకుండా ఉండలేకపోవడం, తన స్పందనను పంచుకొనే క్రమంలో తన వారంటూ లేకున్నా, తన ప్రతిస్పందనలను పంచుకొనే ఏకైక మార్గం తన స్పందనలకు అక్షరరూపం ఇవ్వడం. అదే వచనం కావచ్చు, లేదా కవిత్వం కావచ్చు.

సమాజాన్ని మార్చాలనుకొనే లక్షలాదిమంది సామాన్య యువతరంలా ప్రభాకర్ కూడా 70-80 దశకంలోని వామపక్ష భావాలకు ఆకర్షితుడై, తనకున్న ఆస్తిపాస్తులను అమ్ముకొంటూ, తన జీవితాన్ని కొవ్వొత్తిలా కరిగిస్తూ, సమాజాన్ని మార్చాలని ప్రయత్నించిన నిత్య పోరాట వీరుడు ప్రభాకర్. తన ఆలోచనలకు అక్షరరూపం ఇచ్చి, భావాలే తూటాలుగా సమాజాన్ని మార్చగలనని మనసా వాచా నమ్మిన అక్షరయోధుడు ప్రభాకర్.

తన పరిసరాలను, ఇల్లును తాను కోరుకున్న నూతన సమాజంలా తీర్చిదిద్దుకొని, ఇతరులకు తాను కోరుకొనే నూతన ప్రపంచాన్ని చూపెడుతుంటాడు. అతని ఆలోచనల ప్రతిరూపాలు అత ని చుట్టూ ఉండే సమాజంలోని మంచి చెడులకు, అంతరాలకు, వివక్ష అణిచివేతలకు ప్రతిబింబాలుగా ఉంటాయి.

తన ఆలోచనలను అక్షరరూపంలో ప్రపంచంతో పంచుకొనే క్రమంలో కావలిసిన వారు దూరమైనా, తన ఆలోచనలను మార్చుకోకుండా నిబద్ధతతో నిలిచాడు. ప్రపంచంలో తాను కోరుకునే మార్పు రావాలని, దానికి తన జీవితాన్నే ఫణంగా పెట్టాల్సి వస్తుందని తెలిసినా, వెనుకడుగు వేయని ఎంతోమంది ధైర్యస్తుల్లో అలిశెట్టి ప్రభాకర్ ఒకరు. మంచి చిత్రకారుడిగా తన చుట్టూ ఉండే రంగుల ప్రపంచాన్ని దగ్గరగా పరిశీలించే ప్రభాకర్ జిలుగు వెలుగుల జీవితంలోని చీకటిని చీల్చి చెండాడు. అతను ఎప్పుడూ అవకాశాలు అందుకోలేని పీడిత ప్రజల బాధల పట్ల, వారి మౌన వేదనల పరిష్కారం కోసం సంవేదనాశీలతతో ఆలోచించాడు.

జగిత్యాలలో జరిగిన రైతాంగ పోరాట 'జైత్రయాత్ర'కు ప్రత్యక్ష సాక్షి అయిన అలిశెట్టి సాయుధ పోరాట వారసత్వాన్ని ప్రేమించాడు. జైత్రయాత్ర ప్రభావంతో తన ఆలోచనలను అక్షరీకరించడానికి చేసిన ప్రయత్నంలో 'ఎర్రపావురాలు'(1978) కవిత్వం రూపు కట్టింది. చివరగా **'మరణం నా చివరి చరణం కాదు'** అంటూ తన జీవితాన్ని ముగించాడు అలిశెట్టి ప్రభాకర్.

అందరిలాగా సాధారణ జీవితం గడుపాలనుకోని ప్రభాకర్, సమాజాన్ని ఉన్నదున్నట్లుగా చూడాలనుకోలేదు. తాను ఉన్న సమాజంలో ఆకలి, అరాచకం, కులమతాల వివక్ష అణిచివేతలు,ధనిక పేద తారతమ్యాల్లేని ఒక నూతన ప్రపంచాన్ని చూడాలని నిరంతరం పరితపించిన, కృషి చేసిన ఉద్యమకారుడు అలిశెట్టి ప్రభాకర్.

తన నమ్మకాలు, వ్యవహారాలు తన జీవితంలోని సుఖాలను, తన కుటుంబసభ్యుల ప్రశాంత జీవితాన్ని అల్లకల్లోలం చేస్తాయని తెలిసినా, అవి నిజమైనా వెనుకడుగు వేయకుండా



తన సిద్ధాంతాలకే కట్టుబడిన అవిశ్రాంత పోరాట యోధుడు ఆయన. ఆ క్రమంలో తన జీవితా న్నే కోల్పోయిన నిజమైన ప్రజా కవి ప్రభాకర్.

తన ఇద్దరు పిల్లలను, తననే నమ్ముకొని వచ్చిన తన జీవిత భాగస్వామి భాగ్యను మానసికంగా తన నమ్మకాలపట్ల, ఆలోచనల పట్ల మద్దతుపలికే సహచరులుగా చేసుకోవడంలో విజయం సాధించాడు.

తన కవితాలోకంలో ప్రపంచంలోని అందరి బాధతప్త జీవుల బాధలకు అక్షరరూపం ఇచ్చినట్లే తన జీవిత భాగస్వామి భాగ్య పట్ల తనకున్న అనురాగాన్ని, ఆమె పట్ల తాను ఏర్పర్చుకొన్న అభిప్రాయాన్ని, ప్రేమను తన చివరి రోజుల్లో కవితారూపంలో చెప్పుకొని తనకుతాను స్వాంతన పొందాడనిపిస్తున్నది.

**'చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్లు చెరుగుతున్నప్పుడు**
**సంసారం బరువెంతో సమీక్షించుకొనేవాణ్ణి**
**ఆకుపచ్చని చెట్టు, ఆహ్లాదభరితమైన వాతావరణమేమి లేకుండానే**
**పగలు రాత్రి ఆస్బెస్టాస్ రేకుల కింద పడి ఎంత వేడెక్కినా**
**మాడిపోకుండా ఉండగల్గిన మానవాతీతుణ్ని..'** అంటూ తనకు తానే ఓదార్చుకొన్నాడు. తన జీవితంలో తనతో పాటు ఉండి, తనకు సంపూర్ణ సహకారం అందించిన భార్యకు కృతజ్ఞతాపూర్వకంగా ఈ కవితలో అలిశెట్టి తన ప్రేమను వెల్లడించాడు.

తన సొంత ఊరును, తన వాళ్లను విడిచి కరీంనగర్ వెళ్లినా, అక్కడ కూడా ఆయనను వెంటాడిన రాజ్య బెదిరింపులు, నిర్బంధాలు రాజధానికి చేరిన తర్వాత కూడా వీడలేదు. రాజ్యాన్ని ఎదిరించిన ప్రభాకర్ తన అనారోగ్యాన్ని కూడా అంతకంటే ఎక్కువగా ఎదిరించాడు. ఈ ప్రపంచంలో తనలాంటి నిజాయితీపరులు నిలువలేరని, సిద్ధాంతాల పేర వ్యాపారం చేసుకొనే వారిని తన సహచరులుగా చెపుకోవడానికి సిగ్గుపడే వ్యక్తిత్వం అలిశెట్టిది. ఎన్నో ఆశలతో నగరాలకు వచ్చే గ్రామీణ ప్రజల జీవితాలను అతి దగ్గరగా చూసిన ప్రభాకర్, ఆశల పల్లకి తన కళ్లముందే కూలిపోతున్నా, ఏం చేయలేని నిస్సహాయ స్థితిని నగర జీవితాన్ని తన కవితలో.. **'నరకప్రాయమైన నగర నాగరికతను నరనరానా జీర్ణించుకొన్నవాణ్ని..'** అంటూ తన బతుకు బండిని మరికొంత కాలం, మరికొంత దూరం ఈడ్చుకెళ్లడాని కి, తన వద్ద ఉన్న ఆస్తిని ఈ విధంగా చెప్పుకొన్నాడు.

**'రోజుకో రెండు కవితా వాక్యాల్ని రాయలేనా**
**అది మనకు పెన్నుతో పెట్టిన విద్య.. ఆఫ్ కోర్స్**
**కవిత్వం ఎంత నిత్యనూతనంగా వెలికి వచ్చినా**
**రాసిన ప్రతిదీ ఆణిముత్యం కాదని అందరికీ తెలుసు..'**

అంటూ.. తాను రాసిన ప్రతిదీ ఆణిముత్యం కాదని తానే చెప్పుకున్న నిజాయితీ పరుడు. తన కవిత్వం ఈ సమాజాన్ని సహజ న్యాయం దిశలో నడిపించలేకపోతుందని, ప్రజల్లో, ముఖ్యంగా విద్యావంతుల్లో, మేధావుల్లో రావాల్సిన మార్పు రావడంలేదని ఆవేదన చెందేవాడు, అసంతృప్తిని వెల్లడించాడు. నమ్మిన సిద్ధాంతాలతో తనకు తోడుగా ఉంటామని చెప్పి, దారి మధ్యలోనే ప్రయాణాన్ని విరమించుకున్న వారితో విభేదించినా, వారితో స్నేహాన్ని మాత్రం వీడలేదు. తన రచనలను, కలాన్ని కాసులు కురిపించే వెండితెరకు అందించాలనే అనేక ప్రతిపాదనలను నిర్ద్వంద్వంగా తిరస్కరించి, తన తల్లిదండ్రులిచ్చిన ఆస్తులను అమ్ముకొని తన జీవితాన్ని స్వేచ్ఛగా ఎల్లదీసిన నిస్వార్థపరుడు అలిశెట్టి ప్రభాకర్.

తన భావాలను వెల్లడించడానికి ఎన్నడూ వెనుకాడని వాడు అలిశెట్టి. పైకి అభ్యుదయ ప్రగతిశీలురుగా చెప్పుకుంటూ.. సాగుతున్న పోరాటాలకు మద్దతుగా నిలువకుండా, రంధ్రాన్వేషణతో విమర్శించే వారంటే ఆయన ఆమడ దూరం పెట్టేవాడు. ఇతరుల మాటలకు, పొగడ్తలకు వెరువని, లొంగని ధీశాలి. మినీ కవిత్వానికి తనదైన వాడి వేడితో సాహిత్య గౌరవాన్ని తెచ్చిపెట్టిన ఘనుడు ప్రభాకర్. పుట్టడం, చావడం మన చేతిలో ఉండకపోయినా, ఆ రెండు ఒకేరోజు జరుగకపోవడం సర్వసాధారణం. కానీ ఆ రెండు ఒకేరోజు సంభవించడమే అలిశెట్టి జీవితంలోని ప్రత్యేకత. ప్రభాకర్ అందరిలాంటి సామాన్యుడు కాదనే విషయం ఆయాన్ నిజ జీవితంలోనే కాదు అమరుడైన రోజుతో కూడా నిరూపించాడు.

**కవి భౌతికంగా దూరమైన కొద్దీ, ఆయన రాసిన కవిత్వం ఆయన్ను మరింతగా ప్రజలకు దగ్గరగా చేస్తుందనడానికి ప్రభాకర్ నిలువెత్తు నిదర్శనం. ఆయన కవిత్వం పట్ల నేటి యువత పెంచుకుంటున్న మమకారమే దానికి తార్కానం. సమకాలీన సమాజ పోకడలు, సామాజిక వికృతాలు, హింసలను కవిత్వంతో చెండాడుతూ.., కుంచెతో అర్థవంతమైన బొమ్మలు గీసిన అలిశెట్టి ప్రభాకర్ అరుదైన కవి, చిత్రకారుడు. ప్రభాకర్ జీవితం, ఆచరణ నేటి సాహిత్యలోకానికి ఆదర్శప్రాయం.**

కవి భౌతికంగా దూరమైన కొద్దీ, ఆయన రాసిన కవిత్వం ఆయన్ను మరింతగా ప్రజలకు దగ్గరగా చేస్తుందనడానికి ప్రభాకర్ నిలువెత్తు నిదర్శనం. ఆయన కవిత్వం పట్ల నేటి యువత పెంచుకుంటున్న మమకారమే దానికి తార్కాణం. సమకాలీన సమాజ పోకడలు, సామాజిక వికృతాలు, హింసలను కవిత్వంతో చెండాడుతూ.., కుంచెతో అర్థవంతమైన బొమ్మలు గీసిన అలిశెట్టి ప్రభాకర్ అరుదైన కవి, చిత్రకారుడు. ప్రభాకర్ జీవితం, ఆచరణ నేటి సాహిత్యలోకానికి ఆదర్శప్రాయం.

**– సీహెచ్‌వీ ప్రభాకర్‌రావు, 93915 33339**

**(జనవరి 12న అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా..)**

# ఇబ్తెదాయె ఇష్క్ మే...

'ఇబ్తెదాయె ఇష్క్ మే..' అరువైయవ దశకంలో వచ్చిన **'హరియాలీ ఔర్ రాస్తా'** సినిమా పాటలో తొలి చరణం అది. నా కౌమార దశ నుంచి ఆ పాటకు నేను ఫిదా. ఇప్పుడు కూడా ఆ పాట నా వీనులకు సోకగానే జ్ఞాపకాల పరిమళాలు గుప్పుమని కమ్ముకుంటాయి. అది సరేగాని నేను ఆరు పదులు దాటినాక ఒక సుప్రభాత సమయంలో 'ఇబ్తెదాయె ఇష్క్' అంటే ఏమిటి? అని సందేహం తొలుచుకొచ్చింది. ఆలోచిస్తుంటే ఆ మొలకెత్తిన సందేహం ఇంతింతై వటుడింతై పెరిగిపోయింది.

శంకానివృత్తి కోసం పెద్దదిక్కు సామల సదాశివగారిని అడుదామంటే ఆయనేమో స్వర్గంలో దేవతలకు అరబ్బీ, ఫారసీ, ఉర్దూభాషల సాహిత్య రహస్యాలను బోధించటంలో మస్రూఫ్‌గా ఉన్నాడాయె. ఇక చివరాఖరికి మిగిలిన ఒకే ఒక్కడు నోముల సార్‌కు ఫోన్ చేశా. గుప్పున సిగరెట్ పొగ వదిలినట్లు టక్కున సమాధానం వచ్చింది. ఇబ్తెదాయె ఇష్క్ అంటే 'లేత వయసులోని తొలి వలపు' అని. ఆ జవాబుతో నా తబియ త్ ఖుష్ అయిపోయింది.

పిమ్మట ఉర్దూ భాషకు సంబంధించి ఎప్పుడు ఏ సందేహం వచ్చినా కేరాఫ్ అడ్రస్, ఉన్న ఒకే ఒక దిక్కు నోముల సారు. నోములా నోములా నల్లగొండ వెన్నెలా.. ఇపుడు ఆ చివరి వెన్నల కూడా మసకేసి మబ్బుల చాటుకు మాయమైంది. ఆకాశం తలుపులు బార్లా తెరుచుకుని అవతలివైపునకు నిష్క్రమించింది.

ఇపుడు ఉర్దూ భాషలోని 'అలీఫ్, పే, బే, తే, సే' అక్షరాలన్నీ అనాథలై ఒంటరొంటరిగా మిగిలిపోయినై.. మనందరితో సహా!

రెండు పదుల క్రితం ఒక కొత్త సంవత్సరం తొలి రోజు జయమిత్రులందరం 'అమ్మంగి' ఇంట్లో కలుసుకుని అమ్మంగి రాసిన పాట **'చిన్న గొర్రెపిల్లలమూ నోములా- మెల్లమెల్లగా నడుపు నోములా..'** అని కోరస్‌గా పాడుతుంటే ఆయన చిద్విలాసంగా చిర్నవ్వులు చిందిస్తూ చుక్కల్లో చంద్రుడిలా మా మధ్య కొలువుతీరి గుప్పుగుప్పున పొగలు పీలుస్తూ వదులుతూ కూచున్నాడు.. అల్లపుడెపుడో బొగ్గుతో నడిచే పాత రైలింజను మాదిరిగా. ఇప్పుడు ఆయన మహాభినిష్క్రమణంతో ఈ జనారణ్య కీకారణ్యంలో ఆ గొర్రెపిల్లలన్నీ ఒంటరి ద్వీపాలుగా దిగులు దిగులుగా మిగిలిపోయినై.

ఇపుడు మనం మూలమూలలకు నోములకోసం వెదుక్కుంటూ అంగలారుస్తున్నాం గానీ.., నీలాంబరపు తెరల పొరల వెనుక జన్నత్‌లోని మెహెఫిల్‌లో 'సామల-నోముల' గురుశిష్యులిరువురు భిన్న భాషల సాహిత్యాల గురించి గుఫ్తగూ (చర్చ) చేస్తుంటారనే నా నమ్మకం. గురుశిష్యులిద్దరూ స్వర్గంలో ఒక ఉర్దూ ఇస్కూల్ నడుపుతున్నారనీ, దేవతల పిలకాయలందరూ అందులో నల్లపలకల మీద తెల్ల చాకుపీసులతో 'అలీఫ్, పే, బే, తే'సే ల అక్షరాభ్యాసం చేస్తుండొచ్చనే నా అనుమానం. బడి పంతుళ్లుగా జీవితాలు ప్రారంభించిన ఆ ఇద్దరూ పుడకల మీద నుండి పై స్వర్గానికి చేరుకున్నా లక్షల లక్షల అక్షరాల మీద ప్రేమ ఇంకా తగ్గలేదేమో! వారి సహజ స్వభావం వీరిని వీడలేదేమో.



సామలకు నోముల గురువుకు తగ్గ శిష్యుడు. పెద్దాయన ముందు నోముల చిన్న పిల్లాడిలా భయభక్తులతో చాలా అదబ్‌గా, వినయంగా ఉండేవాడు. ఆ నిత్యాగ్నిహోత్రి గురువుగారి ముందు సిగరెట్ వెలగించేవాడు కాదు. గొంతు చించుకుని చర్చించేవాడు కాదు.ఆ విషయాన్ని గమనించిన నేను ఒక సారి నోములవారితో ప్రస్తావించగా.. ఆయన ఒక సుదీర్ఘమైన దమ్ములాగి **'బుజుర్గ్ లోగోంకే సామ్నే ఊంఛీ ఆవాజ్ సే బాత్ నహీం కర్నా'** అని ఉపదేశించాడు. అట్లా నోముల వారి పుణ్యమా అని నేను తెహజీబ్ (సంస్కారం) గురించి ఒక పాఠం నేర్చుకున్నా.

నేను మళ్ళీ 'ఇబ్తెదాయె ఇష్క్' దగ్గరికే వస్తా. 'తొలి చూపులో తొలి వలపు'. 1982లో ప్రప్రథమంగా నల్లగొండలో నాకు నోముల వారి దర్శనభాగ్యం లభించింది. వెంకటేశ్వరా టాకీసు పాన్ డబ్బా ముందు దోస్తుల మధ్య. టక్కుటక్కుల నల్లబూట్లు, పొడుగు చేతులున్న ఇన్‌షర్టు, శిరోమాణిక్యంలా తలమీద పికాసో హ్యాటు, శ్రీశ్రీ మార్కు సిగరెట్టు స్మోకింగు, చంకలో ఏదో ఇంగ్లీష్ పుస్తకం. ఆ ప్రథమ వీక్షణంలో నాకాయన కళింగాంధ్ర బహుబాషావేత్త రోణంకి అప్పలస్వామిలా కనిపించి ఇబ్తెదాయె ఇష్క్‌లో పడిపోయాను. ముచ్చటగా ముప్పై ఆరేండ్ల మత్సరము లేని ఇష్క్ మాది.

కాకపోతే మా ఇద్దరి మధ్యా ఒక 'లవర్స్ క్వారెల్' కూడా ఉంది. నా 'సలాం హైద్రాబాద్' నవలను ఆంగ్లీకరిస్తానని వాగ్దానం చేసి ఆశపెట్టాడు. ఆ అనువాదానికి నోముల వారే తగువారని నా ప్రగాఢ విశ్వాసం. కాని క్యా ఫాయిదా? ఉస్తాద్ వాదా న నిభాయె. 'దేఖ్ లేయింగే నోముల సాబ్ దేఖ్ లేయింగే'. ఏదో ఒక రోజు ఆకాశం అవతలి వైపు సరిహద్దు సంధ్యలలోనో, ఏ వినువీధుల మూల మలుపులోనో, స్వర్గపురి పాన్ డబ్బా దగ్గర మీరు దమ్ముకొడుతూనో నాకు దొరుకక పోతరా! అపుడు మీకూ నాకూ తక్‌రార్ జరగకపోతదా.. ఆ తక్‌రార్ తస్ఫియా జరగకపోతదా. నా సలాం హైద్రాబాద్ ఆంగ్లానువాదం జరిగేదాకా 'హమ్‌తో ఆప్ కో నహీం చోడేంగే. యాద్ రఖ్‌లేనా నోముల సాబ్ జర యాద్ రఖ్‌లేనా'.

నోముల సార్ ట్రేడ్‌మార్క్ మరెవరికీ లేదు. అవి ఆయనకు మాత్రమే సంబంధించిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్. ఒకటి 'జయహో' అనే పలకరింపు మరొకటి. ఆయన హమేషా ధరించే 'హ్యాట్' చంకలో ఎల్లపుడూ ఏదో ఒక గ్రంథరాజం, వేళ్ల మధ్య రగులుతున్న సిగరెట్టు. ఇవి లేకపోతే ఆయన్ని గుర్తుపట్టటం అసాధ్యం. కర్ణుడి కవచ కుండలాల లాగా ఆయన ఆహార్యంలో అవన్నీ విడదీయలేని భాగాలు. ఆ హ్యాటులో ఆయన హాలివుడ్ హీరో రాక్‌హడ్సన్‌కు కొంచెం తక్కువగా, చిత్రకారుడు పికాసో కన్నా కొంచెం ఎక్కువగా కనబడేవాడు. ఈ భూమ్మీద నడిచిన తన అడుగు జాడలకు గుర్తుగా ఆయన తన హ్యాటును మనకోసం వదిలి వెళ్లాడు.. గాంధీగారి కళ్లద్దాలు, చేతి కర్రలాగా!

నల్లగొండలో ఆయన పనిచేసిన నాగార్జున డిగ్రీ కళాశాల ముందున్న చౌరాస్తాలో ఒక ఆరడుగుల సన్నని పొడుగైన పాలరాతి స్తంభాన్ని స్థాపించి దాని మీద ఆయన వదిలిన హ్యాటును పెడితే చాలు నల్లగొండ ప్రజలందరికీ అది నోముల సత్యనారాయణ సార్ విగ్రహం అని గుర్తించి వచ్చిపోయే వారందరు భక్తితో నమస్కారాలు చేస్తూ వెళ్లిపోతారు.

**జానే వాలే కభీ వాపస్ నహీం ఆతే.. లేకిన్ జానే వాలోంకి యాద్ బార్ బార్ ఆతీ హై..**
**అల్విదా నోముల సాబ్ అల్విదా...**

**– పరవస్తు లోకేశ్వర్, 91606 80847**

## ప్రకటనలు

### ఆవిష్కరణ సభ

రచనల చెరువు సాహిత్యవేదిక ఆధ్వర్యంలో వడ్డె ముద్దంగుల ఎల్లన్న పాటల పుస్తకం 'నా పల్లెతీరు' (పర్యావరణ పాటలు) ఆవిష్కరణ సభ 2019 జనవరి 7న సాయంత్రం 6 గంటలకు, హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగుతుంది. డాక్టర్ ఆర్. సూర్యప్రకాశ్‌రావు అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా డాక్టర్ నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, వంగ శ్రీనివాస్‌గౌడ్, వర్ధుల శివకుమార్, నాళేశ్వరం శంకరం తదితరులు హాజరవుతారు. అందరికీ ఆహ్వానం.

**- వడ్డె ముద్దంగుల ఎల్లన్న, 9985356963**

### కావ్యపరిమళం

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'కావ్యపరిమళం' పరంపరలో భాగంగా 2019 జనవరి 11 సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య 'అగ్నిధార' కావ్యంపై దేశపతి శ్రీనివాస్ ప్రసంగం ఉంటుంది. సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. అందరికి ఆహ్వానం.

**- డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి**

### కవితల పోటీ -2019

కవిసంధ్య, జైని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవితల పోటీ-2019 నిర్వహించ బడుతున్నది. పోటీలో పాల్గొన దల్చిన వారు రూ.200లు ఎంట్రీ ఫీజుగా చెల్లించాలి. కవితలు పంపాల్సిన చిరునామా: దాట్ల దేవదానం రాజు, 8-1-048, జక్రియనగర్, యానాం-533464, తూర్పుగోదావరి జిల్లా, ఏపీ. వివరాలకు: 94401 05987, 9848202526.

**- దాట్ల దేవదానం రాజు, కవితల పోటీ కన్వీనర్**

### 'సాహితీ మాణిక్యం' అవార్డులు

రావులపాటి నారాయణ, మాణిక్యం పేరిట ఇచ్చే 'సాహితీ మాణిక్యం' అవార్డులను 2018కి గాను ప్రముఖ కవులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ప్రసాదమూర్తి గార్లకు ప్రకటించారు. ఈ అవార్డును జనవరి 12న ఖమ్మం చెరువ బజార్‌లో జరిగే కార్యక్రమంలో అందజేస్తారు.

**- సీతారాం, ఆర్.వెంకటేశ్వర్లు, ఆర్. శ్రీనివాసరావు**


### అలిశెట్టి యాదిలో కవి సమ్మేళనం

అలిశెట్టి ప్రభాకర్ యాదిలో 2019 జనవరి 12న సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనం ఉంటుంది. తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరుగు ఈ సభలో గౌరవ అతిథులుగా బి.నర్సన్, భూపతి వెంకటేశ్వర్లు, యలవర్తి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారు. అనంతోజు మోహన కృష్ణ కవి సమ్మేళన నిర్వాహకులుగా వ్యవహరిస్తారు. అందరూ ఆహ్వానితులే.

**- తెలంగాణ సాహితీ**

## కొత్త పుస్తకాలు

### శిఖరం




(నందిని సిధారెడ్డి కవిత్వ జీవన ప్రస్థానం)

నందిని సిధారెడ్డి భావుకుడు కావటం వల్లనే భూమిని స్వప్నించాడు. నాగేటి చాల్లల్ల బతుకు పాటలు అల్లాడు. వాటిని జనం నాలుకలపై నర్తింపజేశాడు. తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతుల చరిత్రను సామాజిక ఉద్యమ స్ఫూర్తిమంతమైన తన సృజనాత్మక వ్యక్తితంలో సంలీనం చేసుకున్నాడు. ఆ క్రమంలో 384 పుటల్లో విస్తరించిన సిధారెడ్డి బహుముఖ వ్యక్తిత్వాన్ని చూపేదే ఈ 'శిఖరం'.

**సంపాదకుడు: డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి, వెల: రూ.400**
**ప్రతులకు: గంటా జలంధర్‌రెడ్డి, 9848292715**

### రెండుతలల పాము



సమకాలీన సమస్యలను వస్తువుగా తీసుకుని చిన్న కథలకు ప్రాణం పోసిన రచయిత వైరాగ్యం ప్రభాకర్. పఠితకు ఉత్కంఠ కలిగిస్తూ అనేక మలుపులతో కథను నడిపించి కొసమెరుపులతో ముగిసే కథలు విశిష్టమైనవి.

**రచయిత: వైరాగ్యం ప్రభాకర్, వెల: రూ. 80,**
**ప్రతులకు: వైరాగ్యం ప్రభాకర్, 2-102, సీతారాంపూర్, మండలం కొత్తపల్లి, జిల్లా కరీంనగర్-505001. సెల్:9014559059**


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy.Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

## యాదాద్రిలో భక్తుల కోలాహలం



యాదాద్రి పంచనారసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి గంటలకొద్దీ బారులుతీరారు. మొక్కు పూజల నిర్వహణతో మండపాలు కిటకిటలాడాయి. శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రతపూజల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, వైటీడీఏ వైస్ చైర్మన్ జీ కిషన్‌రావు శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ

## వైభవంగా కొమురెల్లి మల్లన్న జాతర



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న జాతర వైభవంగా సాగుతున్నది. ఆదివారం ఆలయం భక్తులతో సందడిగా మారింది. స్వామివారి దర్శనం అనంతరం గంగరేగు చెట్టు వద్ద మొక్కుగా చెల్లించారు. మరికొందరు తాము బసచేసిన గదుల వద్ద, మహామండపంలో పట్నాలు వేయించి మొక్కులు తీర్చుకున్నారు. నిజామాబాద్ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.
- చేర్యాల, నమస్తే తెలంగాణ

## ఐనవోలు మల్లన్నకు దృష్టి కుంభం



ప్రముఖ శైవ క్షేత్రమైన వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలులోని మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం వేదపండితులు స్వామివారికి దృష్టికుంభం నిర్వహించారు. ఈనెల 13 నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం మల్లికార్జునస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. వేడుకలో ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు మధుమతి, ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు నందనం శివరాజయ్య తదితరులు పాల్గొన్నారు. - ఐనవోలు



# పల్లెల్లో వెల్లివిరిసిన చైతన్యం

### ఏకగ్రీవం వైపు కదులుతున్న గ్రామాలు

### పాలకవర్గాన్ని ఎంపిక చేస్తూ తీర్మానాలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** పల్లెల్లో చైతన్యం వెల్లివిరుస్తున్నది. అభివృద్ధి కోసం ఏకగ్రీవ బాట పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10లక్షల ప్రోత్సాహంతోపాటు ఎమ్మెల్యేలు సైతం రూ.5 లక్షల నుంచి రూ.15లక్షల వరకు అదనపు నజరానాలు ప్రకటించారు. కరీంనగర్ ఎంపీ వినోద్ సైతం రూ.5లక్షల చొప్పున ప్రోత్సాహకాన్ని ఇస్తున్నట్టు వెల్లడించారు. ఇలా పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందనుండటంతో పల్లెవాసులు సమావేశమై సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానాలు చేస్తున్నారు. ఆదివారం కూడా పెద్ద ఎత్తున ఏకగ్రీవ తీర్మానాలు చేశారు.

**ఆదిలాబాద్ జిల్లాలో..**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నక్కలవాడ పంచాయతీలోని కొత్తపల్లి, రేండ్లపల్లె, లక్ష్మీపూర్, నక్కలవాడ గ్రామాల ప్రజలు ఆదివారం సమావేశమై ఇదివరకు కరత్వాడ సర్పంచ్‌గా పని చేసిన విజయ్‌నే నూతనంగా ఏర్పాటైన నక్కలవాడ సర్పంచ్‌గా ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఉప సర్పంచ్‌గా మడావి జ్యోతితోపాటు మరో ఏడుగురు వార్డు సభ్యులను ఎన్నుకొన్నారు. భీంపూర్ మండలం అందర్‌బంద్ సర్పంచ్‌గా పెండెపు కృష్ణ, గుబ్‌డిపల్లి సర్పంచ్‌గా నక్క రాజమణి, ఉప సర్పంచ్‌గా కొట్నాక సూర్యభాన్, ఉట్నూర్ మండలం చింతకర్ర సర్పంచ్‌గా పెందూర్ సారుబాయి, సాకెర-జీ సర్పంచ్‌గా పెందూర్ లక్ష్మీబాయి, గంగాపూర్ సర్పంచ్‌గా దుర్వ రేణుక, సిరికొండ మండలం రాయిగూడ సర్పంచ్‌గా లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**జగిత్యాల జిల్లాలో నాలుగు పంచాయతీలు..**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పాటిమీది తండా సర్పంచ్‌గా జరుపుల బుజ్జి, ఉపసర్పంచ్‌గా బానావత్ మంగ్తుతోపాటు ఐదుగురు వార్డు సభ్యులను, కోరుట్ల మండలం తిమ్మాయపల్లెలో సర్పంచ్‌గా శివరాత్రి రాజరెడ్డి, ఉపసర్పంచ్‌గా హరికుప్పల పెద్దవెంకటి, మరో 8మంది వార్డు సభ్యులను, కథలాపూర్ మండలం రాజారాం తండా సర్పంచ్‌గా లావుడ్య సరిత, ఉప సర్పంచ్‌గా ఇస్లావత్ చంద్రునాయక్, వార్డు సభ్యులను, వెల్గటూర్ మండలం సంకెనపల్లి సర్పంచ్‌గా ముల్కల గంగారాం, ఉపసర్పంచ్ నర్సయ్య, మరో 8మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**ఉమ్మడి పాలమూరు జిల్లాలో..**

మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం భగవాన్‌పల్లి సర్పంచ్‌గా కావలి బాలమ్మ, ఉప సర్పంచ్‌గా వెంకటప్ప, నారాయణపేట మండలం పిల్లిగుండ్ల తండాసర్పంచ్‌గా సిద్దు చౌహాన్‌ను, వందర్‌గుట్ట తండా సర్పంచ్‌గా కృష్ణ నాయక్ , కోయిలకొండ మండలం పల్గుతండా సర్పంచ్‌గా హీరాలాల్, ఉప సర్పంచ్‌గా నాగేశంతోపాటు 8మంది వార్డు సభ్యులను, నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం చాకలిగుడిసెల (లక్ష్మీనగర్) సర్పంచ్‌గా పూజిత, ఉప సర్పంచ్‌గా మొగలి సత్యనారాయణ, వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం కర్నె తండా సర్పంచ్‌గా కోడావత్ శాంతి, ఈర్ల తండా సర్పంచ్‌గా గోపాల్, అల్లమాయపల్లి సర్పంచ్‌గా శేషయ్య, సూరాయపల్లి సర్పంచ్‌గా బాలస్వామి, పెద్దమందడి మండలం మంగంపల్లి సర్పంచ్‌గా పూడి శారద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**నిజామాబాద్ జిల్లాలో..**

నిజామాబాద్ జిల్లా వేల్పూరు మండలం హనుమాన్‌నగర్ సర్పంచ్‌గా అల్లెపు ముత్తెమ్మ, నవీపేట మండలం మిట్టాపూర్ సర్పంచ్‌గా కాడి అనిత, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం కొత్తపల్లె సర్పంచ్‌గా లక్ష్మణ్, ఉపసర్పంచ్‌గా లక్ష్మీమల్లారెడ్డిని, నిర్మల్ జిల్లా పెంబి మండలంలో వేణునగర్ సర్పంచ్‌గా ఆత్రం రాధ, ఉపసర్పంచ్‌గా జుగునక్ చంద్రభానుతోపాటు ఆరుగురు వార్డు సభ్యులను, తానూర్ మండలం బామ్ని సర్పంచ్‌గా బాశెట్టి లక్ష్మీబాయి, ఉప సర్పంచ్‌గా సాయినాథ్, వార్డు సభ్యులుగా నాందేవ్, మౌలమియ్యా, మోహన్, లక్ష్మీకాంత్, ముత్తన్న, హన్మండ్లు, గణేశ్‌ను ఆయా గ్రామాల వారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





మేడ్చల్ జిల్లా నాగిశెట్టిపల్లి పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేస్తూ విజయ చిహ్నం చూపుతున్న గ్రామస్థులు.. మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలం కొత్తపల్లిలో ఎన్నికైన సర్పంచ్ సంధ్యారాణి, వార్డు సభ్యులు

### రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ఊరుతండా సర్పంచ్‌గా ఇస్లావత్ రాముల్ నాయక్, ఉపసర్పంచ్‌గా అజ్మీర జవహర్‌లాల్, వార్డు సభ్యులుగా ఇస్లావత్ కౌసల్య, ఇస్లావత్ కవిత, ఇస్లావత్ అమృత, ఇస్లావత్ జమున, ఇస్లావత్ రాజును ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వర తండా సర్పంచ్‌గా అజ్మీరా రజిత, ఉపసర్పంచ్‌గా అజ్మీరా పద్మ, వార్డు సభ్యులుగా బానోత్‌రెడ్డి, దరావత్ తిరుపతి, రంబాలి, నూనావత్ పద్మ, బాదావత్ మోతీలాల్‌ను ఎన్నుకున్నారు. వీర్నపల్లి మండలం భూక్యతండా సర్పంచ్‌గా గుగులోతు భారతి, ఉపసర్పంచ్‌గా బాడవత్ గంగారం, వార్డు సభ్యులుగా భూక్య శీల, రామవత్ తిరుపతి, గుగులోతు శారద, లాకవత్ శ్రీనివాస్, భూక్య పీర్యా, భూక్య రఘుపతి, మాలోతు రంభను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ గ్రామస్థులు తీర్మానం చేశారు.

## గ్రామ స్వరాజ్యం

### ప్రగతి కోసం ఏకగ్రీవం వైపు..

ప్రగతి కోసం పల్లె ప్రజలు ఏకగ్రీవం వైపు అడుగులు వేస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ సర్పంచ్‌గా బాసాని వేళాంగిణి మేరి, ఉప సర్పంచ్‌గా గోపు జోజిరెడ్డి, వార్డు సభ్యులుగా కొమ్మారెడ్డి ఆనంద్‌రెడ్డి, సింగారెడ్డి జ్యోతి, గోపు జోజిరెడ్డి, బాసాని మేరిలమ్మను స్థానికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చెన్నాపురం సర్పంచ్‌గా దేవునూరి ప్రణీత, దుంపిల్లపల్లె సర్పంచ్‌గా మేరుగు విజయ్‌కుమార్, కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్ సర్పంచ్‌గా మల్లెల రాజేశ్వరీ, ఉప సర్పంచ్‌గా కుర్సం వినోద్, వార్డు సభ్యులుగా బొచ్చు సారయ్య, కోడే ఈశ్వరి, యాలం పార్వతీ, కుర్సం ఆదెక్క, మందపల్లి లక్ష్మయ్య, అజ్మీర కవిత, చౌలం వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం ఏబీ తండా (శంకర్‌తండా) సర్పంచ్‌గా బానోత్ తులసి, ఉప సర్పంచ్‌గా లకావత్ రంగమ్మ, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం కొడిశాలమిట్ట సర్పంగా పూల్సం లక్ష్మి, ఉపసర్పంచ్‌గా బచ్చల లక్ష్మణరావును, బయ్యారం మండలం మొట్లతిమ్మాపురం సర్పంచ్‌గా బిజ్యా స్వరూప, ఉపసర్పంచ్‌గా పాయం వీరస్వామి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మామిడిగూడెం సర్పంచ్‌గా తాటి మౌనిక, సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం రామోజీతండా సర్పంచ్‌గా గుగులోతు రజినీ, ఉపసర్పంచ్‌గా బాణోతు సోమన్నను ఆయా గ్రామాల వారు ఏకగ్రీవం చేస్తూ తీర్మానం చేశారు. మేడ్చల్ జిల్లా నాగిశెట్టిపల్లి సర్పంచ్‌గా మొగుళ్ల కృపాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్‌గా శంకర్, వార్డు సభ్యులుగా కే లక్ష్మి, ఆర్ సుధాకర్‌రెడ్డి, జీ కృష్ణ, ఎం కృష్ణవేణి, ఏ కమలమ్మ, ఆర్ భాగ్యలక్ష్మి, డీ దేవి, శంకర్ (ఉపసర్పంచ్)లను, వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం గుర్రంగట్టు తండా సర్పంచ్‌గా సోనిబాయి, ఉప సర్పంచ్‌గా పాండునాయక్, మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలం కొత్తపల్లి సర్పంచ్‌గా సంధ్యారాణితోపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులను, ఇదే జిల్లా నర్సాపూర్ మండలం రంజ్యాతాండా సర్పంచ్‌గా హలావత్ నర్సింగ్, ఉపసర్పంచ్‌గా గుగ్‌లోత్ ధన్‌సింగ్, సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం ఎడ్లరేగడితండా సర్పంచ్‌గా నేనావత్ బలిరాం, ఉప సర్పంచ్‌గా భీంసింగ్‌తోపాటు మిగితా వార్డుమెంబర్లను కూడా ఎన్నుకున్నారు. ఇదే జిల్లా పుల్కల్ మండలం గొంగ్లూర్‌తండా సర్పంచ్‌గా రామావత్ లలితాబాయి, 8 మంది వార్డు సభ్యులను, బద్రిగూడెం సర్పంచ్‌గా బైరు రామయ్య, ఉప సర్పంచ్‌గా బీ కిష్టయ్యను ఏకగ్రీవం చేస్తూ తీర్మానించారు.

## కేసీఆర్ నల్లగొండ లోక్‌సభ నుంచి పోటీచేయాలి

### ఎంపీ గుత్తాసుఖేందర్‌రెడ్డి ఆహ్వానం



గుత్తాసుఖేందర్‌రెడ్డి

**మిర్యాలగూడ, నమస్తే తెలంగాణ:** నల్లగొండ ఎంపీగా సీఎం కేసీఆర్‌ను పోటీ చేయాలని, అందుకు తాము ఆహ్వానిస్తున్నామని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ, ఇక్కడి నుంచి కేసీఆర్ నిలబడితే భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని చెప్పారు. దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ కీలకపాత్ర పోషించడం ఖాయమని కేసీఆర్ నేతృత్వంలో ఏర్పాటవుతున్న ఫెడరల్‌ఫ్రంట్ దేశరాజకీయాలను ప్రభావితం చేస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణాలోని 16 స్థానాల్లో టీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని చెప్పారు.

## స్థానిక పోరుకు సిద్ధంకండి

### కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి జూపల్లి



జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల:** టీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు స్థానికపోరుకు సిద్ధపడాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషిచేయాలని కోరారు. ఆదివారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రం, తూంకుంట, సంగినేనిపల్లి, గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, కల్వరాల గ్రామాల్లో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.



నిర్మల్‌లో మాట్లాడుతున్న గ్రూప్1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్

## అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి

### గ్రూప్-1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్

**నిర్మల్ టౌన్ :** మార్చి నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఓటు హక్కు పొందేందుకు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గ్రూప్-1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ సూచించారు. ఆదివారం నిర్మల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రులు ఓటు హక్కును పొందాలన్నారు.

## భార్య మరణం తట్టుకోలేక భర్త ఆత్మహత్య

### నిర్మల్ జిల్లా సాయినగర్ తండాలో ఘటన

**నర్సాపూర్ (జీ):** భార్య చనిపోవడంతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలం సాయినగర్ తండాలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రాథోడ్ పీరాజీ (23) కూలీగా పనిచేస్తున్నాడు. అతడికి రెండేండ్ల క్రితం సారంగాపూర్ మండలానికి చెందిన రేణుకతో వివాహమైంది. వీరికి మూడు నెలల క్రితం బాబు జన్మించాడు. రేణుక అనారోగ్యంతో నెలరోజుల క్రితం మృతి చెందింది. మనస్తాపం చెందిన పీరాజీ శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు మృతితో మూడు నెలల బాలుడు అనాథగా మారాడు.



సూర్యాపేటలో జిల్లాకేంద్రంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కరంచిలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

## టీఆర్‌ఎస్‌లోకి భారీగా వలసలు

**నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్‌లోకి చేరికల పర్వం కొనసాగుతున్నది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా పార్టీలో చేరుతున్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పలుమండలాల నుంచి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 700 మంది మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సమక్షంలో, హుజూర్‌నగర్‌లోని టీఆర్‌ఎస్‌పార్టీ కార్యాలయంలో మఠంపల్లి మండలం రఘునాథపాలెం, గరిడేపల్లి మండలం సర్వారం గ్రామాలకు చెందిన 100 కుటుంబాల వారు టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో, కోదాడ నియోజకవర్గ రెడ్డి సంక్షేమసంఘం అధ్యక్షుడు రామిరెడ్డి నేతృత్వంలోని 100 మంది ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వరంగల్‌రూరల్ జిల్లా నర్సంపేట మండలం దాసరిపల్లికి చెందిన 30 కుటుంబాల వారు, చెన్నారావుపేట మండలానికి చెందిన 80 మంది, దుగ్గొండి మండలం చలపర్తి, పీజీ తండాలకు చెందిన 30 మంది నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల టీడీపీ నాయకుడు బాల్‌రెడ్డి, జిల్లా నాయకుడు పద్మనాభం నాయకత్వంలో 100 మంది ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సమక్షంలో, ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కరంజి గ్రామంలో పలువురు ఎమ్మెల్యే జోగురామన్న సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి



టీఆర్‌ఎస్‌లో చేరిన వరంగల్ రూరల్ జిల్లా చెన్నారావుపేట మండలం తోపనగడ్డ తండా వాసులతో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఆదివారం సిద్దిపేటలోని దీకొండ మైసమ్మ దేవాలయంలో సుదర్శన నరసింహ యాగం పూర్ణాహుతిలో పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు

## సుదర్శన యాగంతో సుభిక్షం

### మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్ష

**కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట ఆధ్యాత్మికతకు నెలవు అని, సుదర్శన యాగంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. బంగారు తెలంగాణ సాధనదిశగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతున్నదన్నారు. సిద్దిపేటలోని దీకొండ మైసమ్మ దేవాలయంలో మూడ్రోజులుగా జరుగుతున్న శ్రీసుదర్శన నరసింహ యాగ మహాపూర్ణాహుతి కార్యక్రమంలో ఆదివారం ఆయన అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మున్సిపల్ చైర్మన్ రాజనర్సుతోకలిసి పాల్గొన్నారు. పొన్నాలలో వికాస తరంగిణి గోదాగోష్ఠి ఆధ్వర్యంలో జరిగిన గోదాపూజ, సుదర్శనహవనం కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. పట్టణంలోని ముర్షద్‌గడ్డ దర్గాలో జరుగుతున్న ఉర్సులో పాల్గొని చాదర్ సమర్పించి, ప్రార్థనలు నిర్వహించారు.



వినాయకపురంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

## పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటండి

### అశ్వారావుపేట నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి తుమ్మల

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ విజయానికి కృషిచేయాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యకర్తలకు సూచించారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి తాను బాధ్యత తీసుకుంటానన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఆదివారం నిర్వహించిన టీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గోదావరి జలాలను ప్రజలకు అందించే ఉద్దేశంతో సీతారామ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. టీఆర్‌ఎస్ శ్రేణులు కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ ఇంచార్జి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సూచించారు. 25 వరకు కొత్త ఓట్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు.



హైదరాబాద్ శివారులోని శంషాబాద్ మండలం మదనపల్లి సర్పంచ్ అభ్యర్థి నర్సింహ నాయక్‌ను ఆశీర్వదిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## సర్పంచ్ బరిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

**శంషాబాద్:** ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సర్పంచ్ బరిలో నిలుస్తున్నాడు. శంషాబాద్ మండలం మదనపల్లి అనుబంధ గ్రామమైన సున్నం బట్టి తండాకు చెందిన ఆర్ బీమ్లీ, దాస్య దంపతుల కుమారుడు రాప్లావత్ నర్సింహ నాయక్ 2009లో లండన్ వెళ్లి ఎంసీఏ చేశారు. 2014లో తిరిగి వచ్చి ఐటీ సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. కాగా పంచాయతీ ఎన్నికల్లో మదనపల్లి పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు కావడంతో ఆయన సర్పంచ్ బరిలో దిగుతున్నారు. ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ఆశీస్సులు పొందారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రారెడ్డి, పోలీసు అధికారులు

## జూరాల నీటి విడుదలను అడ్డుకున్న రైతులు

### హెడ్‌రెగ్యులేటర్ మూసి అక్కడే బైఠాయింపు

### సాయంత్రం భారీ బందోబస్తు నడుమ నీటి విడుదల

**అమరచింత:** జూరాల ఎడమకాల్వ నీటి విడుదలను కొందరు రైతులు అడ్డుకున్నారు. ఎడమ కాల్వ నుంచి నీటిని విడుదల చేయాలని ఇటీవల ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉన్నతాధికారులకు లేఖరాసిన విషయం తెలిసిందే. ఈఈ శ్రీధర్, ఆర్డీవో చంద్రారెడ్డి ఆదివారం తెల్లవారుజామున నీటిని విడుదల చేసేందుకు నందిమల్ల డ్యాం హెడ్‌రెగ్యులేటర్‌ను తెరువగా.. విషయం తెలుసుకున్న వనపర్తి జిల్లా అమరచింత, ఆత్మకూరు మండలాలకు చెందిన 100 మంది రైతులు తెరిచిన హెడ్‌రెగ్యులేటర్‌ను మూసివేసి అక్కడే బైఠాయించారు. ప్రాజెక్టు మొదటి ఆయకట్టు కింద రెండో పంటకు సాగునీరు అందని పరిస్థితుల్లో చివరి ఆయకట్టుకు నీటిని ఎలా విడుదల చేస్తారంటూ నిలదీశారు. రైతులు వెళ్లిపోయాక సాయంత్రం 4గంటలకు అధికారులు నీటిని విడుదల చేశారు. విషయం తెలుసుకున్న రైతులు మరోసారి కాల్వ వద్దకు చేరుకోగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

## ఫిబ్రవరి ఒకటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల

### ఎస్సారెస్పీ సీఈ శంకర్ వెల్లడి

**తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ:** ఎల్ఎండీ ఎగువ ఆయకట్టుకు నీటి విడుదల వాయిదా పడినట్టు ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ శంకర్ తెలిపారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీకాలనీలో మీడియాతో మాట్లాడారు. ముందుగా జనవరి 15 నుంచి ఎల్ఎండీ ఎగువ ఆయకట్టుకు విడుదల చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్‌లో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ఎమ్మెల్యేలు, నీటి పారుదలశాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మెజార్టీ ఎమ్మెల్యేల సూచనల మేరకు ఫిబ్రవరి ఒకటి నుంచి నీటి విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

# పువ్వుల ప్రాధాన్యం చెప్పేదే బతుకమ్మ పండుగ



ఐటీసీ కాకతీయ హోటల్‌లో పూల ప్రదర్శనను తిలకిస్తున్న పర్యాటకశాఖ కార్యదర్శి వెంకటేశం, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ జనరల్ శ్రీనివాసరావు

- ఇకెబాన సంస్థ ప్రయత్నం అభినందనీయం
- రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పువ్వుల గొప్పతనాన్ని, ప్రాధాన్యాన్ని చెప్పేదే బతుకమ్మ పండుగ అని, అదే పద్ధతిలో ఇకెబాన సంస్థ చేపట్టిన ప్రయత్నం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. రూట్స్ అండ్ మాట్స్ పేరిట అరుదైన మొక్కల కళాకృతులతో ఇకెబాన అంతర్జాతీయ సంస్థ హైదరాబాద్ చాప్టర్ సభ్యులు బేగంపేట్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఏర్పాటుచేసిన ప్రదర్శనను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ జనరల్ శ్రీనివాసరావు, తెలంగాణ సాంస్కృతిక, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ ఆకర్షణీయంగా అలంకరించే ఇకెబాన పూలకు, బతుకమ్మకు దగ్గరి సంబంధం ఉందని తెలిపారు. బతుకమ్మ పండుగను అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లడంలో ఇకెబాన ఇంటర్నేషనల్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఇకెబాన సంస్థకు చాప్టర్‌లు ఉన్నాయని, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబురాలలో ఇకెబాన సంస్థ సభ్యులు పాల్గొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ సంబురాల మాదిరిగానే అంతర్జాతీయ స్థాయిలో మొక్కలు, పువ్వులను అలంకరించి ప్రదర్శనను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.

# యాదాద్రి పనుల్లో వేగం పెంచాలి

- సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి
- పనుల జాప్యంపై కాంట్రాక్టర్ల మీద ఆగ్రహం



ఆదివారం యాదాద్రి కొండపై పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకుంటున్న సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** షెడ్యూల్ ప్రకారం శ్రీవారి నిజదర్శనాలు ప్రారంభించేందుకు యాదాద్రి పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ యాదాద్రిలో పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం ఆయన కొండపై పనులను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం పనులు ఎందుకు జరుగడంలేదని కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. డిసెంబర్‌లో పూర్తిచేస్తామన్న పనులు ఎందుకు చేయలేదని మండిపడ్డారు. కొండపైన ఆలయ ప్రాకారాలు, రాజగోపురాలను పరిశీలించి, ముఖమండపంలో మూడుగంటలపాటు అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్‌తో సమావేశమై భూసేకరణకు అడ్డంకులపై చర్చించారు. ఆయన వెంట ఈఎన్సీ రవీందర్‌రావు, ఆర్కిటెక్టు ఆనందసాయి, సాయిపావని, సీఈవో సునీల్‌రెడ్డి, ఈఈ వసంతనాయక్, ఇంజినీర్ మధుసూదన్, ఉపస్థపతులు సంజయ్, మోతీలాల్, గణేశ్ ఉన్నారు.



# ఇటు ఉపాధి.. అటు కానుక

## మరమగ్గ కార్మికులకు భరోసా

- సంక్రాంతి తరువాత బతుకమ్మ చీరెల తయారీ
- డిజైన్ల రూపకల్పనలో చేనేత జౌళిశాఖ
- దాదాపు కోటి చీరెల తయారీ.. చేతినిండా పని



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరుసగా మూడో సంవత్సరం బతుకమ్మ చీరెలను అందించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ సంవత్సరం సెప్టెంబర్ 28 నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభంకానుంది. దాదాపు కోటిమంది మహిళలకు చీరెలను అందించనున్నారు. పండుగ ప్రారంభానికి వారంపది రోజులముందే జిల్లాలకు చీరెలు చేరే విధంగా చూడాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. దాంతో సంక్రాంతి తరువాత చీరెల తయారీని ప్రారంభించనున్నారు. దీనికి అనుగుణంగా చీరెల డిజైన్లపై చేనేత, జౌళిశాఖ కసరత్తు చేస్తున్నది. చీరెలను సిరిసిల్ల మరమగ్గాలపై తయారుచేయించనున్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ సందర్భంగా చిరుకానుక ఇవ్వాలన్న లక్ష్యంతోపాటు సిరిసిల్లలోని నేతన్నలకు ముఖ్యంగా పవర్‌లూం కార్మికులకు ఆదాయం పెంచి, వారి జీవన ప్రమాణాలను పెంచాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ పథకాన్ని చేపట్టారు. తెల్ల రేషన్ కార్డు ఉండి 18 సంవత్సరాల పైబడిన మహిళలందరికి చీరెలను ఇవ్వాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ప్రైవేటు కంపెనీలకు కాంట్రాక్టు ఇవ్వకుండా సిరిసిల్లలోని మరమగ్గ కార్మికులతోనే చీరెలను తయారుచేయించాలని నిర్ణయించారు. దాదాపు కోటి చీరెల వరకు తయారుచేయాల్సి ఉన్నందున అధికారయంత్రాంగం అప్రమత్తమయింది. బతుకమ్మ చీరె 5.50 మీటర్లు, జాకెట్ 80 సెంటిమీటర్లు ఉంటుంది. ఇలా మొత్తం ఒక్కో చీరె, జాకెట్ 6.30 మీటర్లు ఉంటుంది. సిరిసిల్లలో 20వేల లూమ్‌లపైన చీరెల నేత కార్యక్రమం కొనసాగనుంది. ముందుగానే నూలు తెచ్చుకుని మరమగ్గ కళాకారులను సిద్ధం చేసుకోవాలని, వేగంగా తయారుచేసేందుకు ప్రణాళిక రూపొందించాలని సిరిసిల్ల మరమగ్గ ఆసాములకు సూచించారు.

**నేతన్నలకు చేతినిండా పని**

తీరొక్క పూల పండుగ బతుకమ్మకు రంగురంగుల చీరెలను ప్రభుత్వం ఆడపడుచులకు అందించనుండటంతో సిరిసిల్ల మరోసారి సాంచాల చప్పుళ్లతో సందడిగా మారనుంది. దాదాపు కోటి బతుకమ్మ చీరెలు సిరిసిల్ల మరమగ్గాలపై నుంచే తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలందరికి అందనున్నాయి. ఈ పథకం ద్వారా చీరెలతో మహిళలు సంబరపడటం ఒక కోణం కాగా.. అదే సమయంలో సిరిసిల్ల మరమగ్గ కార్మికులకు చేతినిండా పనితో వారికి జీవన భరోసా కల్పించడం ప్రభుత్వ మరో లక్ష్యం. ప్రభుత్వం సిరిసిల్లలో గౌరవప్రదమైన కూలీ రేట్లతో దర్జాగా బతికేందుకు వేతనాలు ఇస్తున్నది. గతంలో చాలీచాలని వేతనాలతో ఏడాదికి ఐదారునెలలు పని దొరికితే మహా ఎక్కువ. కానీ నేడు సంవత్సరం పొడవునా చేతినిండా పని దొరికే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో పనిదొరుకక.. ఆర్థిక సమస్యలతో కుటుంబం గడవక ఆకలి చావులు, ఆత్మహత్యలతో వార్తల్లో ఉండే సిరిసిల్ల పరిస్థితి నేడు మారిపోయింది. ప్రతి మరమగ్గ కార్మికుడికి చేతినిండా పనిదొరుకుతుంది. పెరిగిన ధరలకు గిట్టుబాటు అయ్యే విధంగా కూలీ లభిస్తుంది. ప్రభుత్వం గౌరవంగా బతికేవిధంగా కూలీరేట్లను నిర్ణయించింది. ఆత్మహత్యలు.. ఆకలిచావులు ఉండొద్దనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం మరమగ్గ కూలీరేట్లను పెంచింది. బతుకమ్మ చీరెల తయారీకి ఆ రేట్లనే చెల్లిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో పంపిణీ చేయాల్సి ఉన్న బతుకమ్మ చీరెలను ఎన్నికలకు కోడ్ ఫలితంగా ఇటీవలే పంపిణీచేశారు. 80కి పైగా రంగుల్లో, ప్లెయిన్ జరీ బార్డర్ చీరలను అందించారు. వీటిపై రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి మంచి ప్రశంసలు లభించాయి. నాణ్యత, డిజైన్లు, కలర్ల విషయంలో ఈసారి కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



ఆదివారం దారుసలాంలోని ఏఐఎంఐఎం కార్యాలయంలో ప్రొటెం స్పీకర్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను అభినందిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

## ఎయిర్‌పోర్ట్‌లో బంగారం పట్టివేత

**శంషాబాద్:** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి వద్ద అక్రమంగా తీసుకొస్తున్న 830 గ్రాముల బంగారం బిస్కెట్లను సీఐఎస్‌ఎఫ్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఉదయం దుబాయ్ నుంచి ఓ వ్యక్తి శంషాబాద్ విమానాశ్రయంలో దిగాడు. అనుమానించిన సీఐఎస్‌ఎఫ్ అధికారులు అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా 830 గ్రాముల బంగారం బిస్కెట్లు లభించాయి. సదరు బంగారానికి సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సీఐఎస్‌ఎఫ్ అధికారులు తెలిపారు.



వనస్థలిపురం పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

## క్యాటరింగ్ కాంట్రాక్ట్ పేరుతో కుచ్చుటోపీ!

- అధిక వడ్డీ ఆశచూపి రూ.4 కోట్లు వసూలు


**వనస్థలిపురం, నమస్తే తెలంగాణ:** ఐటీ కంపెనీల్లో క్యాటరింగ్ కాంట్రాక్ట్ పేరుతో దంపతులు ఘరానా మోసానికి తెరతీశారు. అధిక వడ్డీ ఆశచూపి అసలుకే ఎసరుపెట్టారు. సుమారు రూ.4 కోట్లు వసూలు చేసి చేతులెత్తేశారు. బాధితులు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. వనస్థలిపురం ఎఫ్‌సీఐకాలనీలో కొమ్ము సురేశ్(48), అన్నపూర్ణ దంపతులు నివాసం ఉంటున్నారు. సురేశ్ బియ్యం వ్యాపారం చేస్తుండగా, అన్నపూర్ణ బీడీఎల్ సంస్థలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ప్రముఖ ఐటీ కంపెనీల్లో ఈవెంట్స్‌కు క్యాటరింగ్ చేసేందుకు పెట్టుబడి పేరుతో చాలామంది నుంచి డబ్బు వసూలుచేశారు. ఒక్కొక్కరు రూ.4 లక్షల నుంచి 40 లక్షల వరకు ఇచ్చారు. లక్షకు రూ.9 వేల నెల వడ్డీ ఇచ్చేలా దంపతులు ఒప్పందంచేసుకున్నారు. 40 మంది నుంచి 4 కోట్ల వరకు వసూలుచేశారు. శారదానగర్‌కు చెందిన గుడిసేవ శ్రీనివాసరావు వద్ద 40 లక్షలు తీసుకున్నారు. మొదట్లో వడ్డీ సరిగానే ఇచ్చిన దంపతులు రానురాను ఇవ్వడం మానేశారు. దీంతో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలియడంతో బాధితులంతా వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తంచేశారు. దంపతులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

## కత్తెరతో పొడిచి భార్యను చంపిన భర్త



**చార్మినార్, నమస్తే తెలంగాణ:** భార్యాభర్తల మధ్య జరిగిన స్వల్పఘర్షణతో కోపొద్రిక్తుడైన భర్త.. భార్యను కత్తెరతో పొడిచి హత్యచేశాడు. ఈ ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సంతోష్‌నగర్ ఏసీపీ శివరామశర్మ, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన నసీమఅక్తర్(33), ఇమ్రానుల్లాకు 2004లో వివాహం జరిగింది. భార్యాభర్తలకు నలుగురు సంతానం. ఇమ్రానుల్లా ఇంటివద్ద దుస్తులు కుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఇంట్లో భార్యాభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకరిని ఒకరు నిందించుకుంటూ ఘర్షణపడ్డారు. కోపొద్రిక్తుడైన ఇమ్రానుల్లా టైలరింగ్ బట్టలు కటింగ్ చేయడానికి ఉపయోగించే కత్తెరతో నసీమఅక్తర్ కడుపులో పలుమార్లు పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన నసీమఅక్తర్ అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. నసీమఅక్తర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి దర్యాప్తును చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

## జీవితంపై విరక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



మౌనిక మృతదేహం

**మలక్‌పేట, నమస్తే తెలంగాణ:** కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తిచెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అఫ్జల్‌నగర్ కాలనీలో జరిగింది. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కేవీ సుబ్బారావు కథనం ప్రకారం అఫ్జల్‌నగర్‌కాలనీ ఫ్లాట్ నంబర్ 405కు చెందిన ఆంటోని దాస్, ఎన్ సిల్వర్‌మణి దంపతుల కూతురు మౌనిక(33) నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. 2007లో అభిషేక్‌తో వివాహం జరుగగా, ప్రస్తుతం వీరికి పదేండ్ల కుమారుడు ఆర్యన్ ఉన్నాడు. కుటుంబ కలహాల కారణంగా ఏడాదిన్నరగా ఇద్దరు విడిగా ఉంటున్నారు. మనోవేదనకు గురవుతున్న మౌనిక జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకోగా, గమనించిన తల్లిదండ్రులు దవాఖానకు తరలించారు. అప్పటికే మౌనిక మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కూతురు మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని మృతురాలి తల్లి సిల్వర్‌మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడి కన్నుమూత

**నల్లబెల్లి:** వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని మూడు చెక్కలపల్లి గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు బొమ్మిడి మల్లారెడ్డి (95) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లారెడ్డి చురుకుగా పాల్గొన్నారని కుటుంబసభ్యులు తెలిపారు. మల్లారెడ్డికి భార్య తులసమ్మ, కుమారుడు సత్తిరెడ్డి, కుమార్తెలు యాదమ్మ, చంద్రకళ ఉన్నారు.

## డీసీసీ అధ్యక్ష పదవికి ఏలేటి రాజీనామా

**నిర్మల్ టౌన్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవలి ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10 ఎమ్మెల్యే స్థానాలకు గాను ఒకే ఒక ఎమ్మెల్యేను గెలుపించుకోగా మిగితా 9 చోట్ల టీఆర్ఎస్ చేతిలో ఘోర పరాభావం చవిచూడటంతో నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా పంపుతున్నట్టు తెలిపారు. ఇటీవల ఈయన నిర్మల్ అసెంబ్లీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.

# కృష్ణా జలాలపై ఏపీ కొత్త నాటకం

- ఎండీడీఎల్ దిగువకు వెళ్లేందుకు ప్రయత్నం
- బోర్డు ఉత్తర్వుల పేరుతో మరో రెండు టీఎంసీలు తరలించేందుకు వ్యూహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణాజలాల పంపిణీలో ఏపీ కొత్తనాటకాన్ని తెరమీదికి తీసుకొస్తున్నది. కృష్ణాబోర్డు ఉత్తర్వులను అడ్డం పెట్టుకొని కనీస నీటి సేకరణ స్థాయి(ఎండీడీఎల్) దిగువకు వెళ్లేందుకు, ఆ రాష్ట్ర వాటా కన్నా అదనంగా రెండు టీఎంసీల నీటిని తరలించేందుకు వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి ఏపీ ఇప్పటివరకు 320 టీఎంసీలు, తెలంగాణ 97 టీఎంసీల నీరు వాడుకున్నాయి. ఎండీడీఎల్ ఎగువన ఉన్న నీటి నిల్వల ఆధారంగాచేసిన కేటాయింపుల ప్రకారం తెలంగాణకు మరో 52 టీఎంసీలు, ఏపీకి కేవలం 18 టీఎంసీల వాటా మిగిలి ఉన్నది. అయితే ఇటీవలే కృష్ణాబోర్డు ఎండీడీఎల్ ఎగువన ఉన్న నీటి నిల్వల ఆధారంగా రెండు రాష్ట్రాలకు నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసింది. దీని ప్రకారం ఈ రెండు రిజర్వాయర్ల నుంచి తెలంగాణ మరో 40 టీఎంసీలు, ఏపీ ఇంకా 20 టీఎంసీలు వాడుకోవచ్చు. అయితే అధికారిక కేటాయింపుల నుంచి ఏపీకి ఇంకా మిగిలి ఉన్న వాటా 18 టీఎంసీలు మాత్రమే. అయినా బోర్డు ఇవేమీ పట్టించుకోకుండా ఎడాపెడా ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ ఉత్తర్వుల్లోని రెండు టీఎంసీలను సాకుగా చూపి జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన నీటిని సేకరించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. గత అనుభవాల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన నీటి వాడకానికి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. దీంతో ఏపీ అదనంగా మరో రెండు టీఎంసీల నీటిని తరలిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బోర్డు తెలంగాణ వాటా నుంచి 13 టీఎంసీలను రిజర్వులో ఉంచింది. ఏపీ చర్యలతో ఆ నీటికి గండిపడే ప్రమాదం పొంచి ఉన్నదని చెప్తున్నారు. మరోవైపు బోర్డు సైతం ఏపీకే వత్తాసు పలుకుతున్నది. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ద్వారా ఏపీ 2018-19 నీటి సంవత్సరంలో 150 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించింది. అప్పుడు బోర్డు కనీసం స్పందించలేదు. తెలంగాణ కొన్నిరోజులుగా శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి నీటిని విడుదల చేస్తుంటే ఏపీ ప్రభుత్వం కృష్ణా బోర్డుకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తున్నది. ఏపీ 150 టీఎంసీలు తరలించినా ప్రేక్షకపాత్ర పోషించిన బోర్డు.. విద్యుత్ ఉత్పత్తితో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్నదంటూ నీటి విడుదల నిలిపివేయాలని తెలంగాణకు సూచనలు చేసింది. పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ద్వారా తరలించిన నీళ్లు కేవలం ఏపీనే వినియోగిస్తుంది. కానీ తెలంగాణ శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు విడుదల చేసిన నీరు నాగార్జునసాగర్‌కు చేరితే.. రెండు రాష్ట్రాలూ వినియోగించుకోవచ్చు. అయినా ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి విడుదలపై ఫిర్యాదులు చేస్తుండటం వెనుక రెండు టీఎంసీలను అక్రమంగా తరలించే ప్రయత్నం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# దర్యాప్తు ప్రారంభమైనా ఆగని డిపాజిట్ల సేకరణ!

- దర్యాప్తు సంస్థలకు వివరాలు ఇవ్వని నౌహీరా షేక్
- హీరా గ్రూప్ కేసులో 214 బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్



నౌహీరా షేక్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హీరా గ్రూప్‌లో అవకతవకలపై దర్యాప్తు ప్రారంభమయిన తరువాత కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు డిపాజిట్లు సేకరించారు. ఒక సంస్థలో లోపాలున్నాయని, విచారణ చేస్తుంటే.. అప్పటివరకు ఆయా సంస్థలుచేసే వ్యాపారలావాదేవీలను నిలిపివేయాల్సి ఉంటుంది. హీరా గ్రూప్ నిర్వాహకురాలు నౌహీరా షేక్ మాత్రం అలాకాకుండా, గత ఏడాది జులై వరకు డిపాజిట్లు సేకరించారు. హీరా గ్రూప్‌లో నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ జరుగుతున్నదని, అవకతవకలు జరుగుతున్నాయనే అంశంపై 2016లో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్‌ఎఫ్‌ఐవో) విభాగం, హీరా గ్రూప్‌లోని వివిధ కంపెనీల వ్యాపారలావాదేవీలపై దర్యాప్తు ప్రారంభించింది. అయినప్పటికీ హీరా గ్రూప్‌లోని 15 సంస్థలు తమ వ్యాపారాలను కొనసాగించాయి. డిపాజిట్ల సేకరించే ప్రక్రియను ఆపాల్సి ఉన్నా, సంస్థ నిర్వాహకులు ఆ పనిచేయలేదు. అధికార యంత్రాంగానికి రికార్డులు కూడా ఇవ్వలేదు. 2018 జులై వరకు డిపాజిట్లను సేకరించారు. మే నెల నుంచే బాధితులు హీరా గ్రూప్‌లోని డిపాజిట్లపై పోలీసులకు ఫిర్యాదు చేయడం ప్రారంభించారు. గత ఏడాది అక్టోబర్‌లో సీసీఎస్ పోలీసులు నౌహీరా షేక్‌ను అరెస్ట్ చేయడంతో స్కామ్ వెలుగులోకి వచ్చింది. హీరా గ్రూప్‌కు సంబంధించిన 214 బ్యాంకు ఖాతాలను సీసీఎస్ పోలీసులు ఫ్రీజ్‌చేశారు. బాధితులకు న్యాయంచేసేందుకు సంస్థలకు చెందిన ఆస్తులను అటాచ్ చేసేందుకు చర్యలు మొదలుపెట్టారు. సంస్థలో విదేశీ నిధులు, అజ్ఞాత వ్యక్తులకు సంబంధించిన పెట్టుబడులున్నట్టు గుర్తించి కేసును ఉగ్రకోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ పోలీసులు మొదటిసారిగా నౌహీరా షేక్‌ను అరెస్ట్ చేయడంతోపాటు కీలకమైన ఆధారాలు సేకరించారు.

## చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| నాగర్‌కర్నూల్ | 9.1 | 34.6 |
| సంగారెడ్డి | 9.7 | 34.6 |
| మహబూబ్‌నగర్ | 10.0 | 34.6 |
| సిద్దిపేట | 10.6 | 32.9 |
| మెదక్ | 11.3 | 35.3 |
| యాదాద్రి | 11.7 | 32.9 |
| జనగామ | 11.9 | 31.1 |
| వికారాబాద్ | 12.5 | 25.3 |
| కరీంనగర్ | 13.2 | 32.9 |
| పెద్దపల్లి | 13.4 | 28.4 |
| జోగులాంబ గద్వాల | 13.5 | 32.9 |
| మహబూబాబాద్ | 13.7 | 32.9 |
| కుమ్రం భీం | 13.8 | 31.0 |
| మంచిర్యాల | 13.8 | 31.3 |
| ఆదిలాబాద్ | 13.8 | 31.3 |
| వనపర్తి | 13.8 | 35.5 |
| భద్రాద్రి కొత్తగూడెం | 14.0 | 30.0 |
| సూర్యాపేట | 15.0 | 28.0 |
| రంగారెడ్డి | 15.0 | 29.0 |
| మేడ్చల్ | 15.0 | 30.0 |
| హైదరాబాద్ | 15.0 | 30.0 |
| వరంగల్ అర్బన్ | 16.0 | 28.0 |
| జయశంకర్ | 16.0 | 29.0 |
| కామారెడ్డి | 16.0 | 30.0 |
| వరంగల్ రూరల్ | 16.0 | 30.0 |
| ఖమ్మం | 16.0 | 30.0 |
| నిర్మల్ | 16.0 | 31.0 |
| జగిత్యాల | 16.0 | 32.0 |
| నిజామాబాద్ | 16.1 | 30.9 |
| నల్లగొండ టెంపరేచర్ | 16.2 | 29.0 |
| రాజన్న సిరిసిల్ల | 23.0 | 29.0 |

## రెండ్రోజులు పొడి వాతావరణం

- రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- చలికి తాళలేక శతాధిక వృద్ధుడి మృతి

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో పొడివాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతున్నట్టు పేర్కొన్నది. ఉత్తర, ఈశాన్య దిశలనుంచి గాలులు వీయడం తగ్గడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. మొన్నటివరకు అసాధారణ రీతిలో నమోదైన రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా సాధారణ స్థాయికి చేరుకున్నాయి. ఐదురోజుల క్రితం నగరంలో ఉష్ణోగ్రత 9.3కు పడిపోగా ఆదివారం నాటికి 15 డిగ్రీలకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అత్యల్పంగా రామగుండంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 13 డిగ్రీలు నమోదైయింది. ఆదిలాబాద్, హకీంపేటల్లో 14 డిగ్రీలు, హైదరాబాద్, మహమూబ్‌నగర్‌లలో 15 డిగ్రీలు, హన్మకొండ, నల్లగొండ, నిజామాబాద్‌ల్లో 16 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం మాందారిపేటకు చెందిన కొమ్ముల ఎల్లయ్య (110) చలి తీవ్రత తాళలేక ప్రాణాలు కోల్పోయాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చలిని తట్టుకోలేక శనివారం రాత్రి మృతిచెందినట్టు గ్రామస్థులు తెలిపారు.

# అడ్రస్ ఇక్కడ.. కాలేజీ ఎక్కడో

- డిగ్రీ కళాశాలల బాగోతం
- చర్యలకు సిద్ధమైన విద్యామండలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల అడ్రస్‌లు గల్లంతయ్యాయి. కాలేజీ అనుమతి, అఫిలియేషన్ పత్రాలలో పేర్కొన్న చిరునామాల్లో కొనసాగడంలేదు. అడ్రసు ఒకచోట ఉండగా.. కాలేజీలు మరోచోట కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీలకు ఈ విషయంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కొందరు విద్యార్థులు నేరుగా ఫిర్యాదు చేయడంతో.. చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ డిగ్రీ కాలేజీల గురించిన సమగ్ర సమాచారాన్ని సేకరించడంపై ఉన్నత విద్యామండలి దృష్టిసారించింది. త్వరలోనే నోటిఫికేషన్ జారీచేయాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఆ తర్వాతనే డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ నోటిఫికేషన్ ఇవ్వడానికి ఉన్నత విద్యామండలి నిర్ణయించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు సభ్యులుగా తనిఖీ బృందాలను నియమించాలని అధికారులు భావిస్తున్నారు.

**విస్తుపోతున్న ఓయూ అధికారులు**

అనుబంధ గుర్తింపు కోసం దాఖలుచేసిన పత్రాలలో చూపిన అడ్రసులో ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు కొనసాగకపోవడంపై ఓయూ అధికారులు విస్తుపోతున్నారు. దిల్‌సుక్‌నగర్ చిరునామాతో ఉన్న కాలేజీని డిగ్రీ పరీక్షా కేంద్రంగా వేయడంతో.. వెళ్లిన విద్యార్థులకు అక్కడ మరో సంస్థ దర్శనమిచ్చింది. విద్యార్థులు సకాలంలో పరీక్ష రాయలేని పరిస్థితి వచ్చింది. ఆ విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదుతో విచారించిన ఓయూ అధికారులు.. సదరు కాలేజీ మేడ్చల్‌లో కొనసాగుతున్నట్టు తేలింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా కాలేజీలు ఇదేవిధంగా ఉన్నాయని, అఫిలియేషన్ పత్రాల్లో పేర్కొన్న అడ్రస్‌లో కొనసాగడం లేదన్న సమాచారం ఉన్నదని ఓయూ అధికారులు చెప్తున్నారు.

**వచ్చే నెలలో దోస్త్ నోటిఫికేషన్**

ప్రైవేటు డిగ్రీ కాలేజీల వివరాలు సేకరించి, తనిఖీలు చేపట్టిన తర్వాతే వచ్చే విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం దోస్త్ నోటిఫికేషన్ ప్రకటించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. దోస్త్ ప్రవేశాల ప్రక్రియ లోపాలను సరిచేయడానికి ముందుగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నదన్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు అస్తవ్యస్త విధానాన్ని సరిచేసేందుకు కార్యాచరణ తయారుచేశారు.



# గ్రామ స్వరాజ్యం

## మూడో విడుతలో మాసాయిపేట ఎన్నిక

### మార్పు చేస్తూ నోటిఫికేషన్ జారీచేసిన ఎన్నికల సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడుతలో జరుగాల్సిన ఓ గ్రామ ఎన్నికను మూడో విడుతకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మార్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామపంచాయతీ ఎన్నికను మొదటి విడుతలో నిర్వహిస్తున్నట్టు ఎస్ఈసీ తొలుత ప్రకటించింది. అయితే గ్రామ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలున్నాయని, వివరంగా లేవంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారించిన హైకోర్టు ఓటరు జాబితా ఫైనల్ చేసి.. ఆ తర్వాతనే ఎన్నికలు జరుపాలంటూ ఆదేశించింది. దాంతో ఇక్కడ మొదటి విడుతలో జరుగాల్సిన ఎన్నికను మూడో విడుతలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకొన్నది.



# నేటినుంచి నామినేషన్లు

తొలి విడుత నోటిఫికేషన్





197 మండలాలు, 4480 గ్రామపంచాయతీల్లో నోటిఫికేషన్

వార్డులవారీగా ఓటర్ల జాబితా

నామినేషన్లకు మార్గదర్శకాలు

10న నామినేషన్ల పరిశీలన

11న అభ్యంతరాల స్వీకరణ

12న తుది జాబితా ప్రకటన

13 నుంచి 20 వరకు ఎన్నికల ప్రచారం

21న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడుతకు సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. ఉదయం 10.30 గంటలకు జిల్లా ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ జారీచేస్తారు. మూడు విడుతల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి విడుతకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి ప్రకటించారు. ఈ నెల 9 వరకు (సోమ, మంగళ, బుధవారాల్లో) నామినేషన్లను స్వీకరిస్తారని పేర్కొన్నారు. తొలి విడుతలో 30 జిల్లాల పరిధిలోని 197 మండలాలు, 4,480 గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారు. 4,480 గ్రామసర్పంచ్ స్థానాలు, 39,832 వార్డుసభ్యుల స్థానాల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. మండలాలవారీగా నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తీసుకుంటారు. ఈ నెల 10న నామినేషన్లను పరిశీలించి జాబితాను ప్రదర్శిస్తారు. 11న అభ్యంతరాలను స్వీకరించి, 12న పరిష్కరిస్తారు. ఉపసంహరణకు గడువు కూడా అదే రోజు. ఆరోజు సాయంత్రం సర్పంచ్, వార్డు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఈ నెల 13 నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం నిర్వహించుకోవచ్చు. 21వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు. ఆయా జిల్లాలకు పరిశీలకులను నియమించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి చెప్పారు. రిటర్నింగ్ అధికారులకు హ్యాండ్‌బుక్‌లు పంపిణీచేశామని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలను నిర్వహిస్తామని తెలిపారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. గ్రామాలు, వార్డులవారీగా ఓటర్ల తుది జాబితాను సోమవారం గ్రామపంచాయతీ నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

**ఆస్తుల అఫిడవిట్ సవాల్**

అభ్యర్థులు నామినేషన్‌పత్రాలతోపాటు ఆస్తులకు సంబంధించిన పూర్తివివరాలతో కూడిన అఫిడవిట్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఉమ్మడి కుటుంబ ఆస్తులు, పోలీస్ కేసులు, కోర్టు కేసులు, శిక్షలు ఇలా అఫిడవిట్ సమర్పించాల్సి ఉంది. పోటీచేసే అభ్యర్థులు ఏదీ రహస్యంగా దాచుకోవడానికి వీలులేకుండా అన్నీ చెప్పాల్సిందేనని ఎన్నికల సంఘం పేర్కొంది. ఎమ్మెల్యే అభ్యర్థి అందించే అఫిడవిట్ మాదిరిగానే సర్పంచ్ అభ్యర్థులు కూడా సమర్పించాలి. తప్పుడు సమాచారంతో నామినేషన్ దాఖలు చేస్తే తిరస్కరించనున్నారు. తప్పుడు సమాచారం ఇచ్చి గెలిచిన సర్పంచ్‌ను అనర్హుడిగా ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థులకు అఫిడవిట్ సవాలుగా మారింది. కుటుంబ సభ్యుల పాన్‌కార్డు, అకౌంట్ నంబర్, చివరి ఆర్థిక సంవత్సరం ఆదాయం పన్ను శాఖ రిటర్న్‌లు, ఆదాయం వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. చేతిలో ఉన్న నగదు నుంచి షేర్‌మార్కెట్ వరకు ఉన్న ఆదాయాన్ని చూపించాలి. బ్యాంక్‌లో జమ చేసిన నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఫైనాన్షియల్ సంస్థల్లో డిపాజిట్లు, బ్యాంకింగ్ రంగంలో జమచేసిన నగదు, బాండ్లు, డిబెంచర్లలో ఉన్న పెట్టుబడులు, షేర్ మార్కెట్‌లో ఉన్న షేర్లు, పోస్టాఫీస్, ఇన్సూరెన్స్ పాలసీలు, వాహనాలు, వ్యవసాయ భూములు, ప్లాట్లు, అప్పులు, బ్యాంకు రుణాలు అన్ని వివరాలు సమర్పించాలి.



### పకడ్బందీ మార్గదర్శకాలు

నామినేషన్లు దాఖలుచేసే సందర్భంగా అభ్యర్థులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. కుల ధ్రువీకరణ పత్రం, వయసు నిర్ధారణ కోసం జనన ధ్రువీకరణ లేదా పదో తరగతి మెమో జిరాక్స్, విద్యార్హతలకు సంబంధించిన అఫిడవిట్, ఆస్తుల వివరాలు, కోర్టు కేసులు, ఇతర పదవులు ఉంటే రాజీనామా ఆమోదించిన పత్రాలు, ఉద్యోగి అయితే రాజీనామా ఆమోదించిన పత్రాలు, గ్రామపంచాయతీ నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ప్రకటించాలి. సర్పంచ్ అభ్యర్థి గ్రామంలో ఓటరుగా, వార్డు స్థానానికి పోటీచేసే అభ్యర్థి వార్డు పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి. 21 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్లతోపాటు బ్యాంక్ ఖాతా కొత్తగా తీసి, పాస్ పుస్తకం జిరాక్స్ అందజేయాలని ఎన్నికల సంఘం మరోసారి స్పష్టం చేసింది. ప్రచార ఖర్చులన్నీ బ్యాంకు నుంచే చెల్లించాలని పేర్కొంది.

### తప్పుడు విద్యార్హత చూపితే తిరస్కరణ

పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు విద్యార్హతను తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుంది. చదువు, విద్యాసంస్థ, సంవత్సరాల వివరాలు చూపాలి. రిమార్కులు సైతం చూపించాలి. ఈ అఫిడవిట్‌ను ఎన్నికల అధికారులు తమ కార్యాలయంలోని నోటీస్ బోర్డుకు అతికిస్తారు. వాటిపై ఎన్నికల అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వాటి ఆధారంగా.. తప్పుడు పత్రాలు సమర్పించిన నామినేషన్ పత్రాలను తిరస్కరిస్తారు.

సోపానం



# సర్పంచ్ నుంచి మంత్రి దాకా..

- మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం
- జోగు రామన్న ప్రస్థానమిది

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** ప్రజాప్రతినిధులుగా ఎదగటానికి రాజకీయాల్లో తొలిమెట్టు సర్పంచే అంటారు. చాలామంది ఇక్కడి నుంచే తమ రాజకీయ రంగంలోకి ప్రవేశించి అంచెలంచెలుగా ఎదుగుతుంటారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జోగు రామన్న సైతం సర్పంచ్‌గానే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. మూడు దశాబ్దాలుగా ప్రజల మధ్య ఉంటూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. 1988 నుంచి 1995 వరకు ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం దీపాయిగూడలో సర్పంచ్‌గా పనిచేశారు. 1995-2001 వరకు జైనథ్ మండల పరిషత్ అధ్యక్షుడిగా కొనసాగారు. 2001-2005 వరకు జైనథ్ జెడ్పీటీసీగా మొదటిసారి, 2006-2009 వరకు రెండోసారి ఎన్నికయ్యారు. 2009 సాధారణ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 23 నవంబర్ 2011న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. 2012 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి అఖండ విజయం సాధించారు. మూడోసారి విజయం సాధించిన జోగు రామన్న సీఎం కేసీఆర్ కేబినెట్‌లో బీసీ, సంక్షేమ, అటవీ పర్యావరణ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన జోగు రామన్న 26,606 ఓట్ల మెజార్టీతో నాలుగోసారి ఘన విజయం సాధించారు.

> నేను ప్రజాప్రతినిధిగా సర్పంచ్ పదవితోనే రాజకీయాల్లోకి ప్రవేశించాను. ఈ పదవి నాకెంతో సంతృప్తినిచ్చింది. గ్రామస్థాయిలో చాలా సమస్యలుంటాయి. సర్పంచులుగా ఎన్నికైన వారు ప్రజాసేవే ప్రధాన కర్తవ్యంగా పనిచేయాలి. నిధులను పక్కా ప్రణాళికతో గ్రామాభివృద్ధి కోసం వినియోగించాలి. తాగునీరు, వీధి దీపాలు, మురికి కాల్వలు, రోడ్ల నిర్మాణం వంటి వాటిపై ప్రధానంగా దృష్టి సారించాలి. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడాలి. గ్రామస్థాయిలో సమర్థవంతంగా పని చేసే నాయకులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచులు పాలనలో తమదైన ముద్రవేయాలి.
>
> - జోగు రామన్న, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

# ఐదు దశాబ్దాలుగా ఏకగ్రీవమే


**భాకే రఘునాథ్ రావు / నమస్తే తెలంగాణ, ఆదిలాబాద్:** పంచాయతీ ఏర్పడినప్పటినుంచి ఆ గ్రామంలో ఎన్నికలు లేవు. ప్రతిసారీ ఏకగ్రీవమే. 1964లో తొలిసారి జరిగిన ఎన్నికల నుంచి 2013 ఎన్నికల వరకు సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. అదే ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ గ్రామపంచాయతీ. నాలుగు వేల జనాభా ఉన్న ఈ పంచాయతీ పరిధిలో నాలుగు గ్రామాలు, 10 వార్డులున్నాయి. ఇప్పటివరకు ఏడుగురు సర్పంచ్‌లు ఇక్కడ ఏకగ్రీవమయ్యారు. వీరిలో ఒకరు నాలుగు దఫాలుగా సర్పంచ్ పదవిలో కొనసాగడం విశేషం.



> గతంలో నిధుల కొరత బాగా ఉండేది. ఏ పని చేయాలన్నా సొంతంగా డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఇప్పుడు ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తుంది.
>
> - ముడుపు భూమారెడ్డి, మాజీ సర్పంచ్, బరంపూర్

**కలిసి మెలిసి గ్రామాభివృద్ధి**

కలసిమెలసి ఉంటే అభివృద్ధి సాధ్యమని భావించి సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నజరానా పదేండ్ల కిందట రూ.5 లక్షలు, రెండేండ్ల క్రితం రూ.7 లక్షలు వచ్చాయని రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ కేదారేశ్వర్‌రెడ్డి తెలిపారు. వీటితో గ్రామాభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.



> ఎన్నికలకు ముందే పెద్దలు, యువత, మహిళలు అందరం కలిసి సమావేశమవుతాం. ఎవరిని సర్పంచ్‌గా ఎన్నుకోవాలనే విషయంలో చర్చించి ఏకాభిప్రాయానికి వస్తాం. ఈ సారి ఎన్నికల్లో కూడా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు చర్చలు జరుపుతున్నాం.
>
> - ఎలీటీ నాగారెడ్డి, గ్రామస్థుడు, బరంపూర్

**ఎన్నికల ముందే సమావేశం**

బరంపూర్ పంచాయతీలో ఎన్నికల ముందుగానే పంచాయతీలోని పజలు సమావేశమవుతారు. ఎవరిని సర్పంచ్‌గా ఎన్నుకోవాలని విషయంపై చర్చించి చివరకు ఏకాభిప్రాయానికి వచ్చి పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు సర్పంచ్‌గా అవకాశం వచ్చేలా చూసుకుంటారు.

# పల్లె సల్లంగుండాలి

స్వచ్ఛతకు బాటలు వేస్తున్న కొత్త చట్టం - అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం

సర్పంచ్‌లకు కార్యనిర్వహణ అధికారం – నెలకో గ్రామసభ నిర్వహించాల్సిందే

**(తంగళ్లపల్లి సంపత్) హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

'దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు'.. అన్న మాటను నిజం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం గ్రామస్వరాజ్యానికి బాటలు వేస్తున్నది. ఈ చట్టంలో పంచాయతీరాజ్ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళనచేసి పాలకవర్గాలకు పూర్తిస్థాయి అధికారాలను కల్పించింది. సమైక్య పాలనలో కనీసం రోడ్డు, వీధిదీపాలు, తాగునీటి సౌకర్యం లేక కునారిల్లిన పల్లెలు.. ఇక ప్రగతి బాటన పరుగులు పెట్టనున్నాయి. గ్రామీణుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసేలా పంచాయతీరాజ్ చట్టం-2018ని రూపొందించి కఠిన నిర్ణయాలు పొందుపరిచారు. ఇంటి ముందు చెత్త వేసినవారికి రూ.500 జరిమానా విధించే అధికారాన్ని పాలకవర్గానికి కట్టబెట్టారు. ప్రతి కుటుంబం కనీసం ఆరు మొక్కలు నాటాలని, వాటిలో మూడు మొక్కలైనా ఎదిగేలా చూడాలని ఆదేశాలు జారీచేసింది. హరితహారంలో మొక్కలు పెంచనివారి నుంచి ఇకపై రెండింతల ఆస్తిపన్నును జరిమానాగా వసూలుచేయనున్నారు.

**అధికారాలు.. ఆంక్షలు..**

గ్రామ సర్పంచ్‌కు కార్యనిర్వహణ అధికారాన్ని కట్టబెట్టిన కొత్త చట్టం.. ఉప సర్పంచ్‌కు చెక్‌పవర్‌ను అందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, ఇతర పనులకు లబ్ధిదారులను గుర్తించడం, పన్ను బకాయిదారుల జాబితా రూపొందించడం, బడ్జెట్‌లో ఆమోదించాల్సిన అంశాలను సూచించడం, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు విరాళాల సేకరణ వంటి విధులను గ్రామసభకు అప్పగించారు. ప్రతినెలా కనీసం ఒకసారి గ్రామసభ నిర్వహించాలి. ఓటుహక్కు కలిగిన గ్రామస్థుల్లో కనీసం 50 మందిగానీ.. మొత్తం ఓటర్లలో 10 శాతం మందిగానీ.. కోరినప్పుడు గ్రామసభను నిర్వహించాలి. వరుసగా మూడు గ్రామసభలను నిర్వహించనిపక్షంలో సర్పంచ్‌ను పదవి నుంచి తొలిగించాలని చట్టంలో పొందుపరిచారు. ఏటా ఏప్రిల్ 14, అక్టోబర్ 3న తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలి. అలాగే జనవరి 2, జూలై 4న కూడా గ్రామసభ జరుపాలని కొత్తచట్టంలో పేర్కొన్నారు. కనీసం నెలకొసారి పంచాయతీ సమావేశాన్ని జరుపాలి. 90 రోజుల్లో పంచాయతీ సమావేశం నిర్వహించకుంటే పంచాయతీ కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొనే వీలు చట్టం కల్పించింది. డంపింగ్ యార్డుల నిర్వహణ, పరిశుభ్రత, వైకుంఠధామాల ఏర్పాటు, నిర్వహణ అంశాల్లో ప్రగతి సాధించిన పల్లెలకు అవార్డులు దక్కనున్నాయి.

**నిధులు.. విధులు..**

గ్రామపంచాయతీ నిధుల్లో 30 శాతం పంచాయతీ కార్మికుల జీతభత్యాల కోసం వినియోగించాలి. నీటి సరఫరాకు 15 శాతం, పారిశుద్ధ్య నిర్వహణకు 15 శాతం, వీధిదీపాల నిర్వహణకు 15 శాతం, అంతర్గత రోడ్ల మరమ్మతులకు 20 శాతం నిధులు వెచ్చించాలి. పంచాయతీ సమావేశాలు, ఇతర ఖర్చులకు 5 శాతం నిధులు వాడుకొనేలా వెసులుబాటు కల్పించారు. కొత్త చట్టంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక విధులను కేటాయించారు. తాగునీటి సరఫరా, పరిశుభ్రత, నూతన నిర్మాణాల అనుమతులు, జనన, మరణ ధ్రువీకరణ రికార్డులు నమోదు, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీ, మొక్కలు నాటడం, వీధిదీపాల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు చేయించాలి.

**నిబంధనలు.. జరిమానాలు**

గ్రామ పంచాయతీ మేనేజ్‌మెంట్ కింద ధర్మాదాయ, ట్రస్టుల నుంచి నిధులు సేకరించడం, సర్వీసు ఇనాములపై శిస్తు వసూలు చేయడం, మత్స్యక్షేత్రాల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన పన్నుల వసూళ్లు, పెద్ద, చిన్న తరహా ఖనిజ వ్యాపారాలు, వాటి తవ్వకాలపై సీనరేజీ వసూలు, పోరంబోకు భూముల నుంచి వచ్చే ఆదాయం, ప్రభుత్వ ఆస్తి, కౌలు పన్నులను వసూలుచేసి గ్రామాభివృద్ధికి వినియోగించాల్సిన బాధ్యత పెట్టారు. పబ్లిక్ ప్రదర్శన, ఉత్సవాల నిర్వహణ, గ్రామస్తుల వినోదం కోసం పంచాయతీ నిధులు వెచ్చించే వెసులుబాటు కల్పించారు. డ్రైనేజీని పూడ్చి భవనాలు నిర్మిస్తే రూ. రెండు వేలు, పబ్లిక్ రోడ్లపై గుంతలు తవ్వినా, పగులగొట్టినా, కంచె ఏర్పాటుచేసినా, స్పీడ్‌బ్రేకర్లు నిర్మించినా రూ.500, పంచాయతీ స్థలాలు, పోరంబోకు భూముల్లోని చెట్లను నరికితే రూ.రెండు వేలు జరిమానా వేయనున్నారు. ప్రైవేట్ మార్కెట్ ఏర్పాటుచేస్తే రూ.ఐదు వేల జరిమానా ఉంటుంది. గ్రామంలో అల్లరిచేసేవారికి రూ.వెయ్యి జరిమానా విధించే అధికారాన్ని పాలకవర్గానికి కట్టబెట్టారు.

### షాద్‌నగర్ వేదికగా పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రారంభం

మన దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు బల్వంతరాయ్ మెహతా ఆద్యుడు. 1957లో బల్వంత్ రాయ్ మెహతా ఎంపీగా ఉన్న సమయంలో ఆయన నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ పంచాయతీరాజ్ వ్యవస్థపై లోతైన అధ్యయనం చేసింది. ఆ కమిటీ సిఫారసుల మేరకు 1959 అక్టోబర్ 2న దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థకు పునాది పడింది. ఈ వ్యవస్థను తీసుకొచ్చిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా.. రెండో రాష్ట్రం మనదే. 1959 నవంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించారు. గ్రామస్థాయిలో పంచాయతీ, బ్లాక్‌స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్‌గా.. స్థానిక సంస్థలకు అంకురార్పణ జరిగింది. ఉమ్మడి ఏపీలో బ్లాక్ స్థాయి వ్యవస్థను మండల పరిషత్‌గా మార్చాలని 1986లో నిర్ణయం తీసుకొని.. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1994లో పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించింది. 2018 వరకు ఇదే చట్టాన్ని అనుసరించారు.

# ఐక్యత చాటుతున్న కొత్త పల్లెలు

**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** కొత్త పంచాయతీల్లో సరికొత్త సంబురం కనిపిస్తున్నది. అభివృద్ధి కోసం తమ గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకొని సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని పల్లెవాసులు ప్రకటిస్తున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలో 130 గ్రామపంచాయతీలుండగా 129 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి పంచాయతీ కాలపరిమితి 2020 వరకు ఉన్నందున ఇక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదు. కాగా జిల్లాలో 550 వరకు జనాభా ఉన్న గ్రామాలు 14 ఉన్నాయి. ఇవన్నీ దాదాపుగా కొత్తగా ఏర్పడిన పంచాయతీలే. కొత్త పంచాయతీల్లో ఈసారి పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని భావిస్తున్నారు. ప్రభుత్వమిచ్చే ప్రోత్సాహంతోపాటు స్థానిక ఎమ్మెల్యేలు సైతం నజరానాలు ప్రకటిస్తుండటంతో ఆ నిధులతో అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నారు. అయితే పాత పంచాయతీల్లోనూ టీఆర్ఎస్‌పై ఒత్తిడి పెరిగింది. పార్టీలకతీతంగా జరిగే ఎన్నికలే అయినా టీఆర్ఎస్ మద్దతుదారులుగా పోటీ చేసేందుకు ఆయా గ్రామాల్లోనివారు పార్టీ నేతల అనుమతి కోసం పోటీపడుతున్నారు.

**ఐక్యతను చాటుతున్న శాంతినగర్..**

వరంగల్ అర్బన్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన అతిచిన్న పంచాయతీ శాంతినగర్. ఇక్కడ కేవలం నాలుగు వార్డులే ఉన్నాయి. సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. 195 మంది ఓటర్లు ఉండగా అందులో ఎస్సీ ఓటరు ఒక్కరే ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడి జనాభా కేవలం 205 మాత్రమే. ఎల్కతుర్తి మండలం కోతులనడుమ పంచాయతీ నుంచి ఇటీవలే ఏర్పాటైన అతిచిన్న గ్రామ పంచాయతీ. ఇక్కడ గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చి స్థిరపడ్డవారే అధికం. సీఎం కేసీఆర్ పుణ్యమా అని తమకు గ్రామపంచాయతీ హోదా కల్పించారని గ్రామస్థులు సంబురంతో ఉన్నారు. సర్పంచ్‌ను ఏకగ్రీవం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఆరెపల్లిదీ అదే బాట..**

ఇదే మండలంలోని ఆరెపల్లి కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీ. ఇక్కడ ఆరు వార్డులే ఉన్నాయి. ఓటర్లు 234 మంది. జనాభా 370. ఇక్కడి సర్పంచ్ బీసీ జనరల్‌కు రిజర్వ్ అయింది. కాగా గుంటూరుపల్లి ఆరు వార్డులతో గ్రామ పంచాయతీగా ఏర్పడింది. జనాభా 478. ఓటర్లు 319 మంది ఉన్నారు. ఇక్కడి సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. ఇందిరానగర్ సైతం కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతే. నాలుగు వార్డులు ఉన్నాయి. 478 జనాభా. 362 మంది ఓటర్లు. సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. కమలాపూర్ మండలం శనిగరం గ్రామం నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడ్డ లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో జనాభా 380. ఇక్కడ 285 మంది ఓటర్లున్నారు. పైగ్రామాలన్నీ ఏకగ్రీవం కోసం ప్రయత్నిస్తున్నాయి.



> కొత్తగా ఏర్పడిన మా గ్రామంలో తొలిసారి సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నాయి. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకోవాలని భావిస్తున్నాం. అందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.
>
> -చెరిపెల్లి శ్రీనివాస్, లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ, కమలాపూర్ మండలం



> ఇదివరకు మా గ్రామం ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ పంచాయతీ పరిధిలో ఉండేది. ఏ చిన్న పనికైనా అక్కడికి వెళ్లాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ పుణ్యమా అని మా గ్రామం పంచాయతీగా మారింది. ఈ ఎన్నికల్లో పాలక వర్గాన్ని ఏకగ్రీవం చేసుకొని సీఎం కేసీఆర్ రుణం తీర్చుకుంటాం.
>
> -సలిపిండ్ల ఇన్నారెడ్డి, శాంతినగర్ గ్రామ పంచాయతీ, ఎల్కతుర్తి మండలం

# ఐఏఎస్‌లకు పంచాయతీ ఎన్నికల బాధ్యతలు

సాధారణ పరిశీలకులుగా 18 మంది సీనియర్లు

వ్యయ పరిశీలకులుగా 36 మంది ఆడిట్ ఆఫీసర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పరిశీలనకు 18 మంది సీనియర్ ఐఏఎస్‌లకు జిల్లాలను కేటాయిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, 36 మంది ఆడిట్ ఆఫీసర్లను వ్యయ పరిశీలకులుగా నియమించారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు సెర్ప్ సీఈవో పౌసుమీబసు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌కుమార్, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు కే సురేంద్రమోహన్, ఖమ్మంకు ఆయిల్‌ఫెడ్ ఎండీ నిర్మల, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు పట్టణాభివృద్ధిశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ శర్మ, మహబూబ్‌నగర్ జిల్లాకు శశిధర్, మెదక్, మేడ్చల్ జిల్లాలకు వాకాటి కరుణ, నాగర్‌కర్నూల్ జిల్లాకు బాలమాయాదేవి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు టీ చిరంజీవులు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు క్రిస్టియానా జెడ్ చోంగ్తు, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు జాయింట్ సెక్రెటరీ భారతిలక్‌పతి నాయక్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు మహిళా సంక్షేమశాఖ డైరెక్టర్ వైజేంద్ర, రంగారెడ్డి జిల్లాకు పరిశ్రమలశాఖ కమిషనర్ అహ్మద్‌నదీం, సంగారెడ్డి జిల్లాకు అలుగు వర్షిణి, సిద్దిపేట జిల్లాకు దినకర్ బాబు, వికారాబాద్ జిల్లాకు గెజిటర్స్ కమిషనర్ కిషన్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలకు ఉపాధి, శిక్షణ డైరెక్టర్ వై నాయక్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జాను నియమించారు.



బెస్ట్ చాలెంజింగ్ బాక్సర్: నిఖత్ జరీన్

## పసిడి పంచ్ చేజారె

**రజతంతో ఆకట్టుకున్న నిఖత్ జరీన్.. జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్**

**విజయనగరం:** ఎలైట్ జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర బాక్సర్ నిఖత్ జరీన్ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. పసిడి పతకమే లక్ష్యంగా టోర్నీ బరిలోకి దిగిన నిఖత్ ఆఖరి పోరులో తడబడింది. ఆదివారం ఆసక్తికరంగా సాగిన మహిళల 51కిలోల ఫ్లైవెయిట్ విభాగంలో నిఖత్ 2-3 తేడాతో పింకీ రాణి(హర్యానా) చేతిలో పోరాడి ఓడింది. దీంతో రజత పతకంతో సంతృప్తిపడాల్సి వచ్చింది. బౌట్‌లో ఫేవరేట్‌గా పోటీకి దిగిన పింకీ ఆదిలో తడబడింది. ఇదే అదునుగా నిజామాబాద్ యువ బాక్సర్ నిఖత్ పదునైన పంచ్‌లతో విరుచుకుపడింది. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వకుండా జాబ్స్, హుక్స్‌తో ఉక్కిరిబిక్కిరి చేసింది. అయితే ఒక్కసారిగా పుంజుకున్న పింకీ.. నిఖత్‌పై పంచ్‌ల వర్షం కురిపించింది. అయితే కచ్చితమైన పంచ్‌లతో హర్యానా బాక్సర్ పైచేయి సాధించింది. ఇద్దరు హోరాహోరీగా తలపడినా... రిఫరీలు పింకీ వైపు మొగ్గుచూపారు. రన్నరప్‌గా నిలిచిన నిఖత్ జరీన్‌ను సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.



# పట్టు చిక్కింది.. వాన ఆపింది!



కుల్దీప్ 5/99

**సిడ్నీ టెస్ట్‌లో భారత్ విజయం వాయిదా ▪ తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 300 ఆలౌట్**
**31 ఏండ్ల తర్వాత ఫాలో ఆన్‌లో ఆతిథ్య జట్టు ▪ ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 6/0**

**ఆసీస్ గడ్డపై అతిపెద్ద విజయానికి భారత్ మరికొన్ని గంటలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగో రోజే మ్యాచ్‌ను ముగించాలని కలలుగన్న టీమ్‌ఇండియాకు వాన దేవుడు అడ్డంకిగా మారాడు. రాత్రంతా కురిసిన వర్షం వల్ల నాలుగో రోజు కేవలం 25.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యంకావడంతో విరాట్‌సేన సిరీస్ గెలుపు మరో రోజుకు వాయిదా పడింది. మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ 'పంచ' తంత్రం చూపడంతో తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే ఆలౌటైన ఆసీస్ ఫాలో ఆన్‌లో పడింది. దీంతో 31 ఏండ్ల తర్వాత కంగారూలను ఫాలో ఆన్ ఆడిస్తున్న ఘనతను టీమ్‌ఇండియా దక్కించుకుంది. ఐదో రోజు కూడా వరుణుడు ప్రభావం చూపితే.. ఫలితం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.**



**సిడ్నీ:** సొంతగడ్డపై తమకు ఎదురేలేదని బీరాలకు పోయిన ఆస్ట్రేలియాకు అతిపెద్ద షాక్ తగలబోతున్నది. ఏడు దశాబ్దాలుగా టీమ్‌ఇండియాపై చూపెడుతున్న ఆధిపత్యానికి చెక్ పెట్టే సమయం రానే వచ్చింది. ఎలాంటి మలుపులు లేకుండా సాగుతున్న నాలుగో టెస్ట్‌లో ఆదివారం నాలుగో రోజు కూడా భారత్ ఆధిక్యమే కొనసాగింది. కుల్దీప్ యాదవ్ (5/99) స్పిన్ దెబ్బకు.. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 104.5 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటై ఫాలో ఆన్‌లో పడింది. 236/6 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఆసీస్ ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం కలిగించింది. షెడ్యూల్ ప్రకారం 10 గంటలకే మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉన్నా.. వెలుతురులేమి, చిరుజల్లులతో మరింత ఆలస్యమైంది. మొత్తానికి నిలకడలేని వాతావరణంతో తొలి సెషన్ ఆట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. రెండో సెషన్‌లో కాసేపు ఇలాగే కొనసాగినా.. ఎట్టకేలకు వాన దేవుడు కరుణించడంతో స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒకటిన్నరకు మ్యాచ్ మొదలైంది. వెంటనే రెండో కొత్త బంతిని తీసుకున్న షమీ (2/58) చెలరేగిపోయాడు. విరామం తొలి ఓవర్‌లోనే లో లెంగ్త్ బంతితో కమిన్స్ (25)ను పెవిలియన్‌కు పంపించాడు. రెండో ఎండ్‌లో కూడా బుమ్రా (1/62) లైన్ అండ్ లెంగ్త్‌ను పాటించాడు. ఈ క్రమంలో హ్యాండ్స్‌కోంబ్ (37) వికెట్ తీశాడు. కొద్దిసేపటికే కుల్దీప్.. లైయన్ (0)ను ఔట్ చేయడంతో ఆసీస్ స్కోరు 258/9గా మారింది. ఓవరాల్‌గా 44 బంతుల వ్యవధిలో 22 పరుగుల తేడాలో కంగారూలు 3 వికెట్లు చేజార్చుకున్నారు. అయితే ఓ ఎండ్‌లో స్థిరంగా ఆడిన హాజిల్‌వుడ్ (21), స్టార్క్(29 నాటౌట్) నెమ్మదిగా ఆడారు. ఓసారి హాజిల్‌వుడ్ ఇచ్చిన క్యాచ్‌ను మిడాన్‌లో విహారి జారవిడిచాడు. ఈ క్యాచ్ పట్టే ప్రయంతో హైదరాబాద్ కుర్రాడి భుజం బలంగా నేలకు తాకింది. ఫలితంగా ఇతని స్థానంలో హార్దిక్ ఫీల్డింగ్‌కు వచ్చాడు. ఈ ఇద్దరు పదో వికెట్‌కు 42 పరుగుల జత చేయడంతో ఆసీస్ స్కోరు 300లకు చేరింది. ఇదే ఓవర్‌లో హాజిల్‌వుడ్‌ను వికెట్ల ముందు దొరికించుకున్న కుల్దీప్ ఐదు వికెట్ల ఘనతను ఖాతాలో వేసుకున్నాడు. బ్యాట్స్‌మన్ డీఆర్ఎస్‌కు వెళ్లినా ఫలితం లేకపోవడంతో ఇన్నింగ్స్‌కు తెరపడింది. అయితే చేయాల్సిన స్కోరు చాలా ఉండటంతో విరాట్.. ఆసీస్‌ను ఫాలో ఆన్‌కు పిలిచాడు.

2005 తర్వాత ఆసీస్‌ను ఫాలో ఆన్ ఆడించడం ఇదే తొలిసారి. నాటింగ్‌హామ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కంగారూలు ఫాలో ఆన్ ఆడారు. అయితే స్వదేశంలో మాత్రం 1988లో ఇదే వేదికపై ఇంగ్లండ్ చేతిలో ఫాలో ఆన్ ఆడారు. ఓవరాల్‌గా 322 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాకు వెలుతురులేమి ప్రతికూలంగా మారింది. టీ విరామం తర్వాత దాదాపు గంటపాటు వేచి చూసినా ఫలితం లేకపోయింది. ఓ దశలో 6 గంటల వరకు మ్యాచ్‌ను కొనసాగించాలని భావించినా సాధ్యమయ్యే పరిస్థితులు లేకపోవడంతో ఎట్టకేలకు 5.20 గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రద్దయ్యే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 4 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. ఖవాజ (4 బ్యాటింగ్), హారిస్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్.**


**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** హారిస్ (బి) జడేజా 79, ఖవాజ (సి) పుజార (బి) కుల్దీప్ 27, లబుషానే (సి) రహానే (బి) షమీ 38, మార్ష్ (సి) రహానే (బి) జడేజా 8, హెడ్ (సి అండ్ బి) కుల్దీప్ 20, హ్యాండ్స్‌కోంబ్ (బి) బుమ్రా 37, పైన్ (బి) కుల్దీప్ 5, కమిన్స్ (బి) షమీ 25, స్టార్క్ నాటౌట్ 29, లైయన్ ఎల్బీ (బి) కుల్దీప్ 0, హాజిల్‌వుడ్ ఎల్బీ (బి) కుల్దీప్ 21, **ఎక్స్‌ట్రాలు:** 11, **మొత్తం:** 104.5 ఓవర్లలో 300 ఆలౌట్. **వికెట్లపతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198, 7-236, 8-257, 9-258, 10-300. **బౌలింగ్:** షమీ 19-2-58-2, బుమ్రా 21-5-62-1, జడేజా 32-11-73-2, కుల్దీప్ 31.5-6-99-5, విహారి 1-0-2-0. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖవాజ బ్యాటింగ్ 4, హారిస్ బ్యాటింగ్ 2, **మొత్తం:** 4 ఓవర్లలో 6/0. **బౌలింగ్:** షమీ 2-1-4-0, బుమ్రా 2-1-2-0.

## కుల్దీప్ మాయ చాలా ఉంది



భరత్ అరుణ్

**సిడ్నీ:** మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ప్రదర్శనపై టీమ్‌ఇండియా బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ ప్రశంసలు కురిపించాడు. అతని నుంచి చాలా ఆశించొచ్చన్నాడు. ఇంగ్లండ్ పర్యటనతో పోలిస్తే ప్రస్తుతం ఈ చైనామన్ చాలా మెరుగయ్యాడని కితాబిచ్చాడు. 'కుల్దీప్‌లో చాలా నైపుణ్యం ఉంది. ఆ విషయాన్ని నిరూపించుకున్నాడు కూడా. వన్డేల్లో అద్భుతంగా రాణించాడు. ఈ ఫార్మాట్‌లో నంబర్‌వన్ బౌలర్‌గా ఎదుగుతాడు. ప్రపంచ వ్యాప్తంగా చైనామన్‌లు చాలా తక్కువగా ఉన్నారు. అందులో కుల్దీప్ చాలా ప్రత్యేకం. గూగ్లీలు అద్భుతంగా విసురుతాడు. అతను క్రీజును ఉపయోగించుకునే విధానం వినూత్నంగా ఉంటుంది. ఓవర్ ది వికెట్, రౌండ్ ది వికెట్ కూడా బాగా వేస్తాడు. వికెట్లకు దగ్గరగా, దూరంగా కచ్చితమైన లెంగ్త్ బంతులు వేయగల సమర్థుడు. చాలా వైవిధ్యమైన బంతులు వేస్తాడు. అతని నుంచి చాలా రాబట్టొచ్చు' అని అరుణ్ పేర్కొన్నాడు. కుల్దీప్ వయసును పరిగణనలోకి తీసుకుంటే చాలా మెరుగయ్యాడన్నాడు. అతనిలో చాలా క్రికెట్ మిగిలి ఉందన్నాడు. సిడ్నీలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడటం వల్ల పరిస్థితులపై అవగాహన ఉందన్న అరుణ్.. దాని కారణంగానే ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగామన్నాడు. మెల్‌బోర్న్‌లో ఫాలో ఆన్ ఇవ్వకపోవడంపై మాట్లాడుతూ.. 'బౌలర్లను తాజాగా ఉంచడంతో పాటు ఎన్ని ఓవర్లు మిగిలాయన్న అంశంపైనే ఫాలో ఆన్ ఆధారపడుతుంది. ఈ రెండు కారణాలతోనే మేం మెల్‌బోర్న్‌లో బ్యాటింగ్ దిగాం. ఈ మ్యాచ్‌కు వచ్చేసరికి మూడో రోజు ఆసీస్ 150 పరుగులే చేసింది. దీనికి తోడు వాతావరణం కూడా సరిగా లేదు. కాబట్టి కచ్చితంగా ఫాలో ఆన్ ఇవ్వాలని భావించాం. బ్యాట్స్‌మెన్ వైపు నుంచి చూస్తే ఇది మంచి వికెట్. కాసేపు ఓపిక పడితే పరుగులు రాబట్టొచ్చు' అని బౌలింగ్ కోచ్ వివరించాడు.



> "ఈ మ్యాచ్‌లో మేం డ్రా కోసం పోరాడుతాం. పోయిన పరువును కాస్త అయినా కాపాడుకునే ప్రయత్నం చేస్తాం. మా బ్యాటింగ్‌లో నమ్మకం పెరగాలి. జట్టుగా మేం మరింత మెరుగుపడాలి. ఓడితే మాది మంచి జట్టు కాదనే ముద్ర పడుతుంది. కుల్దీప్, బుమ్రా ప్రపంచ స్థాయి బౌలర్లు. బుమ్రా వేగం 150 కేఎంపీహెచ్ దాటుతుంది. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో వేస్తాడు. బంతిని రెండువైపులా స్వింగ్ చేయడంలో సిద్ధహస్తుడు. కుల్దీప్ బంతుల్లో చాలా వైవిధ్యం ఉంటుంది. ఫాలో ఆన్ ఆడటానికి ఎవరూ ఇష్టపడరు. మేం దానికి అతీతం కాదు. ఫాలో ఆన్ ఆడుతున్నందుకు మాపై విమర్శలు వస్తాయి. ఐదో రోజు బాగా ఆడి వీటికి చెక్ పెట్టాలి. ఈ సిరీస్ తర్వాత మా వైఫల్యాలను సమీక్షించుకుంటాం. బలహీనతలను అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపడుతాం."
>
> **-హ్యాండ్స్‌కోంబ్**

## డీఆర్ఎస్ వాడుకోరా? పాంటింగ్

**సిడ్నీ:** సిడ్నీలో భారత్‌తో జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు కనీస పోరాటపటిమ ప్రదర్శించకపోవడంపై ఆ దేశ క్రికెట్ దిగ్గజం రికీ పాంటింగ్ నిప్పులు చెరిగాడు. నాలుగు టెస్ల సిరీస్‌లో ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా సిడ్నీలోనూ ఆధిపత్యం చెలాయిస్తున్నది. పుజార, పంత్ సెంచరీలతో భారీ స్కోరు అందుకున్న భారత్..ఆసీస్‌ను సొంతగడ్డపై మూడు దశాబ్దాల తర్వాత ఫాలోఆన్‌కు దింపి తమ సత్తాఏంటో చాటిచెప్పింది. తొలి ఇన్నింగ్స్‌లో నాథన్ లియాన్ ఔటైన తీరుపై పాంటింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగిన లియాన్..ఔట్‌పై డీఆర్ఎస్ వెళ్లకపోవడంపై పాంటింగ్ విమర్శలు సంధించాడు. చానెల్ సెవెన్ వార్తసంస్థతో మాట్లాడుతూ 'లియాన్ ఔటైన తీరును చూస్తే..ఆస్ట్రేలియన్ల మైండ్‌సెట్ ఎలా ఉందో అర్థమవుతుంది. ప్రత్యర్థికి కనీసం పోటీనివ్వలేని దశలో ఆసీస్ ఆటగాళ్లలో నిరాశ ఆవరించింది. ఔట్‌సైడ్ ఆఫ్‌స్టంప్ దిశగా బంతి వెళుతున్నట్లు కనిపిస్తున్నా..ఫీల్డ్ అంపైర్ నిర్ణయంతో లియాన్ పెవిలియన్ వెళ్లేందుకు సిద్ధపడటం చాలా పెద్ద తప్పు. జట్టు ఖాతాలో రెండు డీఆర్ఎస్ రివ్యూలు ఉన్నప్పటికీ వాటిని వాడుకోకపోవడం వారి మనస్థతత్వాన్ని తెలియచేస్తున్నది. నాన్‌స్ట్రైకింగ్ ఎండ్‌లో ఉన్న మిచెల్ స్టార్క్ కూడా కనీసం కలుగజేసుకోకపోవడం విచిత్రంగా అనిపించింది' అని పాంటింగ్ అన్నాడు.

### ముద్దుల తనయ సమైరాతో..



భారత స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ అపురూప క్షణాలను ఆస్వాదిస్తున్నాడు. రోహిత్ భార్య రితికా సజ్దె ఈ మధ్యే పండంటి పాపకు జన్మనిచ్చింది. తన ముద్దుల తనయకు 'సమైరా' అని పేరు పెట్టినట్లు హిట్‌మ్యాన్ ట్విట్టర్ ద్వారా వెల్లడించాడు. ఈ సందర్భంగా ముగ్గురు కలిసి ఉన్న ఫొటోను అభిమానులతో షేర్ చేసుకున్నాడు.

## హైదరాబాద్‌కు మరో విజయం

**అహ్మదాబాద్:** పీబీఎల్‌లో హైదరాబాద్ హంటర్స్ మరో విజయాన్ని అందుకుంది. ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 4-3తో అహ్మదాబాద్ స్మాషర్స్‌పై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోదిన్ ఇసారా-వోన్ (హైదరాబాద్) 15-14, 15-9తో సిక్కీ రెడ్డి-రాంకిరెడ్డి (అహ్మదాబాద్)పై గెలువగా, పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో డారెన్ లీయు (అహ్మదాబాద్) 15-13, 15-9తో రోహిత్ యాదవ్ (హైదరాబాద్)ను ఓడించాడు. మరో సింగిల్స్‌లోనూ అక్సల్‌సెన్ (అహ్మదాబాద్) 15-11, 13-15, 15-8తో కాలిజోవ్ (హైదరాబాద్)పై నెగ్గడంతో అహ్మదాబాద్ 3-1 ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో స్టార్ ప్లేయర్ పీవీ సింధు ట్రంప్ మ్యాచ్‌లో 15-14, 12-15, 15-14తో గ్లిమోర్ (అహ్మదాబాద్)ను ఓడించి స్కోరును 3-3తో సమం చేసింది. ఆఖరి మ్యాచ్‌లో ఇసారా-రంగ్ 15-10, 11-15, 15-14తో రెజినాల్డ్-రాంకిరెడ్డిపై గెలిచారు.

మరో మ్యాచ్‌లో పుణె 7 ఏసెస్ 6-0తో ఢిల్లీ డాషర్స్‌పై గెలిచింది. తద్వారా సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. ప్రస్తుతం పుణె 17 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. మిక్స్‌డ్ డబుల్స్ ట్రంప్‌లో ఇవనోవ్-జార్స్‌ఫెల్ట్ (పుణె) 15-9, 14-15, 15-8తో జోంగ్జిత్-కొట్స్‌కేయా (ఢిల్లీ)పై గెలువగా, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ (పుణె) 15-12, 15-11తో చిరాగ్‌సేన్ (ఢిల్లీ)ని ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో కరోలినా మారిన్ (పుణె) 15-5, 15-6తో కొట్స్‌కేయాపై అలవోకగా నెగ్గింది.

## దక్షిణాఫ్రికాదే రెండో టెస్ట్

**పాకిస్థాన్‌పై ఘన విజయం**



ఎల్గర్ (24★)

**కేప్‌టౌన్:** సొంతగడ్డపై దక్షిణాఫ్రికాకు ఎదురులేకుండా పోయింది. పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. సొంత ఇలాఖాలో సఫారీలకు టెస్ట్‌ల్లో ఇది వరుసగా ఏడో సిరీస్ విజయం కావడం విశేషం. పాక్ నిర్దేశించిన 41 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 9.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 43 పరుగులు చేసింది. గాయపడ్డ రెగ్యులర్ ఓపెనర్ మర్క్రామ్‌కు బదులుగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన డీ బ్రూయిన్(4) ఆదిలోనే ఔటయ్యాడు. మహ్మద్ అబ్బాస్ (1/14) బౌలింగ్‌లో కీపర్ సర్ఫరాజ్ అహ్మద్ క్యాచ్‌తో తొలి వికెట్‌గా నిష్క్రమించాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన సీనియర్ బ్యాట్స్‌మన్ హషీమ్ ఆమ్లా రెండు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. మహ్మద్ ఆమిర్ బౌలింగ్‌లో బంతి మోచేతికి బలంగా తాకడంతో ఆమ్లా మైదానాన్ని వీడాడు. డీన్ ఎల్గర్(24 నాటౌట్), కెప్టెన్ డుప్లెసిస్(3 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు.

**డు ప్లెసిస్‌పై ఓ మ్యాచ్ సస్పెన్షన్**

స్లో ఓవర్ రేట్ కారణంగా దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్‌పై ఓ మ్యాచ్ సస్పెన్షన్ వేటు పడింది. అలాగే జట్టు మొత్తానికి మ్యాచ్ ఫీజులో కోత పడింది. పాక్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో మూడు రోజుల పాటు నిర్ణీత సమయంలో వేయాల్సిన ఓవర్లను సఫారీ బౌలర్లు వేయకపోవడంతో అర్ధగంట పాటు ఆటను పొడిగించారు. ఓవరాల్‌గా ఒక్క ఓవర్ తక్కువగా వేయడంతో కెప్టెన్‌పై సస్పెన్షన్ వేటు తప్పలేదు.

## సునీల్ డబుల్

**4-1 తేడాతో థాయ్‌లాండ్‌పై భారత్ భారీ విజయం**
**ఆసియాకప్ ఫుట్‌బాల్**

**అబుదాబి:** ఆసియాకప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం థాయ్‌లాండ్‌తో జరిగిన గ్రూపు-ఏ మ్యాచ్‌లో భారత్ 4-1తో భారీ విజయం సాధించింది. 1964 తర్వాత ఆసియాకప్‌లో టీమ్‌ఇండియా చారిత్రక విజయాన్నందుకుంది. స్టార్ స్ట్రైకర్ సునీల్ ఛెత్రి(27ని, 46ని) డబుల్ గోల్స్‌తో జట్టు విజయంలో కీలక భూమిక పోషించగా, అనిరుధ్ థాపా(68ని), జెజె లాల్‌పెకులా(80ని) చెరో గోల్ చేశారు. థాయ్‌లాండ్ తరపున కెప్టెన్ తీరాసిల్ దంగ్డా(33ని) ఏకైక గోల్‌చేశాడు. తమ(97 ర్యాంక్) కంటే ఎక్కువ ర్యాంక్(118)లో ఉన్న థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌లో ఎలాగైనా గెలువాలన్న పట్టుదలతో భారత్ బరిలోకి దిగింది. అయితే మ్యాచ్ ప్రథమార్ధంలో థాయ్‌లాండ్ బంతిని 70 శాతం తమ ఆధీనంలోనే ఉంచుకుని ప్రత్యర్థిపై ఒత్తిడిపెంచే ప్రయత్నం చేసింది. మ్యాచ్ 27వ నిమిషంలో అషీకి కురునియన్ కొట్టిన షాట్ థాయ్ డిఫెండర్ తీరథాన్ బున్మాథాన్ చేతికి తగలడంతో భారత్‌కు పెనాల్టీకి దక్కింది. ఈ అవకాశాన్ని సునీల్ ఏ మాత్రం తడబాటుకు లోనుకాకుండా గోల్ చేయడంతో టీమ్‌ఇండియా 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఆరు నిమిషాల వ్యవధిలోనే థాయ్ కెప్టెన్ ఫీల్డ్‌గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. భారత్ డిఫెన్స్‌లోని లోపాలను అనుకూలంగా మలుచుకుంటూ హెడర్ గోల్‌తో థాయ్ ఖాతా తెరిచింది. 1-1తో ద్వితీయార్ధంలోకి ప్రవేశించిన ఇరు జట్లు మరింత దూకుడు పెంచాయి. ముఖ్యంగా భారత్ అనూహ్యంగా పుంజుకున్నది. ప్రత్యర్థి ఊహకు అందకుండా మెరుపు గోల్స్‌తో విరుచుకుపడింది. ఆట మొదలైన మొదటి నిమిషంలోనే రైట్‌ఫ్లాంక్‌లో ఉదాంత సింగ్ అందించిన పాస్‌ను సునీల్ సూపర్ గోల్‌గా మలిచాడు. ఇక్కణ్నుంచి ఏ మాత్రం జోరును తగ్గించని భారత్‌కు 68వ నిమిసంలో అనిరుధ్ థాపా..థాయ్ డిఫెండర్లను ఏమారుస్తూ గోల్ చేశాడు. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా జెజె లాల్‌ఫెకులా..నర్జారీ పాస్‌ను గోల్ చేసి భారత్‌ను సంబురాల్లో నింపాడు.



**గోల్స్ టాపర్స్**

| | |
|---|---|
| రొనాల్డో(పోర్చుగల్) | 85 |
| సునీల్ ఛెత్రి(భారత్) | 67 |
| మెస్సీ(అర్జెంటీనా) | 65 |

## సింగరేణి బొగ్గు ఉత్పత్తి 45 మిలియన్ టన్నులు

■ ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో ఉత్పత్తి చేసిన సంస్థ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బొగ్గు సంస్థ సింగరేణి ఉత్పత్తిని గణనీయంగా పెంచుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసి(ఏప్రిల్-డిసెంబర్) కాలంలో 45.57 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. నిర్దేశించుకున్న లక్ష్యాని కంటే 2.24 మిలియన్ టన్నులు తక్కువగా ఉత్పత్తి చేసింది. ఈ తొమ్మిది నెలలకాలంలో 47.51 మిలియన్ టన్నుల ఉత్పత్తిని కంపెనీ గతంలో లక్ష్యంగా పెట్టుకుంది. అంత క్రితం ఏడాది ఇదే సమయంలో ఉత్పత్తి చేసిన 41.99 మిలియన్ టన్నులతో పోలిస్తే మాత్రం గణనీయంగా పెంచుకున్నది. గత నవంబర్, డిసెంబర్ నెలల్లో వరుసగా 5.67 మిలియన్ టన్నులు, 6.04 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేసింది. 49.11 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ..దీంట్లో 49.06 మిలియన్ టన్నులను సరఫరా చేసింది. మరోవైపు, దేశంలో బొగ్గు కొరత లేదని, 2014లో 217 మిలియన్ టన్నులు దిగుమతి కాగా, ప్రస్తుతం ఇది 208 మిలియన్ టన్నులకు తగ్గిందని ఇటీవల లోక్‌సభలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 7.4 శాతం బొగ్గు ఉత్పత్తి పెరిగిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థయైన సింగరేణిలో కేంద్రానికి 51 శాతం వాటా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నది.

## దిశను నిర్దేశించే రిజల్ట్స్, రూపీ, క్రూడ్

స్టాక్ మార్కెట్లు గతవారం కూడా తీవ్ర ఒడిదుడుకులతో ట్రేడ్ అయ్యాయి. ప్రధాన సూచీలు ఒక శాతం మేర నష్టాలతో ముగిశాయి. అదే దారిలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు కూడా పతనం అయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 381 పాయింట్లు, నిఫ్టీ 133 పాయింట్లు నష్టపోయాయి. నవంబర్ నెలకు గాను ఎనిమిది కీలక రంగాల వృద్ధిరేటు 3.5 శాతానికి తగ్గిపోవడం, ఎంఎస్ఎంఈల రుణాల పునర్ వ్యవస్థీకరణకు రిజర్వ్‌బ్యాంక్ అనుమతి ఇవ్వడం గత వారం వెలువడిన ప్రధానాంశాలు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ. 4,000 నేరుగా బదిలీ, లక్ష రూపాయల వరకు వడ్డీలేని పంట రుణాలను అందించే పథకాన్ని ప్రవేశ పెట్టవచ్చునన్న వార్తలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపించింది. క్రూడాయిల్, బంగారం ధరలు గత వారం పెరిగాయి.

**ఈ వారం ప్రభావితం చేసే అంశాలు**

వచ్చే వారం మూడో త్రైమాసిక ఫలితాలు వెల్లడి, జీఎస్టీ కౌన్సిల్ సమావేశం, క్రూడాయిల్ ధరల కదలిక, అంతర్జాతీయ పరిణామాలను దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రధానంగా ప్రభావితం చేయనున్నాయి. దేశంలోనే అతి పెద్ద ఐటీ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్‌లు ఈ వారం ఫలితాలను ప్రకటించనున్నాయి. దీనికి తోడు నిఫ్టీ కంపెనీలైన కోటక్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లతోపాటు మరో 12 కంపెనీలు కూడా ఈ వారమే ఫలితాలు విడుదల చేయనున్నాయి. దీంతో ఆర్థిక ఫలితాల్లో గణనీయ వృద్ధి రేటును నమోదు అయితేనే మార్కెట్‌లో మరో విడత ర్యాలీకి అవకాశం ఏర్పడుతుంది. ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగా లేకపోతే మార్కెట్ తీవ్ర హెచ్చుతగ్గులకు గురికానుంది. మరోవైపు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య చర్చలు సోమ, మంగళవారాల్లో జరుగనున్నాయి. సుంకాలు ప్రతీకార సుంకాల కారణంగా రెండు అగ్రదేశాల ఆర్థిక వ్యవస్థలు కుంటు పడిన నేపథ్యంలో ఈ చర్చలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. గురువారం నాడు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరుగనుంది. నిర్మాణంలో ఫ్లాట్స్, గృహాలకు సంబంధించి జీఎస్టీ సవరణను ఈ సమావేశంలో చర్చించనున్నారు. జీఎస్టీ వసూళ్లు తగ్గిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. పారిశ్రామికోత్పత్తి గణాంకాలు, తయారీ రంగ వృద్ధి రేటు కూడా ఈ వారమే వెలువడుతున్నాయి. గత వారం క్రూడాయిల్ ధరల్లో పెరుగుదల, రూపాయి మారకం విలువ తీవ్ర హెచ్చుతగ్గులు జరిగాయి. వచ్చే వారం ఈ రెండింటి కదలికలు మార్కెట్‌ను దిశా నిర్దేశం చేయనున్నాయి. ఈ గణాంకాలు, పరిణామాల నేపథ్యంలో మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోను కానున్నాయి.



**వరుస బేరిష్ సంకేతాలు**

వరుసగా మూడో వారమూ బేరిష్ ప్యాట్రన్ ఏర్పడింది. ఈ వారాంతానికి నిఫ్టీలో బేరిష్ ఎంగల్ఫింగ్ జరిగింది. దీంతో వచ్చే కదలిక కీలకం కానుంది. 200 డీఎంఏకు దిగువన నిఫ్టీ ముగిసింది. 50 డీఎంఏ మద్దతు తీసుకుని శుక్రవారం నాడు లాభంతో ముగిసింది. అయితే ఎగువన 10,985 స్థాయిని గత రెండు నెలలుగా అధిగమించలేకపోతున్నది. అలాగే 10,535 స్థాయిలో గట్ట మద్దతును కలిగి ఉండడంతో పాటు కనీస స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభిస్తున్నది. 10,535 దిగువన మాత్రమే మార్కెట్ బేరిష్‌గా మారనుంది. ఒకవేళ 10,985 స్థాయిని అధిగమించగలిగితే 11,100 స్థాయి వరకూ మార్కెట్ పెరిగే అవకాశం ఉంది. ప్రధాన ఇండికేటర్లు కూడా మార్కెట్లో అనిశ్చితినే సూచిస్తున్నాయి. ఫలితాల నేపథ్యంలో మార్కెట్ నిర్ణయాత్మక కదిలిక దిశగా కదిలే అవకాశాలున్నాయి.

**నిఫ్టీ**
మద్దతు స్థాయిలు : 10,750 - 10, 635 - 10, 535
నిరోధక స్థాయిలు : 10, 880 - 10,985 - 11, 100

## ఆంధ్రాబ్యాంక్‌లో 1,600 మంది బిజినెస్ కరస్పాండెంట్లు

**న్యూఢిల్లీ, జనవరి 6:** ఖాతాలను తెరువడానికి, ఇంటి వద్దకే బ్యాంకింగ్, ఏటీఎం సేవలు అందించడానికి, మొండి బకాయిల రికవరీ కోసం 1,600 మంది బిజినెస్ కరస్పాండెంట్లను నియమించుకోనున్నట్లు ఆంధ్రాబ్యాంక్ ప్రకటించింది. వీరిలో తెలంగాణకోసం 695 మంది, ఆంధ్రప్రదేశ్‌కోసం 922 మందిని మార్చి చివరి నాటికి నియమించుకోనున్నది. పదవీ విరమణ చేసిన బ్యాంకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కిరాణా దుకాణాదారులు, ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వహిస్తున్న డీలర్లు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కనీసంగా 20 ఏండ్లు, గరిష్ఠంగా 40 ఏండ్ల లోపు వయస్సు కలిగిన వారికి ప్రాధాన్యతనిస్తున్నది బ్యాంక్.

# ఏటీఎంలు ఎండిపోతున్నాయ్

■ ద్రవ్య కొరతను రానివ్వకండి
■ నగదు నిండేలా చర్యలు తీసుకోండి
■ ఆర్బీఐకి సూచించిన పార్లమెంటరీ ప్యానెల్




**న్యూఢిల్లీ, జనవరి 6:** దేశవ్యాప్తంగా నగదు లేకుండా దర్శనమిస్తున్న ఏటీఎంలపై పార్లమెంటరీ ప్యానెల్ స్పందించింది. ఈ సమస్యను పరిష్కరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు సూచించింది. ఈ పరిస్థితి ద్రవ్య కొరతకు దారి తీయవద్దన్న కమిటీ.. నగదు నిండుగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అలాగే తగినన్ని ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురావాలని బ్యాంకులనూ కోరింది. ఔట్ ఆఫ్ సర్వీస్ ఏటీఎంలనూ బాగుచేయాలన్న కమిటీ.. బ్యాంకుల ద్వారా జన్ ధన్ ఖాతాలు పెద్ద ఎత్తున తెరుచుకున్నాయని, ఆ కస్టమర్లకు సరిపడా ఏటీఎంలు లేకుండా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన ఈ స్టాండింగ్ కమిటీ గత వారం పార్లమెంట్‌లో తమ నివేదికను ప్రవేశపెట్టింది. ఆర్బీఐ గణాంకాల ప్రకారం గతేడాది సెప్టెంబర్ నాటికి దేశంలో 2,21,492 ఏటీఎంలున్నాయి. ఇందులో 1,43,844 ఏటీఎంలు ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందినవైతే, 59,645 ఏటీఎంలు ప్రైవేట్ రంగ బ్యాంకులవి, 18,003 విదేశీ బ్యాంకులు, పేమెంట్స్ బ్యాంకులు, చిన్నతరహా ఆర్థిక బ్యాంకులతోపాటు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు చెందిన, నిర్వహిస్తున్న వైట్ లేబుల్ ఏటీఎంలున్నాయి. కాగా, డిజిటల్ లావాదేవీలు తగ్గుముఖం పట్టి, తిరిగి సంప్రదాయ నగదు లావాదేవీలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డ పార్లమెంటరీ కమిటీ.. ఏటీఎంలలో నగదు లభ్యత లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నది. గ్రామీణ, తృతీయ, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఏటీఎంలు చాలావరకు 'నో క్యాష్' బోర్డులతో కనిపిస్తున్నాయన్నది. ఈ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత ఎం వీరప్ప మొయిలీ నాయకత్వం వహిస్తున్నారు.

**కొత్త నియామకాలు చేపట్టండి**

పదవీ విరమణలతో ఖాళీ అవుతున్న స్థానాలను కొత్త నియామకాలతో భర్తీ చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు పార్లమెంటరీ ప్యానెల్ సూచించింది. సమీప భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగులు రిటైర్ కానుండటంతో జూనియర్, మధ్య స్థాయిల్లోని వారితో ఆ లోటును పూడ్చుకోవాలన్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని 95 శాతం జీఎం స్థాయి ఉద్యోగులు, 75 శాతం డిప్యూటీ జీఎం స్థాయి ఉద్యోగులు, 58 శాతం అదనపు జీఎం స్థాయి ఉద్యోగులు పదవీ విరమణ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో బ్యాంకింగ్ సిబ్బంది ఎంపిక ఇనిస్టిట్యూట్ వివరాల ప్రకారం క్లరికల్, ప్రొబేషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ స్థాయిల్లో ఉద్యోగుల సంఖ్య పడిపోతున్నదన్న కమిటీ.. ఎక్కువ పని గంటలు, ఒత్తిడితో కూడిన విధులు, తక్కువ వేతనాలు వంటివి బ్యాంకింగ్ రంగ ఉద్యోగార్థులకు నిరుత్సాహకరంగా ఉన్నాయని పేర్కొన్నది. కాబట్టి ఈ అంశాలపై దృష్టి సారించి సమస్యను అధిగమిస్తే బాగుంటుందని సూచించింది.

### మరో 69 విదేశీ కార్యాలయాలు మూత!

**ప్రభుత్వరంగ బ్యాంకుల యోచన**

ప్రభుత్వరంగ బ్యాంకులు మరో కీలక నిర్ణయం తీసుకున్నాయి. విదేశాల్లో ఉన్న శాఖల ద్వారా అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలో నేపథ్యంలో ఇప్పటికే పలు బ్యాంకులు శాఖలను మూసివేయగా..తాజాగా మరో 69 శాఖలను మూసివేయడానికి సిద్ధమయ్యాయి ప్రధాన బ్యాంకులు. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా వచ్చే కొన్ని నెలల్లో ఈ శాఖలకు తాళం వేయనున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే 35 బ్రాంచ్‌లను మూసివేసిన బ్యాంకులు..మరో 69ని మూసివేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. విదేశాల్లో శాఖలను నిర్వహించడం చాలా ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ అని, అలాగే పలు శాఖలు ఉన్న ఒకే నగరంలో వీటిని కుదించాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. జనవరి 31, 2018 నాటికి 165 విదేశాల్లో శాఖలు నిర్వహిస్తున్నాయి ప్రభుత్వరంగ బ్యాంకులు. వీటిలో అత్యధికంగా ఎస్‌బీఐ 52 శాఖలను ఏర్పాటు చేయగా, బ్యాంక్ ఆఫ్ బరోడా 50, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 29లు ఉన్నాయి. దేశాల విషయానికి వస్తే బ్రిటన్‌లో 32 శాఖలను ఏర్పాటు చేసిన పీఎస్‌బీలు..హాంకాంగ్, అరబ్ దేశాల్లో 13 చొప్పున, సింగపూర్‌లో 12లు నిర్వహిస్తున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 41 శాఖలు మూతపడ్డాయి. వీటిలో ఎస్‌బీఐ తొమ్మిదింటిని మూసివేయగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎనిమిది, బ్యాంక్ ఆఫ్ బరోడా ఏడు శాఖలకు తాళం వేశాయి.

# ఫలితాల సీజన్‌కు పకడ్బందీ వ్యూహం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలు ఈ వారం నుంచి మొదలై మరో నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ ఫలితాలే మార్కెట్ దిశను నిర్దేశించనున్నాయి. మార్కెట్ అంచనాల కన్నా మెరుగ్గా ఫలితాలు ఉంటే ఆయా కంపెనీల షేర్ల ధరలు అమాంతం పెరుగుతాయి. అయితే ఏమాత్రం అంచనాలను అందుకోలేకపోయినా సరే అమ్మకాల ఒత్తిడికిలోనై పాతాళానికి పతనం అవుతాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక ఫలితాల సమయాల్లో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకునేందుకు ఇన్వెస్టర్లు గమనించాల్సిన అంశాలేమిటో చూద్దాం.

**1** అమ్మకాలు, ఈపీఎస్‌లను గమనించండి. వీటి వృద్ధి రేటు కనీసం 20 నుంచి 25 శాతం ఉన్నాయో లేదో చూడండి. ఒకవేళ అంత కన్నా ఎక్కువ వృద్ధి రేటును సాధించినట్టయితే కంపెనీ ఉత్పత్తులు లేదా సేవలు హాట్‌కేకుల్లా అమ్ముడు పోతున్నాయని అర్థం. ఈ రెండు అంశాలను జాగ్రత్తగా గమనించండి.

**ఫలితాల సీజన్‌లో వ్యూహం ఎలా?**

ఆర్థిక ఫలితాల సీజన్‌లో ఫలితాలు వెల్లడిస్తున్న షేర్లను కొనుగోలు చేయడం చాలా ట్రిక్కీగా ఉంటుంది. మొదట మనకు ఆ కంపెనీ ఆర్థిక ఫలితాలను మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ప్రకటిస్తుందో లేదో తెలియదు. అలాగే ఫలితాల తర్వాత మార్కెట్ ఆ కంపెనీ షేరు ఎలా స్పందిస్తుందో కూడా అంచనా వేయలేం. అందుకే ఒక వారం పాటు ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్న కంపెనీల జోలికి వెళ్లకపోవడమే మంచిది. మీరు కొనాలనుకున్న షేర్లకు సంబంధించిన వ్యూహం ఎలాంటి ఊహాగానాలకు తావులేకుండా ఉండాలి. మీరు కొన్న షేర్ల ధరలు మీ అంచనాలకు వ్యతిరేకంగా కదలుతుంటే అందుకు మీరు సిద్ధంగా ఉండాలి. అలాంటి సందర్భాలలో ఒడిదుడుకుల ప్రభావానికి మీరు లోనవుతారు. ఏమాత్రం రిస్క్‌ను మీరు ఊహించినా సరే అలాంటి షేర్లకు దూరంగా ఉండండి. మార్కెట్ అంచనాలకు తగ్గట్టుగా ఫలితాలు లేకపోతే చాలా వేగంగా అవి పతనం అవుతాయి. అందుకు అనేక ఉదాహరణలు మార్కెట్‌లో ప్రతి త్రైమాసిక ఫలితాల సందర్భంగా ఎదురువుతున్న అనుభవాలే సాక్ష్యం.

**2** ఒక్కసారి చూపించే వృద్ధి రేటు కన్నా గత మూడు త్రైమాసికాలుగా అమ్మకాలు, ఈపీఎస్‌లు క్రమంగా, స్థిరంగా పెరుగుతున్నాయో లేదో చూడండి. ఇలా వరుసగా వృద్ధిరేటును సాధిస్తున్న కంపెనీలు మిగతా కంపెనీల కన్నా పటిష్టమైనవై ఉంటాయి.

**3** అలాగే కంపెనీ లాభాల పెరుగుదల వేగాన్ని గమనించండి. లాభాల పెరుగుదల వేగాన్ని పెంచుకుంటున్న కంపెనీల షేర్ల ధరలు ఆకాశానికి ఎగుస్తాయని గత చరిత్ర చెబుతున్నది.

**ఎంత వృద్ధి రేటు బెస్ట్**

మా కంపెనీ ఈ త్రైమాసికంలో రికార్డు అమ్మకాలను సాధించింది. గత త్రైమాసికంతో పోల్చితే 20 శాతం అధికంగా అమ్మకాలను సాధించాం. ఇలాంటి ప్రకటనను మీ పోర్టుఫోలియో ఉన్న కంపెనీ నుంచి వచ్చిందంటే అంతకన్నా మంచి విషయం మరొకటి లేదు. కానీ, అదే ఈ త్రైమాసికంలో కొన్ని అసమర్థతల కారణంగా, నిర్వహణ లోపాల కారణంగా అమ్మకాల్లో క్షీణత నమోదు అయింది. పోటీ వాతావరణం మా అమ్మకాలను ప్రభావితం చేశాయి. అనే ప్రకటనలు కంపెనీల నుంచి వస్తున్నాయంటే వాటి షేర్లకు పూర్తిగా దూరంగా ఉండండి. ఒకవేల రికార్డు స్థాయి రాబడులను కంపెనీలు ప్రకటించినా సరే కొన్ని అంశాలను నిశితంగా పరిశీలించాలి. ఉదాహరణకు ఈపీఎస్ కేవలం 5 శాతమే పెరిగి, అమ్మకాలు 20 శాతం పెరుగుదలను నమోదు చేస్తే లాభాలు ఎందుకు తక్కువగా నమోదు అయ్యాయో పరిశీలించాలి. అందులో ఏదో మర్మం ఉందని అర్థం. లాభాల మార్జిన్లు తగ్గిపోయి ఉండవచ్చు. ఇలాంటి షేర్ల విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండడం మేలు. అలాగే అమ్మకాలు 10 శాతం పెరిగి లాభాలు మాత్రం 20 శాతం పెరిగితే. చూడడానికి బాగానే ఉంది. కానీ అందుకు కారణాలేమిటో తెలుసుకోవాలి. కంపెనీ కొత్తగా షేర్లను జారీ చేస్తే ఇలాంటి సందర్భాలు ఎదురవుతాయి. అలా జరగకపోయి ఉంటే కూడా ఏదో మతలబు ఉన్నట్టు లెక్క.

**4** ప్రస్తుత త్రైమాసిక ఫలితాలను గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసిక ఫలితాలతో పోల్చి చూడండి. దీని వల్ల సీజన్‌లో ఉత్పత్తుల ప్రభావం ఎంతో తెలిసిపోతుంది.

**5** ఆర్థిక ఫలితాలు ప్రకటించడానికి వారం ముందు నుంచే ఆ షేర్ల జోలికి వెళ్లకపోవడం మంచిది. ఫలితాల సమయంలో ఉండే ఒడిదుడుకులు చాలా సందర్భాల్లో మీకు ఇబ్బందిని కలిగించవచ్చు. ఫలితాల తర్వాత వచ్చే కదలిక స్థిరపడిన తర్వాత ఆ షేరు కొనుగోలు చేయవచ్చు.

## 'పన్ను వసూళ్లు బాగా లేవు'

**న్యూఢిల్లీ, జనవరి 6:** ప్రత్యక్ష పన్ను వసూళ్లలో వృద్ధిరేటు మందగించిన నేపథ్యంలో పన్ను ఎగవేతదారులపై దృష్టి పెట్టాలని ఆదాయం పన్ను (ఐటీ) శాఖ అధికారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ సుశీల్ చంద్ర సూచించారు. ఉద్దేశపూర్వకంగా పన్నులను ఎగ్గొడుతున్న వారిపై కోర్టుల్లో కేసులు నమోదు చేయాలని, అలాగే ఇతరత్రా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు ఐటీ శాఖలోని ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్లందరికి సుశీల్ చంద్ర లేఖలు రాశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) ఈ మార్చి 31తో ముగుస్తున్నందున ఐటీ అధికారులు పరుగులు పెట్టాలని పేర్కొన్నారు. రెగ్యులర్ అసెస్‌మెంట్ ట్యాక్స్ కింద నిరుడు వసూళ్లలో 15.6 శాతం వృద్ధి నమోదైందన్న ఆయన.. ఈసారి కేవలం 1.1 శాతానికే పరిమితమైందని తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. చాలా ప్రాంతాల్లో వృద్ధిరేటు పతనమైందని, ఇది ఆందోళనకర అంశమన్న ఆయన బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని సదరు అధికారులకు సూచించారు. ఇక గత నెల డిసెంబర్ 31 నాటికి ప్రత్యక్ష పన్ను వసూళ్లలో వృద్ధిరేటు 13.6 శాతంగానే ఉందని, లక్ష్యం మాత్రం 14.7 శాతమని గుర్తుచేశారు. కాగా, స్థూల వసూళ్లు కొద్దిగా నయమని 14.1 శాతం వృద్ధిని కనబరుస్తున్నాయని చెప్పిన ఆయన అయినప్పటికీ బడ్జెట్ అంచనా రూ.11,50,000 కోట్లను అందుకోలేని వివరించారు.

## నేటి నుంచి చమురు బావుల వేలం

■ 14 బావులను గుర్తించిన కేంద్రం

**న్యూఢిల్లీ, జనవరి 6:** దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచడానికి, దిగుమతులను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మరోదఫా చమురు బావుల వేలానికి సిద్ధమైంది. సోమవారం ప్రారంభమవనున్న ఈవేలం కోసం 14 బావులను సిద్ధంగా ఉంచింది. 29,333 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ బావుల వేలాన్ని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రారంభించనున్నట్లు తెలుస్తున్నది. ఈ బావుల వేలం క్రితం నెలలో నిర్వహించాల్సి ఉండగా, వివిధ కారణాలతో వాయిదాపడింది. భారత్‌లో చమురు బావులను ఏర్పాటు చేయాలని జూలై 2017లో కంపెనీలకు ఆహ్వానం పలికింది కేంద్ర ప్రభుత్వం. ఇందుకోసం 28 లక్షల చదరపు కిలోమీటర్ల మేర స్థలంలో చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నట్లు గుర్తించింది. ఈ నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతియేటా రెండుసార్లు వేలం నిర్వహించాల్సి ఉంటుంది. మొదటి విడుత మే 15న, రెండో విడుత నవంబర్ 15లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ వివిధ కారణాల వల్ల నెల రోజుల పాటు వాయిదా పడిన ఈ బావుల వేలం సోమవారం నుంచి నిర్వహిస్తున్నది కేంద్రం. వేలం వేసే వాటిలో కృష్ణా గోదావరి బేసిన్‌లోని ఐదు బావులు ఉండగా, అండమాన్, కచ్‌లలో రెండేసి బావులు, మహానంది బేసిన్‌లో ఒక్క బావి ఉన్నాయి. వీటితోపాటు ఎనిమిది ఆన్‌లాండ్ బ్లాక్‌లను విక్రయిస్తున్నది. వీటిలో మహానంది బేసిన్‌లో నాలుగు ఉండగా, క్యాంబీలో రెండు, రాజస్థాన్, కావేరిలో ఒక్కోటి ఉన్నాయి. ఈ 14 బ్లాక్‌లలో 12,609 మిలియన్ టన్నుల చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చమురు మంత్రిత్వ శాఖ గుర్తించింది.

# ప్రైవేట్ లేబుల్స్ అమ్మకాలొద్దు



■ ఈ-కామర్స్ సంస్థలకు ఆ అవకాశం ఇవ్వొద్దు
■ డీఐపీపీని కోరిన ట్రేడర్ల సమాఖ్య

**న్యూఢిల్లీ, జనవరి 6:** ఈ-కామర్స్ సంస్థల సైట్లపై ప్రైవేట్ లేబుల్స్ అమ్మకాలకు అనుమతి ఇవ్వొద్దని పారిశ్రామిక విధాన ప్రోత్సాహక శాఖ (డీఐపీపీ)ను అఖిల భారత వర్తకదారుల సమాఖ్య (సీఏఐటీ) ఆదివారం కోరింది. ఈ మేరకు డీఐపీపీ కార్యదర్శి రమేశ్ అభిషేక్‌కు సీఏఐటీ ఓ లేఖ రాసింది. ఓ సంస్థ బ్రాండ్ కింద మరో సంస్థ తయారుచేసిన ఉత్పత్తులనే ప్రైవేట్ లేబుల్స్ అంటారు. ప్రైవేట్ లేబుల్స్ ఉత్పత్తులు, సేవలు సహజంగా తక్కువ ధరలకు లభిస్తాయి. ప్రముఖ సంస్థలకు చెందిన ఈ తరహా ఉత్పత్తులు, సేవల విలువ కంటే ప్రైవేట్ లేబుల్స్ ప్రోడక్ట్స్, సర్వీసులు చౌకగా అందుబాటులో ఉంటాయి. దీంతో వినియోగదారులు వీటి కొనుగోళ్లకే ఆసక్తి కనబరుస్తున్నారు. గడిచిన కొన్నేండ్ల నుంచే ఈ-కామర్స్ సంస్థలు దుస్తులు, గృహాలంకరణ, గ్రాసరీ వంటి ఉత్పత్తుల్లో ప్రైవేట్ లేబుల్స్‌ను మార్కెట్‌కు పరిచయం చేసేశాయి. ఫలితంగా పెద్దపెద్ద సంస్థల అమ్మకాలు ప్రభావితమయ్యాయని సీఏఐటీ గుర్తుచేసింది. మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని ప్రైవేట్ లేబుల్స్ చంపేస్తున్నాయని చెప్పింది. ప్రభుత్వ ఖజానాకూ ఇది తీవ్ర దెబ్బేనని, పెట్టుబడులకూ భంగకరమని వ్యాఖ్యానించింది.

**ఫిబ్రవరి 1 నుంచే అమలవ్వాలి..**

ఈ-కామర్స్ రంగం కోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పాలసీలో చేసిన మార్పుల అమలుకు నిర్దేశించిన గడువును పొడిగించవద్దని కూడా సీఏఐటీ విజ్ఞప్తి చేసింది. వచ్చే నెల 1 నుంచి ప్రతిపాదిత సవరణలు అమల్లోకి వస్తాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని విదేశీ బహుళజాతి సంస్థలు అమలు తేదీని 4-5 నెలలు పొడిగించాలని కోరుతున్న నేపథ్యంలో అలాంటి నిర్ణయం తీసుకోవద్దని లేఖలో కోరింది. విధానపరమైన నిర్ణయాల్లోగల లోపాలను అడ్డం పెట్టుకుని ఈ-కామర్స్ కంపెనీలు అక్రమాలకు తెరతీయాలని ప్రయత్నిస్తున్నట్లు సీఏఐటీ ఈ సందర్భంగా ఆరోపించింది. తద్వారా చిరు వ్యాపారుల ఉనికే ప్రమాదంలో పడిపోయే వీలుందని ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు శరవేగంగా విస్తరిస్తున్న ఈ-కామర్స్ పరిశ్రమకు ఊతమిచ్చేలా దేశ, విదేశీ సంస్థలకు ఒకే రకమైన నియమ నిబంధనలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉన్నదని రిసెర్చ్, అడ్వోకసి సంస్థ సీయూటీఎస్ ఇంటర్నేషనల్ అభిప్రాయపడింది.



టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆదివారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని స్వాగత్‌గ్రాండ్‌లో జరిగిన సీనియర్ జర్నలిస్ట్ తెలకపల్లి రవి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం.



ఆదివారం హైదరాబాద్‌లో టీఆర్ఎస్ డెన్మార్క్ శాఖ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కవిత. చిత్రంలో డెన్మార్క్ శాఖ అధ్యక్షుడు శ్యాంబాబు ఆకుల, ప్రధాన కార్యదర్శి కలకుంట్ల ప్రసాద్‌రావు, కమల్ కృష్ణ తదితరులు ఉన్నారు.




## అన్నివర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ విజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమంకోసం సీఎం కేసీఆర్ ప్రత్యేకవిజన్‌తో పనిచేస్తున్నారని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ చెప్పారు. ఆల్ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం నాంపల్లిలోని టీఎన్జీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. సద్గురు సచ్చిదానందసరస్వతి స్వామిజీ పాల్గొని ఆశీస్సులు అందించారు. దేవీప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గచ్చిబౌలిలో ఐదెకరాల స్థలం, కోటి రూపాయలు కేటాయించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, అసోసియేషన్ నాయకులు చంద్రమౌళి, సుధాకర్, విజయలక్ష్మి, రాధాకృష్ణమూర్తి, వసంతరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.



## విద్యుదాఘాతానికి ముగ్గురు మృతి

**ముగ్గురికి గాయాలు ■ మంచిర్యాల జిల్లా ముల్కలపేటలో ఘటన**



భీంరావు(ఫైల్)



రామన్న (ఫైల్)



సురేందర్ (ఫైల్)

**వేమనపల్లి:** మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం ముల్కలపేటలో ఆదివారం ముగ్గురువ్యక్తులు విద్యుదాఘాతానికి ప్రాణాలు వదలగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కలపేట గ్రామ శివారులోని పంట పొలాల్లో త్రీఫేజ్ కరెంటులైన్ ఏర్పాటు కోసం ఆరునెలల క్రితం రైతులు వెంకటస్వామి, పున్నం డీడీలు కట్టగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది. కానీ విద్యుత్ అధికారులు కనెక్షన్ ఇవ్వలేదు. డీడీలు కట్టినా ఎందుకు కనెక్షన్ ఇవ్వడం లేదని విద్యుత్ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు పనులను కాంట్రాక్టర్‌కు అప్పజెప్పగా.. అతడు ఓ విద్యుత్ దినసరి కూలీ భీంరావును విద్యుత్‌స్తంభం ఏర్పాటుచేయడానికి పంపించాడు. దీంతో పంటపొలాల్లో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్‌స్తంభానికి కేవీ విద్యుత్‌వైర్లు తగలి స్తంభాన్ని పట్టుకున్న రైతులు రామన్న(60), సురేందర్(25), విద్యుత్‌కూలి భీంరావు(22) అక్కడికక్కడే మృతిచెందారు. అలాగే తాళ్లు పట్టుకున్న బోరుకుంటి పరదేశి, జంబోజు వెంకటేశం, పున్నంలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# రిజిస్ట్రేషన్ల రాబడిలో 30 శాతం వృద్ధి

**అంచనాలను మించి రిజిస్ట్రేషన్ ఆదాయం**

**రూ.1,500 కోట్ల ఆదాయంతో రంగారెడ్డి జిల్లా ఫస్ట్**

**మేడ్చల్‌లో రూ.933 కోట్లు.. హైదరాబాద్‌లో రూ.612 కోట్లు రాబడి**



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో స్థిరాస్తి లావాదేవీలు అంచనాలకు మించి పెరుగుతున్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం నెలనెలకు భారీగా పెరుగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నెలాఖరుకు రూ.4,700 కోట్లు ఆదాయం సమకూరింది. గత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ చివరికల్లా రూ.3,600కోట్ల ఆదాయం లభించింది. ప్రస్తుతం కేవలం దస్తావేజుల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.4,221 కోట్ల రాబడి రాగా.. గత ఆర్థిక సంవత్సరంలో రూ.3,376కోట్లు సమకూరింది. 2017-18 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.1,100 కోట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.845 కోట్ల రాబడి ఎక్కువగా వచ్చింది. అంటే ఈసారి 30 శాతం వరకు వృద్ధిరేటు నమోదైనది. 2017-18లో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయం రూ.మూడు వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా.. అది కాస్తా రూ.నాలుగు వేల కోట్లను దాటి రికార్డుగా నిలిచింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.ఐదు వేల కోట్ల రాబడి వస్తుందని బడ్జెట్‌లో అంచనావేయగా కేవలం తొమ్మిది నెలల్లోనే నిర్దేశిత లక్ష్యంలో 85 శాతం ఆదాయం వచ్చింది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, హైదరాబాద్ జిల్లాల్లో అధిక సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి. 2017-18లో రాష్ట్రం మొత్తంమీద 11.50 లక్షల డాక్యుమెంట్లు రిజిస్టరయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నెలాఖరుకు 8,15,640 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదే సమయానికి 10.86 లక్షల వరకు రిజిస్టరయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా రూ.1,500 కోట్ల రాబడి సమకూరగా.. రూ.933 కోట్లతో రెండో స్థానంలో మేడ్చల్, రూ.612 కోట్లతో మూడవ స్థానంలో హైదరాబాద్ నిలిచాయి. మెదక్ జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పుంజుకొన్నది. దాదాపు రూ.360 కోట్ల రాబడి సాధించి మెదక్ జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది.

**జిల్లాలవారీగా రిజిస్ట్రేషన్ రాబడి వివరాలు**

| రిజిస్ట్రేషన్ జిల్లా | 2017-18 రూ. కోట్లలో | 2018 డిసెంబర్ నాటికి |
|---|---|---|
| రంగారెడ్డి | 1,222 | 1,500 |
| మేడ్చల్-మల్కాజిగిరి | 711 | 933 |
| హైదరాబాద్ (దక్షిణ) | 348 | 390 |
| హైదరాబాద్ | 180 | 222 |
| మెదక్ | 287 | 360 |
| నిజామాబాద్ | 56 | 73 |
| కరీంనగర్ | 99 | 139 |
| వరంగల్ | 114 | 155 |
| మహబూబ్‌నగర్ | 74 | 110 |
| నల్లగొండ | 153 | 206 |
| ఖమ్మం | 62 | 82 |
| ఆదిలాబాద్ | 40 | 51 |
| మొత్తం రాబడి | 3,376 | 4,221 |

# సరిహద్దుల్లో పెద్దపులుల వేటగాళ్లు

- ఇచ్చోడ ఘటనతో అప్రమత్తమైన అటవీశాఖ
- తెలంగాణలోకి వలసవెళుతున్న పులులపై వేటగాళ్ల కన్ను
- ఎన్టీసీఏ హెచ్చరికలతో నిఘా కట్టుదిట్టం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని ఇచ్చోడ వద్ద స్వాధీనం చేసుకున్న పెద్దపులి చర్మం కవ్వాల్‌లోని పెద్దపులిదేనని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. 2017లో కెమెరా ట్రాప్‌లో కనిపించిన పులి చర్మంతో.. నిందితుల వద్ద లభించిన చర్మం పోలి ఉన్నదని పేర్కొన్నారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్‌వైర్లకు చిక్కి పులి బలైనట్టు, ఆ తరువాత చర్మం ఒలిచినట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్టు తెలిసింది. ఇంద్రవెల్లి మండలం గౌరాపూర్‌కి చెందిన ఇంగె కిషన్, వరంగల్, నిర్మల్, సికింద్రాబాద్‌కు చెందిన సతీశ్, ప్రకాశ్, రాజేందర్‌కుమార్‌లు పెద్దపులి చర్మంతో పట్టుబడిన విషయం తెలిసిందే. వీరిని వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, అటవీశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ సరిహద్దుల్లో పెద్దపులుల వేటగాళ్ల కదలికలు ఉన్నట్టు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ).. వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరోను ఇటీవలే హెచ్చరించింది. దేశవ్యాప్తంగా అభయారణ్యాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని టైగర్ కారిడార్‌లోనూ పెద్దపులుల వేటగాళ్ల కదలికలు పెరిగాయని, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి పెద్దపులుల అభయారణ్యంతోపాటు మహారాష్ట్ర తడోబా నుంచి తెలంగాణ సరిహద్దుల్లోకి వలస వెళుతున్న పులులపై వారు కన్నేశారని ఎన్టీసీఏకి సమాచారమందింది. మహారాష్ట్ర తడోబా పులుల అభయారణ్యం నుంచి పెద్దపులుల సంఖ్య బాగా పెరిగి తెలంగాణ సరిహద్దులకు వెళుతున్నాయని ఈ క్రమంలో జన్నారం, కెరిమెర్రి ప్రాంతాలను సున్నిత ప్రాంతాలుగా గుర్తించి నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్టీసీఏ) అధికారులకు గతంలోనే సమాచారం పంపింది. గతంలో మంచిర్యాలలో గోదావరి నది వద్ద పెద్దపులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర తడోబా అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో పులులదాడుల వల్ల ఇటీవల దాదాపు పదిమంది చనిపోయారు. దీంతో పులుల సంచారంపై స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొందరు స్మగ్లర్లు పులులను చంపడానికి సిద్ధమయ్యారని వైల్డ్‌లైఫ్ క్రైమ్ బ్యూరోకు సమాచారమందింది. ఇచ్చోడలో ఒక పులిని చంపి చర్మాన్ని పూజారికి అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని చెన్నైలోని వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరోకు సమాచారమందింది. దీంతో వెంటనే రంగంలో దిగిన వారు రాష్ట్ర అటవీశాఖ సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.




పులిచర్మంతో పట్టుబడిన నిందితులు (ఫైల్)

### కదంబ కోసం మళ్లీ అన్వేషణ



ఇచ్చోడ సంఘటన నేపథ్యంలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని గాయాలతో బటయపడిన కదంబ అనే పెద్ద పులి కోసం మళ్లీ అన్వేషించాలని అధికారులు నిర్ణయించారు. వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి గాయపడి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లో సంచరిస్తున్న పెద్దపులిని పట్టుకోవడానికి గతంలో అధికారులు తీవ్రంగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. తాజాగా, మరో 50 కెమెరా ట్రాప్‌లను తెప్పించారు. ఎన్ని ఎత్తులు వేసినా బోనులో చిక్కకపోవడంతో మరో కొత్త ప్రయోగంచేస్తున్నారు. యవ్వన దశకు వచ్చిన కదంబ-4 ఆడపులిని ఆకర్షించడానికి మగపులి వాసనను కలిగి ఉండే కాల్విన్ కెవిన్ (calvin kawin) సెంట్ స్ప్రే చేయడానికి సన్నాహాలు జరుపుతున్నారు. లండన్ నుంచి తెప్పించిన దీనిని ఎలా వాడాలనేదానిపై సిబ్బందికి శిక్షణనిచ్చారు. పులిపై మత్తుమందు ప్రయోగం కోసం ఆధునిక ట్రాంక్విలైజ్ పరికరాలను, చెట్లపై నుంచి నిఘా వేయడానికి ఫోల్డబుల్ మచాన్లు, ఆరు వాకీటాకీలను తెప్పించారు.

## పవన్, చంద్రబాబుతో అలీ భేటీ



జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను కలిసిన నటుడు అలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైసీపీ కండువా కప్పుకోనున్నారంటూ వార్తలు వచ్చిన రెండురోజుల్లోనే హాస్యనటుడు అలీ ఏపీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో భేటీ అయ్యారు. ఆదివారం ఆయన విజయవాడలో దాదాపు రెండుగంటలపాటు పవన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను పవన్‌కల్యాణ్ జనసేనలో చేరాలని ఆహ్వానించినట్టు తెలిసింది. అనంతరం సినీ నిర్మాత అశ్వినీదత్.. అలీని ఏపీ సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. టీడీపీలో చేరితే గుంటూరు వెస్ట్ లేదా ఈస్ట్‌ల్లో ఒక టికెట్ ఇస్తానని చంద్రబాబు ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఏపీలోని మూడు పార్టీలు అలీకి ఆహ్వానం పలికిన నేపథ్యంలో ఆయన ఏ పార్టీలో చేరుతారనేది ఆసక్తిగా మారింది. వచ్చే ఎన్నికల్లో జనసేన 175 స్థానాల్లో పోటీచేస్తుందని పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఇందులో 60శాతం కొత్తవారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు.

## కేంద్రం ఇచ్చిన నిధులపై పుస్తకాలు వేస్తాం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభు త్వం మంజూరు చేసిన నిధులు, ప్రాజెక్టులు, పథకాలు తదితర అంశాలను పేర్కొంటూ త్వరలోనే పుస్తకాలు ప్రచురించి ప్రచారంచేస్తామని వెల్లడించారు.

## ఎమ్మెల్యేగా ఇప్పుడు ప్రమాణం చేయను

- బీజేపీ ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ నిర్ణయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంఐఎం పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు ప్రొటెం స్పీకర్‌గా బాధ్యతలు అప్పగించడాన్ని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తప్పుపట్టారు. మజ్లిస్ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా ఉన్న సమయంలో తాను ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయనని సంచలన నిర్ణయం ప్రకటించారు. కొత్త స్పీకర్ ఎన్నికైన తర్వాతనే ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు బీజేపీ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అవసరమైతే ఈ విషయాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొనేందుకు సిద్ధమని పేర్కొన్నారు.

## బాలికపై ముగ్గురు యువకుల లైంగికదాడి

- గర్భందాల్చి మృత శిశువుకు జన్మనిచ్చిన బాధితురాలు

**పెద్దపల్లి టౌన్:** బాలికపై ముగ్గురు యువకులు లైంగికదాడికి పాల్పడగా.. ఆమె గర్భందాల్చి మృతశిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో వెలుగు చూసింది. పెద్దపల్లి డీసీపీ సుదర్శన్‌గౌడ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక(15)కు అదే గ్రామానికి చెందిన రంజిత్ (20) అనే యువకుడు ఏడాది కిందట ప్రేమపేరుతో దగ్గరయ్యాడు. ఎనిమిది నెలల కిందట పెండ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి చేయడమే కాక.. సతీశ్, వైకుంఠం అనే మరో ఇద్దరు యువకులతోనూ లైంగికదాడి చేయించాడు. ఐదునెలల తర్వాత బాలిక గర్భం దాల్చిందని తెలుసుకున్న తల్లిదండ్రులు.. పరువుపోతుందనే భయంతో అబార్షన్ చేయించాలని భావించారు. అయితే వైద్యులు నిరాకరించారు. ఆ బాలిక నాలుగురోజుల క్రితం (ఎనిమిది నెలలు) మృతశిశువుకు జన్మనిచ్చింది. విషయం తెలిసిన యువకులు విషయం ఎవరికీ చెప్పొద్దని ఆమెను బెదిరించారు. దీంతో బాలిక తన తల్లితో కలిసి ఆదివారం డీసీపీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ వివరించారు.

## వ్యాపారుల వద్ద రూ.1.17 కోట్లు పట్టివేత

**సత్తుపల్లిరూరల్:** ఏపీలోని పెద్దాపురం నుంచి రెండు కార్లలో తెలంగాణకు తరలిస్తున్న రూ.1.17 కోట్ల నగదును ఖమ్మం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున సత్తుపల్లి సీఐ సురేశ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టణశివారులోని పెద్దవంతెన వద్ద వాహనాలను తనిఖీచేయగా భారీ నగదు లభ్యమైంది. ఖమ్మంకు చెందిన కుమిరిశెట్టి అనిల్‌కుమార్, తిరువూరుకు చెందిన సంకా రాజారావు రెండు వాహనాల్లో డబ్బు ను తీసుకొస్తున్నారు. అనిల్‌కుమార్ వద్ద రూ.54.44 లక్షలు, రాజారావు వద్ద రూ. 63.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తాము రైతుల వద్ద కొనుగోలుచేసిన ధాన్యాన్ని విక్రయించి డబ్బు తీసుకొస్తున్నట్టు వారు చెప్పారు. ఆధారాలు చూపితే అప్పగిస్తామని సీఐ తెలిపారు.





గద్వాలలోని ఓ అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాలో రికార్డయిన దొంగల దృశ్యం

## గద్వాలలో దొంగలముఠా కలకలం!

- చెడ్డీగ్యాంగ్‌గా అనుమానిస్తున్న పోలీసులు
- ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీకి యత్నం
- రంగంలోకి మూడు ప్రత్యేకబృందాలు

**గద్వాల, నమస్తే తెలంగాణ:** జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో దోపిడీ దొంగల ముఠా సంచారం కలకలం రేపింది. పోలీసులు ఈ ముఠాను చెడ్డీగ్యాంగ్‌గా అనుమానిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జిల్లా కేంద్రంలోని కర్నూల్‌కు వెళ్లే రోడ్డు సమీపంలో ఉన్న వేణు అపార్ట్‌మెంట్‌లోకి, అంతకు ముందు సమీపంలోని ఓ ఇంట్లోకి దోపిడీ దొంగలు చొరబడి చోరీకి యత్నించారు. అపార్ట్‌మెంట్‌లోని ఇండ్ల తలుపులు కొట్టినా ఎవరూ తీయకపోవడంతో వారు కొద్ది సేపు అక్కడే ఉండి ఆ తర్వాత వెళ్లిపోయారు. ఉదయం అపార్ట్‌మెంట్‌వాసులు సీసీ కెమెరాలను పక్కకు తిప్పి ఉండటాన్ని గమనించి.. సీసీ ఫుటేజీలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు ముసుగులు ధరించి అపార్ట్‌మెంట్‌లో చోరీకి యత్నించిన విషయాన్ని గుర్తించారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దోపిడీ ముఠాను పట్టుకొనేందుకు మూడు ప్రత్యేకపోలీసు బృందాలను దించామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

## ఇంటర్‌సిటీ రైలులో సాంకేతికలోపం

**కాగజ్‌నగర్ టౌన్:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరాల్సిన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో సాంకేతిక సమస్యతో తలెత్తింది. ఇంజిన్‌లో లోపం కారణంగా ఆదివారం రెండు గంటలపాటు ఆలస్యంగా నడిచింది. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఇంజినీర్లు వచ్చి మరమ్మతులు చేయడంతో మధ్యాహ్నం12 గంటలకు కాగజ్‌నగర్ నుంచి బయల్దేరాల్సిన రైలు 2 గంటలకు బయలు దేరింది.

## ప్రగతిపథంలో మహబూబ్‌నగర్- మునీరాబాద్ లైన్

- శరవేగంగా కొత్త రైల్వే మార్గం నిర్మాణ పనులు
- తెలంగాణలోని జక్లేర్- కృష్ణా మార్గానికి భూసేకరణ పూర్తి!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహబూబ్‌నగర్-మునీరాబాద్ మధ్య కొత్త రైల్వే మార్గం పనులు ప్రగతిపథంలో సాగుతున్నాయి. రూ.1723 కోట్ల వ్యయంతో 247 కి.మీ నిడివిగల కొత్త రైల్వే మార్గం నిర్మాణం 1997-98 సంవత్సరంలో మంజూరైంది. అందులో 66 కి.మీ నిడివి దక్షిణమధ్య రైల్వే పరిధిలో తెలంగాణ ప్రాంతానికి చెందినది. మిగిలినది నైరుతి రైల్వే పరిధిలో ఉన్న కర్ణాటక పరిధిలోకి వస్తుంది. రూ.372.09 కోట్ల అంచనావ్యయంతో చేపట్టిన దేవరకద్ర- కృష్ణ మధ్య 66 కి.మీ నిడివిగల కీలకమైన కొత్త రైలు మార్గం నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. దేవరకద్ర -జక్లేర్ (29 కి.మీ) కొత్త రైలు మార్గం పనులు పూర్తికావడంతో 2017లోనే ప్రారంభించి జాతికి అంకితంచేశారు. జక్లేర్-కృష్ణ మధ్య రైలు మార్గం నిర్మాణానికి 866 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా.. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతానికి 734 ఎకరాలు సేకరించి రైల్వేకు స్వాధీనం చేసింది. 2019-20కల్లా నిర్మాణం పూర్తే లక్ష్యంగా పనులు శరవేగంగా సాగుతున్నాయి.

**ప్రాజెక్టు వల్ల ప్రయోజనాలు**

- మహబూబ్‌నగర్-మునీరాబాద్ మధ్య నిర్మించే కొత్త మార్గం నిర్మాణం పూర్తయితే మహబూబ్‌నగర్ జిల్లా, కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదంచేస్తుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో పెద్దసంఖ్య (88.87%)లో ఉన్న గ్రామీణ ప్రజానీకానికి రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి.
- ఈ కొత్త రైలు మార్గంతో హైదరాబాద్ నుంచి హుబ్లీ, గోవాకు మధ్య దూరం ప్రస్తుతం అందుబాటులో ఉన్న మార్గంతో పోలిస్తే సుమారు 102 కి.మీ తగ్గుతుంది.



మహబూబ్‌నగర్-మునీరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి

**ప్రాజెక్టు ముఖ్యాంశాలు**

- మహబూబ్‌నగర్-మునీరాబాద్ (247 కి.మీ) మధ్య కొత్త రైలు మార్గం అంచనా వ్యయం రూ.1723 కోట్లు
- 2018-19 సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపు రూ.157 కోట్లు
- కృష్ణా-దేవరకద్ర (66కి.మీ) మధ్య కొత్త రైలు మార్గం అంచనావ్యయం రూ.372 కోట్లు
- ఇందులో భాగంగా 3 పెద్ద వంతెనలు, 82 చిన్న వంతెనలు, 5 రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, 27 రోడ్ అండర్ బ్రిడ్జీలు నిర్మించారు.

## కాంగ్రెస్‌లో ఫాంహౌజ్ విందులు!

- డీకే అరుణ లంచ్‌కు తరలిన నేతలు
- భవిష్యత్‌పై చర్చలు.. ఓటమి నుంచి తేరుకునే యత్నం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన నాటినుంచి కాంగ్రెస్ పార్టీలో ఏర్పడిన స్తబ్ధత నుంచి బయటపడేందుకు పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి డీకే అరుణ ఫాంహౌజ్ విందు ఏర్పాటుచేశారు. ఓటమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రయత్నించారు. ఆదివారం మాజీ మంత్రి డీకే అరుణ తన ఫాంహౌజ్‌లో ఇచ్చిన విందుకు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన నేతలు, గెలిచిన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, షబ్బీర్‌అలీ, మధుయాష్కీ, మాజీమంత్రి సునీతా లక్ష్మారెడ్డి, మల్లు భట్టివిక్రమార్క, జగ్గారెడ్డి, రేవంత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న స్తబ్ధతకు తెరవేసి పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో నేతలంతా చురుగ్గా పాల్గొనేలా చేసేందుకే నేతలకు లంచ్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీమంత్రి డీకే అరుణ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నేతలంతా ఒకచోటకూర్చుని మాట్లుడుకునేందుకు ఎవరోఒకరు చొరువ తీసుకోవాలని, ఆ చొరువను తాను తీసుకున్నట్టు తెలిపారుర. ఇందులో ఏ విధమైన ఇతర రాజకీయ కారణాలు లేవని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం తమ కుటుంబానికి అవకాశం ఇస్తే పోటీచేయడానికి సిద్ధమేనని తెలిపారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 7 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

# ఈ చిన్నారికి 336 నెలలు!

**ఎవరైనా వయసు అడిగితే.. సంవత్సరాల్లో చెబుతాం. అయితే కాలిఫోర్నియాలోని నాష్‌విల్లేకు చెందిన ఈ అమ్మడిని వయసు అడిగితే 336 నెలలు అంటున్నది. ఇందులో కన్‌ఫ్యూజన్ ఏం లేదు. తన 28వ పుట్టినరోజుని కొత్తగా జరుపుకునేందుకు ఇలా నెలల పాపగా మారిపోయింది.**



పుట్టినరోజంటే ఫ్రెండ్స్‌కి పార్టీలు, కేక్ కటింగులు ఉంటాయి. చుట్టాలందరినీ పిలిచి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటారు కొందరు. 27 యేండ్ల నికోల్ హామ్ మాత్రం తన 28వ పుట్టినరోజుని ఇప్పటివరకు ఎవరూ జరుపుకోని విధంగా జరుపుకోవాలనుకున్నది. తను పుట్టినప్పుడు ఎలా అయితే ఉన్నదో అచ్చు అలానే తయారవ్వాలనుకున్నది. దానికి తన ఫ్రెండ్, ఫొటోగ్రాఫర్ స్టెఫానీ స్మిత్ సాయం కోరింది. ఇంకేముంది.. ఏర్పాట్లు సిద్ధం. పుట్టినరోజు రానే వచ్చింది. చంటిబిడ్డలా డ్రెస్ ధరించి బెడ్‌పై పడుకొని ఇలా ఫొటోలకు ఫోజులిచ్చింది నికోల్. తలకి అందమైన పువ్వుని డెకరేట్ చేశారు. ఆమె చుట్టూ పచ్చరంగులో ఉండే తీగలతో అలంకరించారు. తన గురించి మూడు వాక్యాల్లో చిన్న బోర్డు మీద రాసి నికోల్ పక్కనే పెట్టారు. ఫొటోషూట్ అనంతరం వాటిని తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసింది నికోల్. నా 28వ పుట్టినరోజుకి నేను చంటిబిడ్డలా మారిపోయానని నికోల్ షేర్ చేసింది. పెట్టిపెట్టగానే కొద్దినిమిషాల్లోనే 25 వేల కంటే ఎక్కువమంది ఈ పోస్ట్‌ని షేర్ చేశారు. పోస్ట్ చూసిన చాలామంది చాలా బాగుందని మెచ్చుకుంటున్నారు. అంతేకాకుండా వారు చిన్న వయసులో ఎలా ఉన్నారో ఆ ఫొటోలనూ షేర్ చేస్తున్నారు. ఈ విధంగా నికోల్ తన పుట్టినరోజుని కొత్తగా జరుపుకున్నది.



**ఆమెకు కళలంటే ప్రాణం అందుకే తన కాలాన్నంతా కళా రంగానికే వెచ్చిస్తున్నది. ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థ సేవకే సమయాన్ని అంకితం చేసింది. కళాకారుల అభివృద్ధే సంస్థ శ్రేయస్సు అనుకుని ప్రతీ ఆలోచనకూ ఆచరణ రూపం ఇచ్చింది. ఖోజ్ పేరుతో ఆర్ట్ ఎన్జీవో స్థాపించి ఎందరో కళాకారులను ప్రపంచానికి పరిచయం చేస్తున్నది. ఖోజ్ స్టూడియోలలో ఆర్ట్ ఫెయిర్‌లు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నది. 25 సంవత్సరాలుగా కళల రంగానికి అంకితమైన ఖోజ్ ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ డైరెక్టర్ పూజాసూద్ సక్సెస్‌మంత్ర.**

సక్సెస్ మంత్ర

## ఖోజ్‌తో కళారంగానికి వన్నె తెస్తున్న

# పూజాసూద్

**పూజాసూద్ మ్యాథమెటిక్స్‌లో పట్టభద్రురాలు. పూనేలోని సింబయాసిస్ నుంచి మార్కెటింగ్‌లో ఎంబిఏ పట్టా అందుకున్నారు. వ్యక్తిగత ఇష్టాల ఆధారంగా కళల రంగాన్ని ఎంచుకున్నారు పూజ. పాతికేళ్ల ఈ ప్రయాణంలో పంజాబ్ యూనివర్సిటీ నుంచి ఆర్ట్ హిస్టరీలో కోర్స్ పూర్తి చేశారు. ఈ సమయంలో ఎన్నో గుర్తుంచుకోదగ్గ అంశాలున్నాయంటారు పూజ. రానున్న కాలంలో ఖోజ్ స్టూడియోలను తర్వాతి తరాలకు అందించాలని భావిస్తున్నారామె. 'నేను మ్యాథ్స్ చదువుతున్నపుడే కళల పట్ల ఆకర్షితురాలినయ్యాను. ఇంగ్లిష్ లిటరేచర్‌కు సంబంధించిన అన్ని క్లాసులకు హాజరయ్యేదాన్ని. పెండ్లి, పిల్లలు తర్వాత ఆర్ట్ హిస్టరీ చదవాలనుకున్నది సరదాగా మాత్రమే. అయినా సరే నేను వాటికి అటాచ్ అయిపోయా'నంటారు పూజాసూద్.**

### ఐషర్‌తో ఆరంభం

ఢిల్లీ కేంద్రంగా పని చేసే ఐషర్ గ్యాలరీతో పూజ తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అక్కడ రెండు పాత్రలు పోషించడం పూజ జీవితాన్ని మలుపు తిప్పింది. అక్కడ ఆమె క్యూరేటర్, అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇది లాభాపేక్ష లేని సంస్థ. 'ఇక్కడ మూడేళ్లపాటు విధులు నిర్వహించడం నా జీవితంలో మర్చిపోలేనిది. ఈ సమయంలో కళలకు సంబంధించిన అనేక విషయాలు నేర్చుకున్నా' అంటారు పూజాసూద్. ఐషర్ ఆధ్వర్యంలో ఎన్నో గుర్తుంచుకోదగ్గ ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. ఢిల్లీకి చెందిన సిరామిక్ ఆర్టిస్ట్ గురుచరణ్ సింగ్ ప్రదర్శనలు, టెక్స్‌టైల్ ఆర్ట్ ప్రదర్శనల సిరీస్, శీబాచాచి ఆధ్వర్యంలో సినీనటి మీనా కుమారిపై ప్రదర్శన, ఆహార పదార్థాలపై ద రెసిపీస్ షో, భారత్-పాక్ మధ్య గుర్తులతో 'మాపింగ్స్: షేర్డ్ హిస్టరీస్.. ఎ ఫ్రాగిల్ సెల్ఫ్' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లకు అద్భుతమైన స్పందన లభించింది.

### ఖోజ్ ప్రారంభం

ఐషర్‌లో నేర్చుకున్న అనుభవంతో పూజ ఖోజ్ పేరుతో ఆర్ట్ స్టూడియో ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఆ ఆలోచన కూడా బ్రిటిష్ ఆర్ట్ కలెక్టర్ రాబర్ట్ లాడర్ మూలంగా వచ్చిందట. ఐషర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కాన్ఫరెన్స్‌లో ఈ ఐడియా తట్టింది. భారతీ ఖేర్, సుబోధ్ గుప్తా, మనీషా పరేఖ్, అనితా దూబే, ప్రీత్పాల్ ఎస్. లాడి, పూజాసూదులు ఒక బృందంగా ఏర్పడి 1997లో ఖోజ్‌ను ప్రారంభించారు. 'అప్పటికే నేను ఈ అందరు కళాకారులతో కలిసి చాలాసార్లు కార్యక్రమాలు నిర్వహించా. అందుకే వీరితో జట్టుగా ఏర్పడి ఖోజ్ ప్రారంభించగలిగాను. మా టీం అంతా ఇప్పటివరకూ కూడా అలాగే బెస్ట్ ఫ్రెండ్స్ మాదిరిగానే ఉండడం విశేషం. మాకు ఖోజ్ కేవలం ఒక పని మాత్రమే కాదు. సుబోధ్, భారతిలు అప్పుడప్పుడు సిటీలోనే బెస్ట్ అనదగ్గ మాంచి పార్టీలు ఇస్తుంటారు. అలాగే సుబోధ్ మా కోసం ఎప్పుడూ వంట చేస్తూంటుంది. ఇప్పుడు అందరం బిజీగానే ఉన్నా.. మేం కలవాలని అనుకున్నపుడు ఒకచోటకి తప్పకుండా చేరతాం' అంటారు పూజ.

### నిధుల సమీకరణ



ప్రారంభంలో వివిధ వయసుల్లోని కళాకారులు, స్థానిక సంస్థలు ఖోజ్‌కు ఎంతో సహాయపడ్డారు. నిజానికి లాభాపేక్ష లేకుండా నడిచే సంస్థలకు ప్రారంభమనేది చాలా కీలకం. నిలకడగా నిధులు వచ్చేంత స్థాయికి చేరుకునేవరకూ అది కత్తి మీద సాముగానే చెప్పాలి. 2011లో 40 మంది పెద్ద ఆర్టిస్టులు లిమిటెడ్ ఎడిషన్ పోర్ట్‌ఫోలియోల కొనుగోలు ద్వారా భారీ మొత్తాలు అందించారు. ఆ తర్వాత అనీష్ కపూర్, అతు దోడియా, సుబోధ్ గుప్తా, మీథు సేన్, భారతీ ఖేర్‌తో సహా 10 మంది ఆర్టిస్టులు ఇచ్చిన వాటితో నిర్వహించిన క్రిస్టీస్ వేలం ద్వారా రూ. 2 కోట్ల నిధులు సమీకరించుకుంది ఖోజ్. 'కళాకారులు మమ్మల్ని సపోర్ట్ చేయడానికి ప్రధాన కారణం.. వారికి మాపై ఉన్న నమ్మకమే. ఖోజ్‌లో చాలా విలువైన కార్యకలాపాలను నిస్వార్థంగా నిర్వహించేవారు వారంతా. అలాగే లోకల్‌గానే కార్యకలాపాలు ఉండాలనే విధానానికి మేం వ్యతిరేకం. మా నెట్‌వర్క్ మరింతగా పెంచుకుని అంతర్జాతీయంగా వాణిజ్యేతర రంగంలో ఎన్నో ప్రయోగాలు చేయాలని నిర్ణయించుకున్నాం' అంటారామె.

### కష్టాలను ఈది...

ఖోజ్ ఆరంభం నుంచీ విజయవంతంగా నడిచిందనుకుంటే పొరపాటే. మొదట్లో హివోస్ అందించిన నిధులతో దక్షిణ ఢిల్లీలో ఓ చిన్న ఆఫీస్‌లో పనులు మొదలయ్యాయి. స్నేహితులు, కుటుంబసభ్యుల నుంచి తెచ్చిన ఫర్నిచర్‌తోనే ఆఫీస్ నిర్వహించేవారు.

> ఖోజ్ కేవలం కళాకారుల ప్రదర్శనలకు అవకాశం ఇవ్వడం మాత్రమే కాదు, స్వయంగానూ కొన్ని ఎగ్జిబిషన్లు నిర్వహించింది. ఖోజ్లివ్ 08(ఇంటర్నేషనల్ పెర్ఫామెన్స్ ఆర్ట్ ఫెస్టివల్), పీర్స్( ఔత్సాహిక కళాకారుల ప్రదర్శన), సిక్స్ డిగ్రీస్ ఆఫ్ సెపరేషన్ (దక్షిణ ఆసియాను కవర్ చేసే ప్రదర్శన), నేమ్‌లెస్ హియర్ ఎవర్మోర్(మల్టీమీడియా ఎగ్జిబిషన్ కం గ్లోబల్ ట్రామా), వర్డ్ సౌండ్ పవర్, ఖోజ్ మారథాన్ వంటి కార్యక్రమాలు.. ఖోజ్ సంస్థ ఖ్యాతిని మరింతగా పెంచాయి.

2002లో మూడంతస్తుల బిల్డింగ్ కొనుగోలు చేసింది ఖోజ్. ఐదు స్టూడియోలు, ఒకేసారి 6 గురికి ఆవాసం కల్పించే రూమ్స్, కిచెన్, లివింగ్ రూం, మల్టీ పర్పస్ ప్రాజెక్ట్ స్పేస్, లైబ్రరీ, రీడింగ్ రూం, మీడియా ల్యాబ్, కేఫ్, మీటింగ్ రూమ్స్, పలు కార్యకలాపాలకు అనుగుణంగా టెర్రస్.. ఇదీ ఆ తర్వాత ఖోజ్ అభివృద్ధి.



ప్రతీ ఆలోచననూ ఆచరణలో పెట్టాలని ప్రయత్నం చేసేవారిక్కడ. అందులో భాగంగా నిర్వహించిన కొచ్చి-ముజిరీస్ బీనేల్ ఇండియా ఆర్ట్ ఫెయిర్ వంటివి కొన్ని విమర్శలకు గురయ్యాయి. ప్రైవేట్ గ్యాలరీలు, మ్యూజియంలు, ఆర్ట్ ఎన్జీఓలు, వాణిజ్యేతర ప్రదర్శనల వంటివి పోటీతత్వాన్ని పెంచాయి. అయితే వాటన్నింటిని సమర్థవంతంగా పరిష్కరిస్తూనే కళల గురించి పదిమందికీ తెలియజెప్పడమే లక్ష్యంగా పనిచేశారు పూజ.

### ఎన్నో కార్యక్రమాలు

గడిచిన కొన్నేళ్లుగా ఖోజ్ నిర్వహించిన కార్యక్రమాల ద్వారా వెలుగులోకి వచ్చిన వారి వివరాలను పూజాసూద్ ఎడిటర్‌గా నడిచే ఖోజ్‌బుక్‌లో పొందుపరుస్తున్నారు. కళలపై పరిశోధనలు చేసే సుధబ్రతా సేన్ గుప్తా వంటివారు రాసిన వ్యాసాలు అనేకం కూడా ప్రచురించారు ఇందులో. విభిన్నమైన ప్రతిభాపాటవాలున్నవారు, ఖోజ్ ద్వారా ప్రపంచానికి పరిచయమయ్యారు. ఇలాంటి వారిని మరింతగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉందని గుర్తించి వర్క్‌షాప్స్, ఇంటింటికీ ప్రచారం, ఈవెంట్స్, ఆర్టిస్టుల పెర్ఫామెన్స్, ఎగ్జిబిషన్స్ వంటి వాటిని ఎన్నిటినో ఏర్పాటు చేసింది ఖోజ్. ప్రతీ ప్రదర్శనలోంచి ఎన్నో నేర్చుకుని, తర్వాతి ఎగ్జిబిషన్ కోసం సిద్ధమవ్వడం, ప్రదర్శనల్లో పరిచయమయ్యే వ్యక్తుల సలహాలు, సూచనలను వీలైనంత వరకూ పాటిస్తామని పూజ చెబుతున్నారు.

### కొత్త ప్రాజెక్టులు

ఖోజ్ అభివృద్ధిలో అన్నీతానై వ్యవహరించిన పూజ, కేవలం దానితోనే ఊరుకోకుండా 2002లోవృద్ధి చెందుతున్న కళాకారులు తమ అనుభవాలు పంచుకునే వేదికగా సౌత్ ఏషియన్ నెట్‌వర్క్ ఫర్ ది ఆర్ట్స్(సానా)ను ప్రారంభించారు. కొత్త మీడియా అవకాశాలను తెలిపే ఏపీజే మీడియా గ్యాలరీని ఏర్పాటు చేశారు. పబ్లిక్ ఆర్ట్ ప్రాజెక్టుల కోసం పబ్లిక్ ఆర్ట్ ఎకాలజీని 2008లో ప్రారంభించారు. 'మా కార్యకలాపాలకు మేమే నిధులు ఏర్పాటు చేసుకోగలిగే స్థాయికి ఎదగడం మా తరువాతి లక్ష్యం. ప్రస్తుతం అమలు చేస్తున్న మూడేళ్ల ఫండిగ్ విధానం నుంచి బయటకు రాగలిగినప్పుడే... ఖోజ్ పూర్తి స్థాయి స్వతంత్ర సంస్థగా మారుతుంది' అంటారు పూజాసూద్.

## రైతుల కోసం యాప్..



**మొక్కలు నాటడమంటే చాలామందికి ఇష్టంగా ఉంటుంది. కానీ, నాటిన తర్వాత ఎలా పెంచాలి? వాటి రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఏ రకం భూమిలో ఎలాంటి మొక్కలు పెట్టాలి? వంటి ప్రశ్నలకు చాలామందికి సమాధానం తెలియదు. అలాంటి వారి కోసమే ఈ ఫారెస్ట్ ఆఫీసర్ 'ట్రీపిడియా' అనే యాప్‌ను తయారుచేయించారు.**

తమిళనాడుకు చెందిన ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) అధికారిణి సుధారామన్ మొక్కలు నాటాలన్న తపన ఉన్న వారి కోసం 'ట్రీపిడియా' అనే యాప్‌ను రూపొందించింది. గూగుల్‌లో మనకు ఎలాంటి సమాచారమైనా అందించే వికీపీడియాలాగ ఇది చెట్లు, మొక్కలకు సంబంధించిన పూర్తి సమాచారం అందించే యాప్ అన్నమాట. తమిళనాడులో మొక్కలు నాటడం, వాటిని పెంచడం పట్ల చాలామందికి ఆసక్తి ఎక్కువగా ఉంటుందట. కానీ వాటి ఎదుగుదల విషయంలో సరైన అవగాహన లేక మధ్యలోనే వదిలేస్తున్నారట. దీనికి తోడు అక్కడి వాతావరణ పరిస్థితుల మీద కూడా అవగాహన లేకపోవడం మరో కారణం. దీన్ని చాలా సార్లు గమనించిన సుధారామన్ చక్కని పరిష్కారం ఆలోచించింది. బయో ఇంజినీరింగ్ చదివిన సుధారామన్ మొక్క నాటడం మొదలుకొని చెట్టులా ఎదిగే వరకు పూర్తి సమాచారాన్ని ఒకేచోట చేర్చి ఔత్సాహికులకు అందించాలనుకుంది. ఫారెస్ట్ ఆఫీసర్ కావాలనుకున్న లక్ష్యంతో చదివిన సుధారామన్ తన లక్ష్యాన్ని చేరుకొని తను పనిచేసే ప్రాంతాన్ని పచ్చగా చేయాలన్న ఆలోచనకు ఈ ఐడియా తోడయింది. వెంటనే ట్రీపిడియా అనే యాప్‌ను రూపొందించింది. డెహ్రాడూన్‌లో అటవీ వనరుల గురించి చేసిన అధ్యయనంలో గోల్డ్ మెడల్ పొందిన సుధారామన్ యాప్‌ను అందరికీ అర్థమయ్యేలా తీర్చి దిద్దగలిగింది. రైతులు, సామాన్య జనాలు కూడా మొక్కల సంరక్షణ, పెంపుదల, నేలల రకాలు, ఏయే నేలల్లో ఎలాంటి మొక్కలు నాటాలన్న పూర్తి సమాచారం ఆ యాప్‌లో పొందుపరిచింది. యూత్, సోషల్ మీడియా ద్వారా ఆ యాప్‌కి ప్రచారం కల్పించింది. అంతే.. తమిళనాడులో ట్రీపిడియా యాప్‌కి అనూహ్యస్పందన వస్తున్నది. సుధా రామన్ ఆలోచన గురించి తెలిసిన వారంతా 'శభాష్.. ఫారెస్ట్ ఆఫీసర్ సుధారామన్' అంటున్నారు.

## శీతాకాలంలో చర్మ సంరక్షణ!



**చలికాలంలో చాలామందికి చర్మం పొడిబారుతుంది. దీనివల్ల చర్మంపై మంట, దురద పెట్టడంలాంటివి ఇబ్బంది పెడుతుంటాయి. ఇంట్లో లభించే పదార్థాలతోనే చర్మాన్ని మృదువుగా మార్చుకోవచ్చు. అదెలాగో తెలుసుకోండి.**

- ముల్తానీ మట్టి, మీగడ, తేనె, బాదంనూనె వేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా రాసుకోవాలి. 15 నిమిషాల తరువాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. ప్రతి రోజూ ఇలా చేస్తే చర్మం పొడిబారకుండా కాంతివంతంగా మారుతుంది.
- తేనె చర్మానికి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. స్నానం చేయడానికి ముందు మీ శరీరానికి తేనెను అప్లై చేయాలి. 10 నిమిషాల తరువాత స్నానం చేయాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే చర్మం మృదువుగా మారుతుంది. ఇందులో యాంటీ మైక్రోబైల్, హ్యూమెక్టా లక్షణాలుంటాయి.
- తాజా పెరుగును కాళ్లకు, చేతులకు రాసి ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి. 15 నిమిషాల తరువాత స్నానం చేయాలి. పెరుగు పొడిచర్మాన్ని తొలిగిస్తుంది. రోజుకి ఒకసారి ఇలా చేస్తే సరిపోతుంది. పెరుగులో క్రిములను నాశనం చేసే ల్యాక్టిక్ యాసిడ్‌లుంటాయి.
- కలబందని ముక్కలుగా చేసి అందులోని గుజ్జును బయటకు తీయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. 15 నిమిషాలు తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి. రోజుకు రెండు సార్లు చేయడం వల్ల చర్మంపై దురద తగ్గి, మృదువుగా ఉంటుంది. కలబందలో యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి.

## సిరిముగ్గు

24 చుక్కలు
2 వరుసలు 2 వచ్చేవరకు





ప్రతిభ
నవాబ్‌పేట,
మహబూబ్‌నగర్

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10, హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com

# లాలాజల గ్రంథిలో కణతులు ప్రమాదమా?



అడుగండి చెబుతా

**మా అబ్బాయి వయసు 18 సంవత్సరాలు. ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఆర్నెళ్లుగా అతడు తరచూ అనారోగ్యానికి గురవుతున్నాడు. ముఖ్యంగా చెవి నుంచి దవడ కింది భాగం వరకు వాపు వచ్చింది. దానిని పట్టుకొని చూస్తే గట్టిగా కణతుల మాదిరిగా ఉన్నాయి. చలికాలం కాబట్టి తీవ్రత ఎక్కువగా ఉంది. శీతల పానీయాలు తాగినా.. చల్లటి వాతావరణంలో బయటకు వెళ్లినా వాపు పెరిగిపోతున్నది. నొప్పి కూడా ఉంది. డాక్టర్‌ను సంప్రదిస్తే ఆపరేషన్ చేయాలన్నారు. లాలాజల గ్రంథిలో వాపు అన్నారు. ఇక తెలిసిన వాళ్లేమో ఈ కణతులు చాలా ప్రమాదకరమనీ.. అవి క్యాన్సర్‌కు సంకేతాలని చెప్పారు. ఇది నిజంగానే క్యాన్సర్ అంటారా? అసలీ కణతులు ఏంటి? ఎందుకు వస్తాయి? ఎలా తగ్గుతాయి? చికిత్స ఏంటి? తెలుపగలరు.**

**- ఆర్. సుజాత, సూర్యాపేట**

సుజాత గారూ.. మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీ అనుమానమంతా మీ అబ్బాయి దవడ భాగంలో ఏర్పడిన గడ్డలు క్యాన్సర్ గడ్డలేనా? అనే కదా. కానీ అన్ని గడ్డలూ క్యాన్సర్ గడ్డలు కావు. లాలాజల గ్రంథిలో సమస్యల వల్ల ఇలాంటివి వస్తుంటాయి. ఆ గ్రంథిలో ఏవైనా చిన్నపాటి రాళ్లలాంటివి ఏర్పడినా కణతులకు దారితీస్తాయి. గొంతులో ఇన్ఫెక్షన్ ఉన్నా ఇలాంటి కణతులకు ఆస్కారం ఉంది. కొందరికి టీబీ ఉండటం వల్ల కూడా ఇలా జరుగుతుంది. ఇంకోటి మీరు చెప్పినదానిని బట్టి చూస్తే ఆ కణతులు నొప్పి ఉన్నాయి కాబట్టి ఎలాంటి భయం అవసరం లేదు. నొప్పి లేని కణతులే ప్రమాదకరం. టాన్సిల్స్‌లో వాపులు రావడం వల్ల కూడా ఇవి వస్తుంటాయి. ఇన్ని చెప్పాం కదా.. వీటిలో ఏది కారణమో తెలియాలంటే మాత్రం కచ్చితంగా పరీక్షలు జరపాల్సిందే. ఎఫ్ఎన్ఏసీ పరీక్ష ద్వారా లాలాజల గ్రంథికి చికిత్స చేసి అసలు విషయం ఏంటో నిర్ధారిస్తారు. ఇక క్యాన్సర్ అని నిర్ధారించడానికి ఆ కణతుల్లోని కొంత భాగాన్ని తీసుకొని బయాప్సీ పరీక్ష నిర్వహిస్తారు. ఆ పరీక్ష ద్వారానే క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయా లేవా అని స్పష్టం చేస్తారు. కాబట్టి మీరు చింత పక్కనపెట్టి ముందుగా ఈఎన్‌టీ స్పెషలిస్ట్‌ను కలవండి. అప్పటివరకు ఇన్ఫెక్షన్స్, వాపు తగ్గేందుకు మందులు వాడాలి. యాంటీ బయాటిక్స్ తప్పనిసరి. చలికాలం కాబట్టి ఎక్కువగా చలి ఉన్నప్పుడు మీ అబ్బాయిని బయటకు వెళ్లకుండా నివారించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో నిండా దుస్తులు ధరించి వెళ్లాలని సూచించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ శీతలపానీయాలు తాగరాదని చెప్పాలి. కాచి చల్లార్చిన నీటిని ఇవ్వండి. ఆల్ ది బెస్ట్.



డాక్టర్ ఎల్ సుదర్శన్‌రెడ్డి
ఈఎన్‌టీ స్పెషలిస్ట్
గవర్నమెంట్ ఈఎన్‌టీ హాస్పిటల్,
హైదరాబాద్

## వంట చిట్కాలు



- క్యారెట్స్ బాగా ఉడకాలంటే ముందుగా గోరువెచ్చటి నీటిలో కొద్దిసేపు ఉంచి ఆ తరువాత కట్ చేయాలి.
- అన్నం మాడిపోయి వాసన వస్తుంటే కొంచెం ఉప్పు వేస్తే ఆ వాసన పోతుంది.
- నూనెని పలుమార్లు వండడం వల్ల మడిగా తయారవ్వకుండా ఉండాలంటే అందులో ఆలూ స్లయిస్ వేస్తే లోపల ఉండే మడ్డి అతుకుపోతుంది.
- ఇడ్లీపిండిని లైట్‌గా మూతపెట్టి ప్రెషర్‌కుక్కర్‌లో ఉంచారంటే త్వరగా పులిసి ఇడ్లీలు రుచిగా ఉంటాయి.
- కాఫీపొడిని గాలి చొరబడని డబ్బాలో ఉంచి డీప్ ఫ్రిజ్‌లో ఉంచితే గడ్డ కట్టకుండా ఉంటుంది.
- చెక్క గరిటలు, స్పూన్లు వెనిగర్ కలిపిన నీటిలో ఉంచిన తర్వాత వాడుకుంటే వాసన రాకుండా ఉంటాయి.
- గారెలు చేసేటప్పుడు నూనె చిందకుండా ఉండాలంటే అందులో కొంచెం నెయ్యి కలిపితే చాలు.

నమస్తే తెలంగాణ
# నిపుణ
[ హైదరాబాద్ ]
సోమవారం 7 జనవరి 2019

## ప్రాక్టికల్ శిక్షణ



- సీఎంఏ ఫైనల్ పరీక్ష రాయాలంటే ఆరు నెలల ప్రాక్టికల్ శిక్షణ తప్పనిసరి. సీఎంఏ ఎగ్జిక్యూటివ్ (సీఎంఏ ఇంటర్) ప్రోగ్రామ్‌లో ఉత్తీర్ణత సాధించినవారు గుర్తింపు పొందిన సంస్థలో నిర్దేశించిన విభాగాల్లో లేదా ప్రాక్టీసింగ్ కాస్ట్ అకౌంటెంట్ వద్ద 6 నెలలపాటు ప్రాక్టికల్ ట్రెయినింగ్ పొందాలి. ఇలా శిక్షణ పొందుతున్న సమయంలో విద్యార్థి తను ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందుతున్న ప్రాంతాన్ని బట్టి నెలకు రూ.2000 నుంచి 5000ల వరకు స్టయిఫండ్ పొందవచ్చు. ఈ ప్రాక్టికల్ ట్రెయినింగ్ ద్వారా విద్యార్థి సీఎంఏ వృత్తికి కావలసిన నైపుణ్యాన్ని పొందడమే కాకుండా తన కోర్సు పూర్తి చేసుకోవడానికి కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చుకోవచ్చు. సీఎంఏ ఫైనల్ ఉత్తీర్ణులైనవారు ప్రాక్టీస్ చేయాలనుకుంటే మూడేండ్ల ప్రాక్టికల్ శిక్షణ పూర్తి చేయాల్సి ఉంటుంది.



# కష్టపడితే కలర్‌ఫుల్ లైఫ్

## సీఎంఏ

**చాలామంది సీఎంఏ లాంటి కామర్స్ కోర్సులు కష్టంగా ఉంటాయని అపోహ పడుతుంటారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక, మంచి సంస్థలో కోచింగ్, లక్ష్యాన్ని సాధించాలన్న తపన ఉంటే ఎలాంటి వారైనా సీఎంఏ కోర్సులు చదవచ్చు. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించవచ్చు.**

- సీఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ) కోర్సుకు సంబంధించిన అన్ని వ్యవహారాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా పర్యవేక్షిస్తుంది.
- సీఎంఏల సప్లయ్ తక్కువగా ఉంది. పెరిగిన పారిశ్రామిక అవకాశాలకు అనుగుణంగా సీఎంఏలు లేకపోవడంతో ఆ కోర్సు పూర్తిచేసిన వారికి చాలా డిమాండ్ ఉంది.
- ఈ కోర్సు పూర్తి చేయడానికి ఖర్చు చాలా తక్కువ. ఆర్థిక కార్యకలాపాల ప్రపంచీకరణ నేపథ్యంలో ఉత్పత్తి రంగ, సేవారంగ పరిశ్రమలన్నీ సంస్థల యాజమాన్యానికి వనరుల నిర్వహణ, వ్యయాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్న కాస్ట్ అకౌంటెంట్ల సేవలను వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నాయి.
- కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్లు పెట్టుబడి, ప్రణాళికల విషయంలో, లాభాల ప్రణాళిక, ప్రాజెక్ట్ నిర్వహణలో సేవలు అందిస్తారు. ప్రస్తుతం చాలా మంది కాస్ట్ అకౌంటెంట్లు వివిధ సంస్థల్లో చైర్మన్, సీఈఓ/సీఎఫ్ఓ, మేనేజింగ్ డైరెక్టర్లుగా, ఫైనాన్స్ డైరెక్టర్లుగా, ఫైనాన్స్ కంట్రోలర్స్‌గా, చీఫ్ అకౌంటెంట్లుగా, కాస్ట్ కంట్రోలర్స్‌గా మార్కెంటింగ్ మేనేజర్లు, చీఫ్ ఇంటర్నల్ ఆడిటర్స్‌గా సేవలందిస్తున్నారు.
- ఇప్పటి ప్రొఫెషనల్ కామర్స్ కోర్సుల్లో సులువుగా పూర్తి చేసుకోగలిగిన కోర్సు సీఎంఏ అని చెప్పవచ్చు. కోర్సు వ్యవధి చాలా తక్కువ. దీంతో చాలామంది విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకుంటున్నారు.
- 10వ తరగతి తరువాత అయితే నాలుగేండ్లలో, ఇంటర్ ఎంఈసీతో పాటు సీఎంఏ చదివితే రెండేండ్లలో, ఇంటర్ తర్వాత అయితే రెండున్నరేండ్లలో సీఎంఏ పూర్తి చేయవచ్చు.
- సీఎంఏ చదవాలంటే ఇంటర్‌లో ఏ గ్రూప్‌వారైనా అర్హులే. ఇంటర్ లేదా డిగ్రీ పూర్తిచేసిన ఏ గ్రూప్‌వారైనా సీఎంఏ కోర్సు చదవచ్చు. అలాగే ఇంజినీరింగ్ పూర్తిచేసినవారు కూడా సీఎంఏ చదవచ్చు. ఈ కోర్సు మొత్తం పూర్తవడానికి డిగ్రీ లేదా ఇంజినీరింగ్ తర్వాత రెండేండ్లు పడుతుంది.
- **సీఎంఏ కోర్సులో ఫౌండేషన్, ఇంటర్మీడియట్, ఫైనల్ అనే మూడు దశలు ఉంటాయి.**

### సీఎంఏ ఫైనల్ కోర్సు

- సీఎంఏ ఇంటర్ ప్రోగ్రామ్‌లో ఉత్తీర్ణత సాధించి 6 నెలల ప్రాక్టికల్ ట్రెయినింగ్ పూర్తయిన విద్యార్థి ఫైనల్ పరీక్ష రాయవచ్చు.

### రిజిస్ట్రేషన్

- సీఎంఏ ఇంటర్ పూర్తయినవారు ఫైనల్ రిజిస్ట్రేషన్ కోసం రూ. 17,000 చెల్లించాలి.
- జూన్‌లో సీఎంఏ ఫైనల్ పరీక్ష రాయాలంటే అదే ఏడాది జనవరి 31న, డిసెంబర్‌లో పరీక్ష రాయాలంటే జూలై 31లోగా నమోదు చేసుకోవాలి.

### పరీక్ష ఫీజు

- ఒక గ్రూప్‌కి అయితే రూ.1400, రెండు గ్రూపులకు అయితే రూ. 2800
- జూన్ నెలలో పరీక్ష రాయాలంటే మార్చి 31లోగా, డిసెంబర్‌లో పరీక్ష రాయాలంటే సెప్టెంబర్ 30లోగా ఫీజు చెల్లించాలి. సీఎంఏ ఫైనల్‌లో కూడా రెండు గ్రూపులు (గ్రూప్-3, గ్రూప్-4) ఉంటాయి. ఫైనల్ పరీక్షకు అర్హత సాధించాలంటే విద్యార్థి కనీసం 6 నెలల ప్రాక్టికల్ శిక్షణ పూర్తి చేయాలి. విద్యార్థి వీలునుబట్టి రెండు గ్రూపులు ఒకేసారి లేదా విడివిడిగా ఒక్కో గ్రూప్ 6 నెలల వ్యత్యాసంతో రాయవచ్చు. ప్రతి ఏడాది జూన్, డిసెంబర్ నెలల్లో సీఎంఏ ఫైనల్ పరీక్షలు జరుగుతాయి.
- సీఎంఏ ఫైనల్ పూర్తిచేసిన విద్యార్థులను కంప్యూటర్ ట్రెయినింగ్ పూర్తయిన తర్వాత క్వాలిఫైడ్ కాస్ట్ అకౌంటెంట్లుగా పరిగణిస్తారు. సొంతంగా ప్రాక్టీస్ చేయాలనుకున్నవారు రెండున్నరేండ్లు ప్రాక్టికల్ ట్రెయినింగ్ తీసుకోవాలి (పైన తెలిపిన 6 నెలలకు ఇది అదనం). ట్రెయినింగ్ పూర్తి చేసినవారికి ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీఓపీ) అందిస్తుంది.

| గ్రూప్-3 | | |
|---|---|---|
| సబ్జెక్టు | మార్కులు | కనీస మార్కులు |
| కార్పొరేట్ లాస్ అండ్ కంప్లెయిన్స్ | 100 | 40 |
| స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ | 100 | 40 |
| స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్- డెసిషన్ మేకింగ్ | 100 | 40 |
| డైరెక్ట్ ట్యాక్స్ లాస్ అండ్ ఇంటర్నేషనల్ ట్యాక్సేషన్ | 100 | 40 |

| గ్రూప్-4 | | |
|---|---|---|
| సబ్జెక్టు | మార్కులు | కనీస మార్కులు |
| కార్పొరేట్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ | 100 | 40 |
| ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ లాస్ అండ్ ప్రాక్టీస్ | 100 | 40 |
| కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ ఆడిట్ | 100 | 40 |
| స్ట్రాటజిక్ పర్ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ బిజినెస్ వ్యాల్యుయేషన్ | 100 | 40 |

- రెండు గ్రూపుల్లో ప్రతి సబ్జెక్టులో కనీసం 40 మార్కుల చొప్పున మొత్తం 200 మార్కులు సాధించాలి.

### సీఎంఏ ఇంటర్

- సీఎంఏ ఇంటర్ కోర్సునే సీఎంఏ ఎగ్జిక్యూటివ్ కోర్సు అనికూడా పిలుస్తారు.
- **అర్హత:** సీఎంఏ ఫౌండేషన్ కోర్సును పూర్తిచేసిన విద్యార్థులు సీఎంఏ ఇంటర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న ఏడాది తర్వాత సీఎంఏ ఇంటర్ పరీక్ష రాయవచ్చు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారు సీఎంఏ ఫౌండేషన్ రాయకుండానే సీఎంఏ ఇంటర్ కోర్సుకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు, శిక్షణ కూడా తీసుకోవచ్చు.

### రిజిస్ట్రేషన్

- ఫౌండేషన్ పరీక్ష పాసైనవారు సీఎంఏ ఇంటర్ రిజిస్ట్రేషన్ కోసం రూ.20 వేలు చెల్లించాలి. సీఎంఏ ఫౌండేషన్ పూర్తిచేసి సీఎంఏ ఇంటర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకునే విద్యార్థులకు సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ వెసులుబాటు కల్పించింది. ఫౌండేషన్ పూర్తిచేసిన వారు ఇంటర్ రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పుడు రూ.20వేలలో రూ.12వేలు చెల్లించి మిగిలిన రూ. 8వేలు మూడు నెలల తర్వాత చెల్లించేందుకు అవకాశం ఉంది.
- సీఎంఏ ఇంటర్ పరీక్ష జూన్‌లో రాయాలంటే అదే ఏడాది జనవరి 31లోగా నమోదు చేసుకోవాలి. డిసెంబర్‌లో పరీక్ష రాయాలంటే జూలై 31లోగా నమోదు చేసుకోవాలి.

### పరీక్ష ఫీజు

- ఒక గ్రూప్‌కి అయితే రూ.1200, రెండు గ్రూపులకు అయితే రూ. 2400
- జూన్‌లో పరీక్ష రాయాలంటే మార్చి 31లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి. డిసెంబర్‌లో పరీక్ష రాయాలంటే సెప్టెంబర్ 30లో ఫీజు చెల్లించాలి.

| గ్రూప్-1 | | |
|---|---|---|
| సబ్జెక్టు | మార్కులు | ఉత్తీర్ణత మార్కులు |
| ఫైనాన్షియల్ అకౌంటింగ్ | 100 | 40 |
| లాస్ అండ్ ఎథిక్స్ | 100 | 40 |
| డైరెక్ట్ ట్యాక్సేషన్ | 100 | 40 |
| కాస్ట్ అకౌంటింగ్ | 100 | 40 |

- నాలుగు పేపర్లలో మొత్తం 400 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఒక్కో సబ్జెక్టులో కనీసం 40 మార్కులు సాధించాలి. మొత్తంగా 200లు, ఆపై మార్కులు సాధించినవారు ఉత్తీర్ణులవుతారు.

| గ్రూప్-2 | | |
|---|---|---|
| సబ్జెక్టు | మార్కులు | కనీస మార్కులు |
| ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ | 100 | 40 |
| కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ | 100 | 40 |
| ఇన్‌డైరెక్ట్ ట్యాక్సేషన్ | 100 | 40 |
| కంపెనీ అకౌంట్స్ అండ్ ఆడిట్ | 100 | 40 |

- ఇందులో కూడా ప్రతి సబ్జెక్టులో కనీసం 40 మార్కులు సాధించాలి. విద్యార్థి వీలును బట్టి రెండు గ్రూపులు ఒకేసారి లేదా విడివిడిగా ఒక్కో గ్రూపు 6 నెలల వ్యత్యాసంతో రాయవచ్చు. సీఎంఏ ఇంటర్ కోర్సు నమోదు చేసుకున్నవారు ఏడాది తరువాత సీఎంఏ ఇంటర్ పరీక్ష రాయవచ్చు.

### సీఎంఏ కోర్సు- ఉత్తీర్ణతా శాతం

- 2017 జూన్‌లో నిర్వహించిన సీఎంఏ పరీక్షలో నమోదైన ఉత్తీర్ణతాశాతాన్ని పరిశీలిస్తే ఈ కోర్సులో రెండో దశ అయిన సీఎంఏ ఇంటర్‌లో 32.36 శాతం, సీఎంఏ చివరి దశ అయిన సీఎంఏ ఫైనల్‌లో 25.12 శాతం నమోదైంది.

### సీఎంఏ ఫౌండేషన్ కోర్సు

- సీఎంఏ కోర్సులోని మొదటి దశను సీఎంఏ ఫౌండేషన్ అంటారు.
- **అర్హత:** ఇంటర్ ఏ గ్రూప్ వారైనా సీఎంఏ ఫౌండేషన్ కోర్సుకు నమోదు చేయించుకుని సీఎంఏ ఫౌండేషన్ కోర్సు చదవచ్చు. అదే ఇంటర్ ఎంఈసీ విద్యార్థులు అయితే ఇంటర్ ఎంఈసీతోపాటు సీఎంఏ ఫౌండేషన్ కోర్సుని సమాంతరంగా పూర్తి చేయవచ్చు.

### రిజిస్ట్రేషన్

- సీఎంఏ ఫౌండేషన్ కోర్సుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్ (10+2) లేదా తత్సమాన పరీక్ష పాస్ అవ్వాలి. సీఎంఏ ఫౌండేషన్ చదవాలంటే ముందుగా రూ. 4000 డీడీ తీయాలి. దాన్ని రిజిస్ట్రేషన్ కోసం పూర్తిచేసిన దరఖాస్తును సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ కోల్‌కతాకు పంపించాలి లేదా దాని అనుబంధ సంస్థలో ఇవ్వాలి. ఈ దరఖాస్తు ఫారాన్ని పొందాలంటే సీఎంఏ శాఖల్లోగాని, సీఎంఏ చాప్టర్‌లో లేదా సీఎంఏ ఇన్ఫర్మేషన్ సెంటర్లలో రూ.250 చెల్లించాలి.
- సీఎంఏ చాప్టర్లు, అనుబంధ సంస్థలు హైదరాబాద్, కొత్తగూడెంలలో ఉన్నాయి. వివరాల కోసం www.icmai.in చూడవచ్చు.

### రిజిస్ట్రేషన్ ఎప్పుడు

- సీఎంఏ ఫౌండేషన్ పరీక్ష జూన్ నెలలో రాయాలంటే అదే ఏడాది జనవరి 31లోగా నమోదు చేసుకుని మార్చి 31లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి. డిసెంబర్‌లో పరీక్ష రాయాలంటే అదే ఏడాది జూలై 31లోగా నమోదు చేసుకుని సెప్టెంబర్ 30లోగా ఫీజు చెల్లించాలి. పరీక్ష ఫీజు రూ. 1200.

### సీఎంఏ ఫౌండేషన్ కోర్సు

- కోర్సులోని మొదటి దశను ఫౌండేషన్ అని వ్యవహరిస్తారు. సీఎంఏ ఫౌండేషన్ కోర్సులోని మొత్తం 8 సబ్జెక్టులను 4 పేపర్లుగా విభజించారు. అంటే రెండు సబ్జెక్టులు కలిసి 1 పేపర్ అన్నమాట. సీఎంఏ ఫౌండేషన్ పరీక్షను 4 పేపర్లుగా విడివిడిగా (రోజుకో పేపర్ చొప్పున) నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో 100 మార్కులకు ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 400 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో 50 శాతం అంటే 200 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులు కావచ్చు. అలాగే ప్రతి పేపర్‌లో 40 శాతం కన్నా ఎక్కువ మార్కులు స్కోర్ చేయాలి.

### సబ్జెక్టులు-వివరాలు

| సబ్జెక్టు | మార్కులు | కనీస ఉత్తీర్ణత మార్కులు |
|---|---|---|
| ఫండమెంటల్స్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ | 100 | 40 |
| ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంటింగ్ | 100 | 40 |
| ఫండమెంటల్స్ ఆఫ్ లాస్ అండ్ ఎథిక్స్ | 100 | 40 |
| ఫండమెంటల్స్ ఆఫ్ బిజినెస్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ | 100 | 40 |

- ఫౌండేషన్ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు సీఎంఏ ఇంటర్ కోర్సు చదవడానికి అర్హత సాధిస్తారు.

### సీఎంఏలకు అవకాశాలు

- కాస్ట్ అకౌంటింగ్ రంగంలో స్థిరపడవచ్చు.
- అకౌంటెంట్లుగా, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించవచ్చు.
- ఫైనాన్షియల్, బిజినెస్ అనలిస్టులుగా అవకాశాలు ఉంటాయి.
- ఆడిటింగ్, ఇంటర్నల్ ఆడిటింగ్, స్పెషల్ ఆడిట్స్ చేయవచ్చు.
- డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సేషన్లు నిర్వహించవచ్చు.
- సిస్టమ్స్ అనాలిసిస్, సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ చేయవచ్చు.
- ఈఆర్పీ హౌసెస్‌లో ప్రాసెస్ అకౌంటెంట్లుగా, కాలేజీలు, మేనేజ్‌మెంట్ సంస్థల్లో అకడమీషియన్లుగా స్థిరపడవచ్చు.
- సీఎంఏ కోర్సును దూరవిద్యా విధానంలో కూడా పూర్తి చేయవచ్చు. దీనిద్వారా ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారు ఈ కోర్సు చేయడం ద్వారా పదోన్నతులు పొందవచ్చు.



మట్టుపల్లి ప్రకాశ్
మాస్టర్ మైండ్స్
హైదరాబాద్
9248733323

# విద్య, ఉద్యోగ సమాచారం

## నేవీలో స్పోర్ట్స్ కోటా పోస్టులు



**భారత రక్షణశాఖ పరిధిలోని ఇండియన్ నేవీ (ఐఎస్) సెయిలర్ పోస్టుల భర్తీకి స్పోర్ట్స్ కోటా ఎంట్రీ-1/2019 బ్యాచ్‌లో చేరటానికి అవివాహిత పురుషుల నుంచి ఇండియన్ నేవల్ అకాడమీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **స్పోర్ట్స్ విభాగాలు:** అథ్లెటిక్స్, ఆక్వాటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, క్రికెట్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, స్క్వాష్, బెస్ట్ ఫిజిక్యూ, కయాకింగ్/కనోయింగ్, ఫెన్సింగ్, గోల్ఫ్, టెన్నిస్, రోయింగ్, షూటింగ్, సెయిలింగ్ అండ్ విండ్ సర్ఫింగ్, ఈక్వెస్ట్రెయిన్ (హార్స్‌పోలో)

**పోస్టులవారీగా అర్హతలు**

- డైరెక్ట్ ఎంట్రీ పెట్టీ ఆఫీసర్: ఏదైనా గ్రూప్‌లో ఇంటర్ లేదా 10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- సీనియర్ సెకండరీ రిక్రూట్‌మెంట్ (ఎస్ఎస్ఆర్): ఏదైనా గ్రూప్‌లో ఇంటర్ లేదా 10+2 లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **మెట్రిక్ రిక్రూట్స్ (ఎంఆర్):** పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.

**గమనిక:** సంబంధిత క్రీడల్లో అంతర్జాతీయ/ జూనియర్ లేదా సీనియర్, నేషనల్ చాంపియన్‌షిప్, సీనియర్ స్టేట్ చాంపియన్‌షిప్, ఆల్ ఇండియా యూనివర్సిటీ చాంపియన్‌షిప్ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **వయస్సు:** డైరెక్ట్ ఎంట్రీ పెట్టీ ఆఫీసర్‌కు 17 నుంచి 22 ఏండ్ల మధ్య, మిగతా పోస్టులకు 17 నుంచి 21 ఏండ్ల మధ్య ఉండాలి.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు: 157 సెం.మీ. ఎత్తుకు తగ్గ బరువు, ఛాతీ ఉండాలి. గాలి పీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ వ్యాకోచించాలి.
- **పే&అలవెన్సులు:** ట్రెయినింగ్‌లో నెలకు రూ. 14,600/- స్టయిఫండ్ ఇస్తారు. శిక్షణ తర్వాత రూ. 21,700-43,100 + రూ. 5,200/- ఎంఎస్‌పీ+ డీఏ చెల్లిస్తారు.
- **పదోన్నతులు:** సెయిలర్ నుంచి మాస్టర్ చీఫ్ పెట్టీ ఆఫీసర్-1 (సుబేదార్‌కు సమాన స్థాయి) వరకు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, స్పోర్ట్స్ ట్రయల్స్ ద్వారా
- అర్హత కలిగిన అభ్యర్థులను ప్రత్యేకమైన నేవల్ కేంద్రాలల్లో ట్రయల్స్ కోసం పిలుస్తారు. ట్రయల్స్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులు, ఐఎన్ఎస్ హమ్లా, ముంబై వద్ద వైద్య పరీక్షలకు హాజరుకావాలి.
- **శిక్షణ:** బేసిక్ ట్రెయినింగ్‌ను ఐఎన్ఎస్ చిల్కాలో ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 26
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

## ఓఎన్‌జీసీలో జూనియర్ అసిస్టెంట్లు



**సూరత్‌లోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) హజీరా ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- మొత్తం ఖాళీలు-36
- **విభాగాలవారీగా ఖాళీలు:** అసిస్టెంట్ టెక్నీషియన్ (మెకానికల్-10, ఎలక్ట్రికల్-2), జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్ (ఫిట్టింగ్-9, డీజిల్-5, ఎలక్ట్రికల్-3, ప్రొడక్షన్, కెమిస్ట్రీ-3)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టు/బ్రాంచీల్లో డిప్లొమా, బీఎస్సీ (కెమిస్ట్రీ), పదోతరగతితోపాటు ఐటీఐ ఉండాలి.
- **వయస్సు:** గరిష్ఠంగా 30 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 370/-, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్లకు ఫీజు లేదు.
- **పే స్కేల్:** ఏ-2 లెవల్ పోస్టులకు రూ. 12,000-27,000/-, ఏ-1 లెవల్‌కు రూ. 11,000-24,000/-,
- **వయస్సు:** 2017 మార్చి 15 నాటికి 18 నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష (సీబీటీ) ద్వారా
- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ. 300/- (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు)
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 24
- **రాతపరీక్ష తేదీ:** ఫిబ్రవరి 24
- **వెబ్‌సైట్:** www.ongcindia.com

## మెట్రోరైల్‌లో 174 ఖాళీలు



**కర్ణాటకలోని బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎమ్ఆర్‌సీఎల్) ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 174
- **విభాగాలవారీగా ఖాళీలు:** మెయింటెనర్-134, జూనియర్ ఇంజినీర్-21, సెక్షన్ ఇంజినీర్-19
- **అర్హత :** మెయింటెనర్ పోస్టులకు మెట్రిక్యులేషన్ తోపాటు సంబంధిత ఇంజినీరింగ్ ట్రేడుల్లో ఐటీఐ, జూనియర్ ఇంజినీర్ పోస్టులకు సంబంధిత బ్రాంచీల్లో మూడేండ్ల ఇంజినీరింగ్ డిప్లొమా, సెక్షన్ ఇంజినీర్ పోస్టులకు సంబంధిత బ్రాంచీల్లో ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** మెయింటెనర్ పోస్టులకు రూ. 10,170-18,500/-, జూనియర్ ఇంజినీర్ పోస్టులకు రూ. 14000-26950/-
- సెక్షన్ ఇంజినీర్ పోస్టులకు రూ. 16,000-30,770/-
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.826/- ఎస్సీ/ఎస్టీలకు రూ. 354/-
- **ఎంపిక:** రాతపరీక్ష, మెడికల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 2
- **వెబ్‌సైట్:** www.bmrc.co.in

## ఎన్ఐఆర్‌డీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ



**హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీ పీఆర్) ఖాళీగా ఉన్న ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్-3 ఖాళీలు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 10
- **వెబ్‌సైట్:** www.nird.org.in

## ప్రాజెక్ట్ ఇంటర్న్‌లు

**పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (డీఐఏటీ)లో జేఆర్ఎఫ్, ఇంటర్న్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-1
- **అర్హత:** ఎంఈ/ఎంటెక్
- **స్టయిఫండ్:** నెలకు రూ.25వేలు.
- **పోస్టు:** వాలంటరీ ప్రాజెక్ట్ ఇంటర్న్స్
- **అర్హత:** ఎంఈ/ఎంటెక్ (రెండోసంవత్సరం) లేదా బీఈ/బీటెక్ (ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు)
- **వయస్సు:** పై రెండు పోస్టులకు 28 ఏండ్లు మించరాదు.

**నోట్:** ఈ పోస్టులు 12 నెలల కాలపరిమితికి భర్తీ చేస్తున్నారు.

- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 18
- **వెబ్‌సైట్:** www.diat.ac.in

## సుడోకు

డైలీ సుడోకు 29 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 4 | 1 | 3 | 6 | 7 | 5 | 2 | 9 |
| 2 | 9 | 3 | 4 | 5 | 8 | 6 | 1 | 7 |
| 5 | 6 | 7 | 9 | 2 | 1 | 8 | 3 | 4 |
| 4 | 8 | 2 | 6 | 3 | 5 | 7 | 9 | 1 |
| 9 | 7 | 5 | 1 | 8 | 4 | 3 | 6 | 2 |
| 1 | 3 | 6 | 7 | 9 | 2 | 4 | 8 | 5 |
| 7 | 1 | 8 | 2 | 4 | 3 | 9 | 5 | 6 |
| 3 | 2 | 9 | 5 | 7 | 6 | 1 | 4 | 8 |
| 6 | 5 | 4 | 8 | 1 | 9 | 2 | 7 | 3 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

### డైలీ సుడోకు -30

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | 7 | | 4 | | |
| 2 | | | 3 | | 5 | 6 | | 9 |
| | 8 | | | 6 | 9 | 1 | | |
| | 1 | 7 | | 3 | | | | |
| 8 | 9 | | | | | | | |
| | | 2 | 1 | 4 | | | | |
| 9 | | | | | | | 3 | |
| | 4 | | | | | 9 | | |
| | | 3 | 2 | | | | | 6 |

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
సోమవారం 7 జనవరి 2019



# పదిలో పదికి పది..!

**పదోతరగతి పరీక్షలు మార్చి 16న ప్రారంభం కానున్నాయి. ఎంతో కష్టపడి చదివిన విద్యార్థులు ఈ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కొందరు విద్యార్థులకు పరీక్షలంటే భయం.. టెన్షన్ ఉంటుంది. అందుకే రాత్రింబవళ్లు ఆతృతతో చదువుతుంటారు. కానీ నిద్రపోకుండా అతిగా మేల్కొని ఉండటంతోపాటు సరైన టైం మేనేజ్‌మెంట్, ఆహార నియమాలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవు. పరీక్షలు బాగా రాసి మంచి గ్రేడ్ తెచ్చుకోవాలంటే.. కింద పేర్కొన్న సూచనలు పాటించండి.**

## విషయ అవగాహనకే అధిక ప్రాధాన్యం

- పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బట్టీ పట్టి అవగాహన లేకున్నా మార్కులు సాధించగల సాంప్రదాయ పరీక్షా విధానం నుంచి సమగ్ర మూర్తిమత్వం సాధించడానికి వీలుగా నిరంతర సమగ్ర మూల్యాంకన పద్ధతిలో జరుగుతున్నాయి. అందువల్ల ఈ విధానానికి అలవాటు పడటానికి బాగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. 'సి' గ్రేడ్ విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండి ప్రత్యేక సూచనలను పాటించాలి. పరీక్షా విధానంపై ఇప్పటికే బాగా అవగాహన కలిగి ఉంటుంది. నూతన సిలబస్‌లో విషయ అవగాహనకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. పాఠ్యవిషయాన్ని తగ్గించి కేవలం ముఖ్యాంశాలను విశదీకరిస్తూ వాటిపై జ్ఞానం, అవగాహన, వినియోగం, నైపుణ్యం, నిత్యజీవిత అన్వయానికి సంబంధించిన ప్రశ్నలను ఇచ్చారు. అందువల్ల విద్యార్థులు గతంలా కేవలం గుర్తించడం, జ్ఞప్తికి తెచ్చుకోవడంలోనే కాకుండా చేయడం(పని అనుభవం), స్వీయ రచన, బృందచర్చ ద్వారా నేర్చుకోవడం అనే విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

## బట్టీ విధానానికి స్వస్తి

- కేవలం చదివి బట్టీ పడితే సరిపోతుందనుకోవద్దు. ప్రశ్నలను నిజ జీవితానికి అన్వయిస్తూ అడుగుతారు. ప్రశ్నలకు సూటిగా సమాధానాలు ఉండవు. విద్యార్థి తన అవగాహనకు అనుగుణంగా సమాధానాలు రాసే వీలుంది. ప్రస్తుత విధానంలో అన్ని పాఠాలను విధిగా చదివి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

## మూల్యాంకన విశ్లేషణ

- హిందీ మినహా మిగతా భాష, భాషేతర సబ్జెక్టులకు రెండు పేపర్లు. ఒక్కో పేపర్‌లో 50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో 40 మార్కులకు పబ్లిక్ పరీక్ష, 10 మార్కులకు నిరంతర సమగ్ర మూల్యాంకన పద్ధతిలో పాఠశాలలో ఫార్మటివ్ మూల్యాంకనం ద్వారా ఉపాధ్యాయులు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 1/2 గంటలు అయితే ప్రశ్నపత్రాన్ని చదవడానికి 15 నిముషాల సమయం

## నిర్మాణాత్మక (అంతర్గత) మూల్యాంకనం

- పాఠశాలలో నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకన పరీక్షలు నిర్వహిస్తారు. నిర్మాణాత్మక మూల్యాంకనం నుంచి తీసుకునే 20 మార్కుల్లో కనీసం 7 మార్కులు సాధించాలి. ఒక నిర్మాణాత్మక మదింపునకు 50 మార్కులుంటాయి. ఇందులో వ్యక్తిగత ప్రతిస్పందనలకు 10 మార్కులు, పాఠ్య పుస్తక ప్రశ్నలకు (రాతపని) 10 మార్కులు, ప్రాజెక్ట్ వర్క్‌కు 10 మార్కులు, స్లిప్ టెస్ట్‌కు 20 మార్కులు ఉంటాయి. నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకన మొత్తాన్ని '5' కు కుదించి ఫలితం ఇస్తారు. 10 మార్కుల మొత్తాన్ని 8తో, 20 మార్కుల మొత్తాన్ని 16తో భాగించడం ద్వారా '5' కి కుదించి మొత్తం 20 మార్కుల ఫలితాన్ని అంతర్గత మదింపుగా బోర్డుకు అందచేస్తారు. ఇందులో కనీస మార్కుల నిబంధనలేదు. జీవ, భౌతిక శాస్త్రాలకు కలిపి 20 మార్కులకు నిర్మాణాత్మక మూల్యాంకనం చేస్తారు. ఈ 20 మార్కుల్లో జీవ, భౌతిక శాస్త్రాలకు 10 మార్కుల చొప్పున కేటాయించారు. 10 మార్కులకు గాను 3 1/2 మార్కులు పొందాలి. మొత్తం 7 మార్కులు సాధించాలి. మిగతా విషయాల్లో 20 మార్కులకుగాను 7 మార్కులు పొందాలి.

- ప్రతి అధ్యాయంలో సూత్రాలను, భావనలను వాటిద్వారా సాధించగలిగే సమస్యలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి భావన మీద సమస్యలను స్వయంగా రూపొందించుకుని సాధనచేయాలి.
- పాఠ్యపుస్తకంలో ఉన్న సమస్యలు పరీక్షలో నేరుగా అడగరు. వాటిని మార్చి అవే స్వభావంగల ప్రశ్నలు ఇస్తారు.
- వ్యాసరూప ప్రశ్నలకు ఎక్కువ వెయిటేజీ ఉంటుంది.
- సమితులు, శ్రేఢులు, సిద్ధాంతాలు, నిరూపక జ్యామితి, సాంఖ్యక శాస్త్రం, సరూప త్రిభుజాలు, క్షేత్రమితి, త్రికోణమితి అనువర్తనాల నుంచి వ్యాసరూప ప్రశ్నలు రూపొందించే అవకాశం ఉంది.
- గణితంలో పేపర్-1లో వాస్తవ సంఖ్యలు, సమితులు, శ్రేఢులు, నిరూపక జ్యామితి తేలికైనవి.
- పేపర్-2లో సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత తేలికైనవి.
- మాదిరి సమస్యల కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చూడండి.

## జీవ, భౌతికశాస్త్రాల్లో 'పటాలు' కీలకం

- జీవ, భౌతికశాస్త్ర సబ్జెక్టుల్లో మార్కుల సాధనకు పటాలు కీలకమైనవి.
- విద్యార్థులు పటాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రాక్టీస్ చేయాలి. పటాల నిర్మాణం, పనిచేసే విధానాల గురించి బాగా చదవాలి.
- ఏ ప్రశ్నను ఎలా తిప్పి అడిగే అవకాశం ఉందో ముందే ఊహించుకుని చదువు కొనసాగించాలి.
- విద్యాప్రమాణాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపకల్పన జరుగుతుంది కాబట్టి అన్ని అధ్యాయాలు ముఖ్యమైనవే.
- పాఠ్య పుస్తకంపై పూర్తి అవగాహన కలిగి ముఖ్య భావనలు, ఫార్ములాలను గుర్తుంచుకోవాలి.
- ఒకే ప్రశ్నను వివిధ రకాల ప్రశ్నలుగా మార్పు చేసుకుని సమాధానాలు రాయడం నేర్చుకోవాలి.
- విద్యార్థి తన అవగాహనను బట్టి సమాధానాలు రాయవచ్చు.
- అడిగే ప్రతి ప్రశ్న బహుళ సమాధానాలకు అవకాశం కల్పించేదిగా ఉంటుంది.
- పటాలను సాధన చేస్తూ, భావనలను పటాల ద్వారా వివరించడం, అసంపూర్తిగా ఉన్న పటాన్ని పూర్తిచేయడం, సందర్భాన్ని బట్టి పటాలను గీయ గలగడం సాధన చేయాలి.
- జీవశాస్త్రంలో మూసపద్ధతిలో బట్టీ పట్టకుండా శరీర భాగాలు-వ్యవస్థలు, పనితీరు, నియంత్రణ, ప్రకృతి అంశాలను బాగా అవగాహన చేసుకోవాలి.
- సీబీఎస్‌ఈ ప్రశ్న పత్రాలను సేకరించుకుని వాటిలో ఇచ్చిన ప్రశ్నల సరళి గమనించి సాధనచేస్తే మంచి గ్రేడ్ పొందవచ్చు.



- భౌతికశాస్త్రంలో ఉష్ణం, కాంతి, విద్యుత్ అధ్యాయాలు అతి ముఖ్యమైనవి.
- ప్రయోగాలు-క్షేత్ర పర్యటనలు అనే సామర్థ్యం నుంచి కచ్చితంగా 4 మార్కుల ప్రశ్న అడుగుతున్నారు. అందుకు ప్రయోగ కృత్యాలైన దర్పణాలు, ఓమ్ నియమ నిరూపణ, కటకాల నాభ్యంతరం కనుక్కునే విధానం, ఆమ్లద్రావణాల విద్యుత్ వాహకత ప్రయోగం, ఇనుము తుప్పుపట్టే విధానం వంటి ప్రయోగాలు, కృత్యాలు, పరికరాలు, ప్రయోగ విధానం, జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలి.
- సమాచార సేకరణ నైపుణ్యం అనే సామర్థ్యం నుంచి కొంత సమాచారం పట్టిక రూపంలో అడిగి దాని ఆధారంగా 4 మార్కులకు ప్రశ్నలు అడుగుతున్నారు. అలాగే బొమ్మలు గీయడం-నమూనాల తయారీ సామర్థ్యం నుంచి ఒక ఒక మార్కు, ఒక రెండుమార్కుల ప్రశ్నలు అడుగుతున్నారు. వీటి కోసం దర్పణాలు, కటకాలు వివిధ సందర్భాల్లో ఏర్పరిచే ప్రతిబింబాల గురించి, దృష్టిలోపాల గురించి, దండయస్కాంతం ఏర్పరిచే బలరేఖల గురించి, విద్యుత్ ప్రవాహ వలయాల గురించి అవగాహన కలిగి ఉండాలి.
- రసాయన శాస్త్రంలో పరమాణు నిర్మాణం, రసాయనబంధం, రసాయన చర్యలు, సమీకరణాలు, సమీకరణాలు తుల్యం చేయడం, ఆమ్లాలు-క్షారాలు, మూలకాల వర్గీకరణ, ఆవర్తన పట్టిక, కార్బన్ దాని సమ్మేళనాలు, నూతన అధ్యాయం లోహ సంగ్రహణంపై ఎక్కువ దృష్టి సారించాలి.

**జీవ, భౌతికశాస్త్ర విద్యాప్రమాణాలు - భారత్వం**

AS 1 - విషయావగాహన - 40 % - 16 మార్కులు
AS 2 - ప్రశ్నించడం, పరికల్పన చేయడం - 10% - 4 మార్కులు
AS 3 - ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు - 15% - 6 మార్కులు
AS 4 - సమాచార సేకరణ నైపుణ్యం, ప్రాజెక్టు పనులు - 15% - 6 మార్కులు
AS 5 - బొమ్మలు గీయడం, నమూనాల తయారీ - 10% - 4 మార్కులు
AS 6 - అభినందన, సౌందర్యాత్మక స్పృహ, విలువలు పాటించడం, AS 7 - నిజ జీవిత వినియోగం, జీవ వైవిధ్యాన్ని గుర్తించి కాపాడటం - 10% - 4 మార్కులు

## గణిత విద్యాప్రమాణాలు

- సమస్యా సాధన - 40% - 32 మార్కులు
- కారణాలు విశ్లేంచి నిరూపించడం - 20 % - 16 మార్కులు
- వ్యక్త పరచడం - 10% - 8 మార్కులు
- అనుసంధానం - 15 % - 12 మార్కులు
- దృశ్యీకరణ - ప్రాతినిధ్య పర్చడం - 15% - 12 మార్కులు

## తెలుగు విద్యాప్రమాణాలు - మార్కులు

**పేపర్-1**
- స్వీయ రచన - 30 మార్కులు
- పదజాలం - 10 మార్కులు

**పేపర్-2**
1. అవగాహన, ప్రతిస్పందన (పఠన అవగాహన) - 20 మార్కులు
2. సృజనాత్మక వ్యక్తీకరణ - 10 మార్కులు
3. వ్యాకరణాంశాలు - 10 మార్కులు

- పాఠ్యాంశాలను చదివేటప్పుడు శ్రద్ధ, సమయ పాలన, ఖచ్చితత్వం అవశ్యం.
- సంధులలో సవర్ణ దీర్ఘ, గుణ, త్రిక సంధుల ఉదాహరణలను బాగా చదవాలి.
- వ్యాసరచన ప్రశ్నల్లో ఎక్కువగా అడిగే అవకాశమున్న పండుగలు, సమకాలీన అంశాలు, ఎయిడ్స్ వ్యాధి, ప్రపంచీకరణ, ప్రకృతి విపత్తుల వంటి అంశాలపై బాగా అవగాహన పెంచుకోవాలి.
- ప్రకృతి వికృతులు, పద్య లక్షణాలు, పర్యాయ పదాలు, వ్యుత్పత్తి అర్థాలు, అలంకారాలు, నానార్థాలు, చందస్సు, పరోక్ష వాక్యాలు, సంయుక్త వాక్యాలు, విగ్రహవాక్యాలు, సమాసానికి ఉదాహరణలపై అవగాహన పెంచుకుంటే మార్కులు సులభంగా పొందవచ్చు.
- ప్రతిపాఠం కవి- కవి పరిచయం, శతక పద్యాలు- భావాలు, పాఠ్య పుస్తకం వెనుక ఉన్న ఉదాహరణలు, వ్యాకరణాంశాలు ప్రాక్టీస్ చేయాలి.
- అర్థ సందర్భాలు సందర్భానికి తగినట్లుగా రాయాలి.
- జాతీయానికి, సొంత వాక్యాలకు ఉన్న తేడాను గమనించి సమాధానాలు రాయాలి.
- రెండవ పేపర్‌లో పఠన అవగాహనలో తెలిసిన, తెలియని గద్యపద్య అంశాలను చదివి అవగాహన చేసుకుని సమాధానాలు రాస్తే తేలికగా 20 మార్కులు పొందవచ్చు.
- గైడ్ కన్నా పాఠ్యపుస్తకానికే ప్రాధాన్యం ఇవ్వాలి.
- దస్తూరి అందంగా ఉంటే మరిన్ని మార్కులు పొందవచ్చు.

## ఆంగ్లం

**రాసే అంశాలు తక్కువ - మార్కులు ఎక్కువ**

అర్థాలు ... స్పెల్లింగ్‌పై పట్టు సాధించాలి

- ఆంగ్లభాషపై ఉన్న అపోహలు, ఆందోళలను విస్మరించి ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో చదువుకుంటే గ్రామీణ విద్యార్థులు సైతం పదికి 10 గ్రేడ్ పాయింట్లు సాధించవచ్చు. ఆంగ్లంలో ప్రతి అంశంపై ప్రాథమిక అవగాహన ఉంటే అత్యధిక మార్కులు స్కోర్ చేయవచ్చు.

**విద్యాప్రమాణాలు**
**పేపర్-1, పేపర్-2**

ఎ) రీడింగ్ కాంప్రహెన్షన్ - 15 మార్కులు
బి) వొకాబులరీ, గ్రామర్ - 10 మార్కులు
సి) క్రియేటివ్ రైటింగ్ - 15 మార్కులు

- ఇంగ్లిష్ రీడర్‌లోని పాఠాలు, పోయమ్స్‌కు సంబంధించిన ముఖ్యాంశాలను అవగాహన చేసుకుని ముఖ్యమైన పాయింట్లు గుర్తుంచుకుంటే పేపర్-1లోని ఏ ప్రశ్నకైనా సులభంగా సమాధానం రాయవచ్చు.
- ప్రశ్నాపత్రంలో గద్య, పద్య భాగాలను చదివి అవగాహన చేసుకుని అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాస్తే తేలికగా 15 మార్కులు సాధించవచ్చు.

## సోషల్‌లో విషయ అవగాహనకే ప్రాధాన్యం

**సోషల్‌లో విద్యాప్రమాణాలు - మార్కులు**
**విషయ అవగాహన - 16 మార్కులు**
**వ్యాఖ్యానించడం - 4 మార్కులు**
**సమాచార నైపుణ్యం - 6 మార్కులు**
సమకాలీన అంశాలపై ప్రతిస్పందన - 4 మార్కులు
పట నైపుణ్యాలు - 6 మార్కులు
ప్రశంస, సున్నితత్వం - 4 మార్కులు

- ప్రశ్నలు విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న జ్ఞానాన్ని, అవగాహన సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని పరీక్షించేలా రూపొందిస్తారు.
- పేపర్-1లో మొదటి భాగమైన వనరుల అభివృద్ధి, సమానత (భూగోళం, అర్థశాస్త్రం), పేపర్-2 లో రెండవ భాగమైన సమకాలీన ప్రపంచం, భారతదేశం (చరిత్ర, పౌరశాస్త్రం) అనే పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- పట నైపుణ్యాన్ని బాగా సాధన చేయాలి. పాఠశాలలోనే కాకుండా ఇంటివద్ద కూడా ఇండియా, వరల్డ్ మ్యాప్‌లలో ప్రధాన ప్రాంతాల, అంశాల ఉనికిని స్వయంగా ప్రాక్టీస్ చేయాలి.
- పేపర్-1లో భారతదేశ పటం, పేపర్-2లో ప్రపంచ పటం ఇస్తారు.
- సమకాలీన అంశాలపై ప్రతిస్పందనకు ప్రతిరోజు దినపత్రికను చదవాలి.

- వాక్య దోషాలను సరిచేయడం, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్‌పై ఇచ్చిన వ్యాసంలో ఉన్న ఖాళీలను పూరించడం ప్రాక్టీస్ చేయాలి.
- ఇచ్చిన గద్యభాగాన్ని చదివి స్వయంగా సంభాషణా రూపంలో గానీ, ప్రోఫైల్ రూపంలోగానీ, సందేశ రూపంలోగానీ రాయగలిగేలా సిద్ధమవ్వాలి.
- టెక్స్ట్ బుక్ లో ప్రతి యూనిట్ వెనుక ఉన్న గ్రామర్ ప్రాక్టీస్ చేయాలి.
- పేపర్-2లో ఉన్న అన్‌సీన్ ప్యాసేజ్, అన్‌సీన్ పోయమ్‌లను బాగా చదివి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాస్తే తేలికగా 15 మార్కులు సాధించవచ్చు. అందుకు అనుగుణంగా ప్రిపేర్ కావాలి.
- వ్యాకరణాంశాల్లో పదాలకు అర్థాలు, సరైన సమాధానాలను గుర్తించగలగాలి.
- బిజినెస్, పర్సనల్ లెటర్స్ రాయడం నేర్చుకోవాలి. సందర్భోచిత లేఖలు, బయోగ్రాఫికల్ స్కెచ్, కన్వర్జేషన్, బయోడేటా తయారీ వంటి అంశాలపై దృష్టి పెడితే ఉపయోగకరం.
- ఏదైనా విషయంపై వ్యాసం లేదా రిపోర్టు రాయగలిగేలా సిద్ధం కావాలి. అందుకు పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలు చిల్డ్రన్స్‌డే, టీచర్స్‌డే, రిపబ్లిక్‌డే వంటి వాటిపై అవగాహనతో రాయగలిగేలా సిద్ధం కావాలి.

## కాలం విలువైనది - సమయపాలన అవసరం

- బద్ధకాన్ని, వాయిదా తత్వాన్ని వీడి చదువుపైనే పూర్తి దృష్టి సారించండి. కాలం ఎంతో విలువైనది. పరీక్షా సమయాల్లో ప్రతి క్షణం కీలకమైనది.
- మీకు అనుకూలమైన టైమ్ మేనేజ్‌మెంట్ రూపొందించుకుని చదవడానికి ప్రయత్నించండి.
- ఉదయం 4 నుంచి 6 గంటల వరకు కఠినమైన సబ్జెక్టు చదవడం, ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సులభమైన సబ్జెక్టు చదవడం, ఉదయం 7 నుంచి 7.30 వరకు కాలకృత్యాలు, టిఫిన్, ఉదయం 8.00 నుంచి 12.30 వరకు పాఠశాలలో స్టడీ అవర్స్, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు భోజనం, కొద్దిసేపు విశ్రాంతి,మధ్యాహ్నం 1.30 నుంచి 5.30 వరకు పాఠశాలలో స్టడీ ఆవర్స్,సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు రిఫ్రెష్ మెంట్, రాత్రి భోజనం, సాయంత్రం 6.30 నుంచి 8.30 వరకు కఠినమైన సబ్జెక్టు చదవడం, రాత్రి 8.30 నుంచి 11.00 వరకు సులభమైన సబ్జెక్టు చదవడం, రాత్రి 11.00కు నిద్రపోవడం చేయాలి.
- మధ్యలో ప్రతి గంటకోసారి 10 నిమిషాలు రిలాక్స్ అవుతూ చదువు కొనసాగిస్తే రోజులో కనీసం 14 గంటలు ప్రణాళికా బద్ధంగా కృషి చేసినట్లవుతుంది.

## రివిజనే ముఖ్యం

- వివిధ సబ్జెక్టుల్లో ఇప్పటివరకు చదివి ఉన్న అంశాలనే మళ్లీమళ్లీ పునఃశ్చరణ చేయాలే తప్ప నూతన అంశాలను చదవకపోవడమే మంచిది. నూతన అంశాలతో తికమకపడే అవకాశం ఉంటుంది.

## చేతిరాత కీలకం

- సరళమైన చేతిరాతతో ఎగ్జామినర్లను ఆకట్టుకోవచ్చు. చేతిరాత చదివేందుకు వీలుగా ఉండాలి. జవాబులను సరైన హెడ్డింగ్స్, సబ్ హెడ్డింగ్స్ పెట్టి పాయింట్‌వైజ్‌గా రాయాలి. ప్రధానాంశాలను అండర్‌లైన్ చేయాలి. కాగితంపై ఒత్తిపట్టి రాయవద్దు. పరీక్ష రోజే కొత్త పెన్నుతో రాయకుండా రెండురోజుల ముందుగానే ఆ పెన్నుతో రాస్తూ అలవాటు చేసుకోవాలి.

## సమతుల ఆహారం అవశ్యం

- ఈ సమయంలో సమతుల ఆహారం చాలా ముఖ్యం.
- అరటి పండుతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.
- స్వీట్లు, శీతల పానీయాలు, పానీపూరి, చాక్లెట్లు వంటి వాటికి దూరంగా ఉండాలి. లేకపోతే అతి నిద్ర ఆవహించి చదువుకు భంగం కలుగుతుంది.

## ఏకాగ్రత

- పరీక్ష హాల్లో మనసును ప్రశాంతంగా ఉంచుకుని ఒత్తిడికి గురికాకుండా ప్రశ్నపత్రం తీసుకోగానే క్షుణ్ణంగా చదివి వెంటనే ఓ ప్రణాళిక రూపొందించుకోవాలి. బాగా వచ్చిన ప్రశ్నలు, కొద్ది లోపంతో వచ్చిన ప్రశ్నలు, రాని ప్రశ్నలను గుర్తించి.. మొదట బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాసి తర్వాత మిగతా వాటికి రాయాలి. నిర్ణీతకాలంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా జాగ్రత్తపడాలి.
- **పరీక్షా సమయం:** సాధారణంగా ఉదయం 9.30 నుంచి 12.15 వరకు

## 2019 పరీక్షల టైమ్ టేబుల్

| | | |
|---|---|---|
| 16.03.2019 | శనివారం | తెలుగు పేపర్ - 1 |
| 18.03.2019 | సోమవారం | తెలుగు పేపర్ - 2 |
| 19.03.2019 | మంగళవారం | హిందీ (ఉదయం 9.30 - 12.45 వరకు) |
| 20.03.2019 | బుధవారం | ఆంగ్లం పేపర్ - 1 |
| 22.03.2019 | శుక్రవారం | ఆంగ్లం పేపర్ - 2 |
| 23.03.2019 | శనివారం | గణితం పేపర్ - 1 |
| 25.03.2019 | సోమవారం | గణితం పేపర్ - 2 |
| 26.03.2019 | మంగళవారం | భౌతిక రసాయన శాస్త్రం (సైన్స్ పేపర్-1) |
| 27.03.2019 | బుధవారం | జీవశాస్త్రం (సైన్స్ పేపర్-2) |
| 28.03.2019 | గురువారం | సోషల్ పేపర్ - 1 |
| 29.03.2019 | శుక్రవారం | సోషల్ పేపర్ - 2 |
| 30.03.2019 | శనివారం | ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) (ఉదయం 9.30 - 12.45 వరకు) |
| 01.04.2019 | సోమవారం | ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) (ఉదయం 9.30 - 12.45 వరకు) |
| 02.04.2019 | మంగళవారం | ఎస్సెస్సీ వొకేషనల్ కోర్స్ (థియరీ) (ఉదయం 9.30 -11.30 వరకు) |



మహమ్మద్ సలీం షరీఫ్
మండల విద్యాధికారి, నడి గూడెం
సూర్యాపేట జిలా
9948506786.

## ప్రశ్నల స్వరూపం - మార్కుల వారీగా భారత్వం

**తెలుగు: పేపర్-1**
**స్వీయ రచన - 30 మార్కులు**
అ) 5 లేక 6 వాక్యాల్లో సమాధానాలు రాసేవి నాలుగు ప్రశ్నలు - 4 X 3 = 12
ఆ) అంతర్గత చాయిస్‌తో మూడు వ్యాసరూప ప్రశ్నలు - 3 X 6 = 18
**పదజాలం - 10 మార్కులు**
అ) బహుళైచ్ఛిక ప్రశ్నలు 16 - 16 X 1/2 = 8
ఆ) ఒక వాక్య సమాధాన ప్రశ్నలు రెండు - 2 X 1 = 2
**తెలుగు: పేపర్-2**
**1. అవగాహన, ప్రతిస్పందన (పఠన అవగాహన) - 20 మార్కులు**
**2. సృజనాత్మక వ్యక్తీకరణ - 10 మార్కులు**
**3. వ్యాకరణాంశాలు - 10 మార్కులు**
**హిందీ:** ఒక్క పేపర్ - 80 మార్కులు - సమయం 3 గంటలు.
1. అవగాహన, ప్రతిస్పందన (పఠన అవగాహన) - 20 మార్కులు (5+5+5+5)
2. సృజనాత్మక వ్యక్తీకరణ - 40 మార్కులు (12+18+5+5)
3. వ్యాకరణాంశాలు - 10 మార్కులు
**ఆంగ్లం: పేపర్-1, పేపర్-2**
ఎ) రీడింగ్ కాంప్రహెన్షన్ - 15 మార్కులు
బి) వొకాబులరీ, గ్రామర్ - 10 మార్కులు
సి) క్రియేటివ్ రైటింగ్ - 15 మార్కులు



**భాషేతర సబ్జెక్టులు:**

| | | | |
|---|---|---|---|
| వ్యాసరూప ప్రశ్నలు - 4 | 4 మార్కులు | - మొత్తం 16 మార్కులు | - అంతర్గత చాయిస్ ఉంటుంది. |
| లఘు సమాధాన ప్రశ్నలు - 6 | - 2 మార్కులు | - మొత్తం 12 మార్కులు | - చాయిస్ ఉండదు |
| ఒక్కమార్కు సంక్షిప్త సమాధాన ప్రశ్నలు - 7 | - 1 మార్కు | - మొత్తం 7 మార్కులు | - చాయిస్ ఉండదు |
| బహుళైచ్ఛిక ప్రశ్నలు - 10 | - 1/2 మార్కు | - మొత్తం 5 మార్కులు | - చాయిస్ ఉండదు |

**ఒక్కో పేపర్‌కు మొత్తం 40 మార్కులకుగాను 14 మార్కుల చొప్పున రెండు పేపర్లలో కలిపి 28 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత.**

## విద్యా ప్రమాణాలను గుర్తించగలగడం ముఖ్యం

- గతంలో ప్రశ్నపత్రాలను అధ్యాయాల వారీగా మార్కుల వెయిటేజీతో రూపొందించేవారు. ఫలితంగా ఏవో కొన్ని ముఖ్య అధ్యాయాలను చదివితే సరిపోయేది కాని ప్రస్తుతం ప్రశ్నపత్రాన్ని విద్యాప్రమాణాలకు అనుగుణంగా రూపకల్పన చేస్తున్నారు. దీనివల్ల ఏవో కొన్ని అధ్యాయాలను చదివితే సరిపోదు. అన్ని అధ్యాయాలను చదవాల్సిందే.

## అవగాహనతోనే 'గణితం'లో అందలం

- గణిత విద్యా ప్రమాణాలను అవగతం చేసుకుని పట్టుసాధిస్తే గణితంలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించవచ్చు.
- ఏ అధ్యాయం నుంచైనా ఎన్ని ప్రశ్నలైనా అడగవచ్చు. ప్రతి అధ్యాయం కీలకమే.

## 'తెలుగు'ను తేలికగా తీసుకోకండి...

**కొద్దిగా శ్రమిస్తే పదికి పది పాయింట్లు మీకే...**

- తొలి పరీక్ష కావడంవల్ల భయాందోళన, ప్రాథమిక అంశాలు, వ్యాకరణం, పద్య రచనల్లో విద్యార్థులకు అభిరుచి లేకపోవడం, తేలికైన తెలుగులో తక్కువ మార్కులు రావడానికి కారణమవుతున్నాయి. మాతృభాషే కదా చాలా సులభమనే భావనతో విద్యార్థులంతా అతి ఆత్మవిశ్వాసంతో చివరికి ఫెయిల్ అయి బాధ పడుతుంటారు. తెలుగులో మంచి మార్కుల సాధనకు మార్గాలు అనేకం ఉన్నాయి. మాతృభాషపై మమకారం పెంచుకుని, చిన్నచిన్న మెళకువలను పాటిస్తూ, కొద్దిగా శ్రమిస్తే పదిలంగా పది పాయింట్లు దక్కించుకోవచ్చు.

## హిందీ

## రేటింగ్ పెంచే 'హిందీ'

- హిందీ పరీక్ష ఒకే పేపర్ 80 మార్కులకు జరుగుతుంది. దీనికి సమయం 3 గంటలు ఉంటుంది. జాతీయభాష హిందీలో అధికశాతం మార్కులు సాధించడంలో పదవ తరగతి విద్యార్థులు విఫలమవుతున్నారు. హిందీలో 10కి 10 సాధించిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. భాషపై భయాన్ని వీడి అర్థం చేసుకుని ఆకళింపు చేసుకుంటే హిందీలో కూడా 10కి 10 మార్కులు సులభంగా సాధించవచ్చు. హిందీ భాషపై అవగాహన లోపించడం, చిన్నచిన్న పదాలకు అర్థాలు తెలుసుకోలేకపోవడం, తప్పులతో కూడిన దస్తూరి విద్యార్థుల వైఫల్యానికి ప్రధాన కారణం. ఆరో తరగతి నుంచే భాషలో బలమైన పునాదులుపడేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**విద్యాప్రమాణాలు**
1. అవగాహన, ప్రతిస్పందన (పఠన అవగాహన) - 20 మార్కులు
2. అభివ్యక్తీకరణ సృజనాత్మకత - 40 మార్కులు
3. వ్యాకరణాంశాలు - 20 మార్కులు

- చిన్నచిన్న పదాలతో హిందీని తేలికగా రాయవచ్చు. ఇవే భాషకు మూలం. రాసేటప్పుడు అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడాలి. లేకపోతే ఆ పదానికి అర్థమే మారిపోతుంది.
- ఎక్కువ మార్కులు సాధించగలిగే వ్యాసరూప ప్రశ్నలు, స్వీయ రచనలపై పట్టు సాధించాలి.
- పాఠ్య పుస్తక చివర ఉన్న బిట్లను చదివితే 30 మార్కులు తేలికగా సాధించుకోవచ్చు.
- చుక్క పద్యాలు కంఠస్థం చేయడమేకాక రాయడం, వాటి భావాలను చదివి రాయడం అభ్యాసం చేయాలి.
- లేఖల్లో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ మిత్రునికి లేఖ, చుట్టీ పత్ర్ ఎక్కువగా అడుగుతుంటారు. వీటిని బాగా చదువుకోవాలి.
- ప్రశ్నాపత్రంలో పార్ట్-ఏ లో గద్య, పద్య భాగాలను చదివి అవగాహన చేసుకుని అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాస్తే తేలికగా 20 మార్కులు సాధించవచ్చు.
- సంధి విచ్ఛేదనం, విశేషణం, ముహావరా (జాతీయాలు), లింగ్ బదల్‌నా, వచన్ బదల్‌నా వంటి శబ్ద, వాక్య సంబంధ వ్యాకరణాంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం తప్పనిసరిగా కలిగి ఉండాలి.


నయనతార

## గుర్తుపట్టలేనంతగా..!

ఈ ఫొటోలో నలుపు రంగులో కనిపిస్తున్న కథానాయికను గుర్తుపట్టారా? ఆమె ఎవరో కాదు నయనతార. గ్లామర్ తళుకులతో సుదీర్ఘ కాలంగా దక్షిణాది ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న ఆమె తాజా తమిళ చిత్రం 'ఐరా'లో నల్లటి శరీర వర్ణ ఛాయతో కనిపిస్తున్నది. హారర్, సస్పెన్స్, థ్రిల్లర్ హంగుల మిళితంగా రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార ద్విపాత్రాభియనం చేస్తున్నది. పల్లెటూరి యువతి భవానీగా, ఆధునిక భావాలు కలిగిన పట్టణ అమ్మాయి యమునగా భిన్న పార్శ్వాల్లో రెండు పాత్రలు వినూత్నంగా సాగుతాయని చిత్రబృందం తెలిపింది. పల్లెటూరి యువతి పాత్రలో నలుపు శరీరవర్ణఛాయతో పూర్తిగా డీ గ్లామర్ లుక్‌లో నయనతార కనిపిస్తున్నది. ప్రత్యేకమైన మేకప్‌తో ఈ పాత్రను తీర్చిదిద్దినట్లు దర్శకుడు సృజన్ పేర్కొన్నారు. నయనతార నటించిన గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ప్రయోగాత్మకంగా ఈ పాత్ర ఉంటుందని తెలిపారు. ఆడపిల్లలపై సమాజంలో కొనసాగుతున్న వివక్ష, లైంగికదాడుల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తమిళంతో పాటు తెలుగులో ఈ సినిమా విడుదలకానుంది. ఇటీవలే చిత్రబృందం టీజర్‌ను విడుదలచేసింది.

## మృణాల్‌సేన్ ఫిలిం ఫెస్టివల్


మామిడి హరికృష్ణ

'జీవితాన్ని కళాత్మకంగా తెరపై ఆవిష్కరించి భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన గొప్ప దర్శకుడు మృణాల్‌సేన్. ప్రేక్షకులను ప్రభావితం చేసి ఆలోచింపజేసేలా ఆయన సినిమాలు ఉంటాయి' అని అన్నారు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ. ఇటీవలే కన్నుమూసిన ప్రముఖ దర్శకుడు మృణాల్‌సేన్‌కు నివాళిగా తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఫెంటాస్టిక్ ఫైవ్ ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా మృణాల్‌సేన్ ఫిలిం ఫెస్టివల్‌ను నిర్వహించనున్నది. ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరుగనున్న ఈ ఫిలిం ఫెస్టివల్‌లో మృణాల్‌సేన్ దర్శకత్వం వహించిన ఐదు ఉత్తమ చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఏడో తేదీన 'భువన్‌షోమే', ఎనిమిదిన 'ఖాంధార్', తొమ్మిదిన 'అంతరీన్', పదో తేదీన 'అకలేర్ సంధానే', పదకొండున 'ఎక్ దిన్ అచానక్' చిత్రాల్ని ప్రదర్శిస్తామని, గొప్ప దర్శకుడికి నివాళిగా ఈ ఫిలిం ఫెస్టివల్ ఉంటుందని మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. రవీంద్రభారతిలోని పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో ఈ చిత్రాలు ప్రదర్శిస్తామని ఆయన అన్నారు.

## వృద్ధుడి పాత్రలో...?


శర్వానంద్

కేవలం విజయాలు సాధిస్తే సరిపోదు. పాత్రలపరంగా ప్రయోగాలు చేసినప్పుడే ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకోగలుగుతామని నమ్ముతున్నారు మన యువహీరోలు. ఈ దిశగా వైవిధ్యమైన పాత్రల వైపు మొగ్గుచూపుతున్నారు. తాజా చిత్రంలో యువహీరో శర్వానంద్ వృద్ధుడి పాత్రలో కనిపించబోతున్నారు. వివరాల్లోకి వెళితే... సుధీర్‌వర్మ దర్శకత్వంలో శర్వానంద్ ఓ చిత్రాన్ని చేస్తున్న విషయం తెలిసిందే. పీరియాడికల్ డ్రామాగా రూపొందిస్తున్న ఈ చిత్రంలో శర్వానంద్ పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుందట. ఈ చిత్ర కథకు 1980దశకాన్ని నేపథ్యంగా ఎంచుకున్నారు. ఈ సినిమాలో శర్వానంద్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించబోతున్నారు. కథానుగుణంగా కొన్ని సన్నివేశాల్లో ఆయన వృద్ధుడిగా కనిపిస్తారని తెలిసింది. ప్రోస్థటిక్ మేకప్ ద్వారా వృద్ధుడి గెటప్‌ను తీర్చిదిద్దుతున్నారు. కల్యాణిప్రియదర్శిని కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది.

## అభిమానులకు కానుక!


దీపికాపదుకునే

ఇటీవలే 33వ వసంతంలోకి అడుగుపెట్టింది బెంగళూరు సోయగం దీపికాపదుకునే. రణవీర్ సింగ్‌తో వివాహానంతరం ఆమె జరుపుకున్న మొదటి పుట్టిన రోజు ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా స్వీయ విశేషాల సమాహారంగా ఓ కొత్త వెబ్‌సైట్‌ను ఆరంభించింది దీపికాపదుకునే. ఇందులో తన సినిమాలు, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ముఖ్యమైన అంశాల్ని పొందుపరిచింది. 'అభిమానులకు కానుకగా కొత్త వెబ్‌సైట్‌ను మొదలుపెట్టాను. నా సినిమాలకు సంబంధించిన తాజా సమాచారాల్ని ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటాను. పుట్టినరోజును పురస్కరించుకొని ఓ మంచి పనికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది' అని చెప్పింది. ప్రస్తుతం దీపికాపదుకునే 'చపాక్' అనే పేరుతో స్వీయ నిర్మాణంలో ఓ సినిమా చేయబోతున్నది. యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు మేఘన గుల్జార్ దర్శకత్వం వహిస్తారు. ఇదిలావుండగా శనివారం పుట్టినరోజు జరుపుకున్న దీపికాపదుకునేకు బాలీవుడ్ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

## ఆ భయం నాకు ఎప్పుడూ లేదు!


సుమంత్

'చిన్నతనం నుంచి నేను తాతగారిలా కనిపిస్తానని, నాలో ఆయన పోలికలు వున్నాయని అంతా అనేవారు. దాన్ని ప్రదర్శించడానికి నాకు ఇన్నాళ్లుగా ఎలాంటి వేదిక దొరకలేదు. అలాంటి అవకాశం 'ఎన్టీఆర్' బయోపిక్‌తో లభించింది. క్రిష్ స్క్రిప్ట్ చెప్పినప్పుడే సినిమాలో మా తాతగారి పాత్ర చాలా నిజాయితీగా ఉంటుందని అర్థమైంది' అన్నారు సుమంత్. ఆయన అక్కినేని నాగేశ్వరరావు పాత్రలో నటించిన తాజా చిత్రం 'ఎన్టీఆర్'. బాలకృష్ణ టైటిల్ పాత్రలో నటించారు. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో సుమంత్ ఆదివారం హైదరాబాద్‌లో మాట్లాడుతూ ''ఎన్టీఆర్' బయోపిక్‌లో తాతగారి పాత్రలో నటించాను. ఇందులో ఆయనది సహాయపాత్ర మాత్రమే. ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల అనుబంధం నేపథ్యంలో సాగుతుంది. నన్ను తాతగారి పాత్రలో అభిమానులు అంగీకరిస్తారా? అంగీకరించరా? అనే భయం నాకు ఎప్పుడూ లేదు. సినిమాలో ఐదు రకాల గెటప్‌లలో కనిపిస్తాను. ఇందులో నటనాపరంగా ఏ గెటప్ విషయంలోనూ నేను కష్టపడలేదు కానీ మేకప్ విషయంలో మాత్రం కొంత శ్రమించాల్సి వచ్చింది. సినిమా రంగంలో తాతగారికి, ఎన్టీఆర్‌గారికి మధ్య మంచి పోటీ వుండేది. తాతగారి పాత్రకు నన్ను ఎంచుకుంటారని ఊహించలేదు. ఒక రోజు బాలకృష్ణ ఫోన్‌చేసి తాతగారి పాత్రకు నిన్నే అనుకుంటున్నాం అని చెప్పాడు. ఆ తర్వాత క్రిష్ కథ వినిపించాడు. క్రిష్, బాలకృష్ణ కాకుండా ఈ చిత్రాన్ని మరొకరు చేసుంటే ఖచ్చింతగా నటించే వాడిని కాదు. వాళ్లిద్దరి వల్లే ఈ బయోపిక్‌లో నటించాను. తాతగారి బయోపిక్ చేయాలని నేనే కాదు మా కుటుంబ సభ్యులెవరూ అనుకోలేదు. దానికి సంబంధించి నిర్ణయం తీసుకునే అధికారం చిన మావయ్య(నాగార్జున)కే వుంది. ఈ సినిమాలో నాకు బాలకృష్ణ గెటప్ తరువాత బాగా నచ్చిన గెటప్ రానాదే. తనని తొలిసారి సెట్‌లో చూసినప్పుడు వీడేనా అనుకున్నాను. అంతగా రానా మారిపోయి నటించాడు. ఇటీవల నేను నటించిన 'ఇదం జగత్' ఆశించిన ఫలితాన్ని అందించలేకపోయింది. దానికి సరైన ప్రచారం లేకపోవడమే కారణం. 'మళ్లీ రావా' విడుదలకు ముందు అంగీకరించిన చిత్రమది. జనవరిలో మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడిస్తాను' అన్నారు.


నిత్యామీనన్

## జయలలిత పుట్టినరోజున..

దివంగత నటి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితం ఆధారంగా 'ది ఐరన్ లేడీ' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనున్నది. టైటిల్ పాత్రలో నిత్యామీనన్ నటించనున్నది. జయలలిత పుట్టినరోజు సందర్భంగా ఫిబ్రవరి 24న ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మిస్కిన్ వద్ద సహాయకురాలిగా పనిచేసిన ప్రియదర్శిని ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. జయలలిత పాత్ర తీరుతెన్నుల కోసం ఇప్పటికే నిత్యామీనన్ పరిశోధన ప్రారంభించినట్లు తెలిసింది. ఈ సినిమాలో ఎంజీఆర్ పాత్రలో మలయాళ నటుడు సుకుమారన్ నటించనున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో ప్రధాన ఘట్టాలను తెరకెక్కించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం నిత్యామీనన్ 'ప్రాణ' అనే మలయాళ చిత్రంలో నటిస్తున్నది. ఏకపాత్రతో రూపొందిస్తున్న ఈ సినిమాలో నిత్యామీనన్ రచయిత్రి పాత్రలో కనిపించబోతున్నది.